PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 46 విజయవాడ, మంగళవారం 16 సెప్టెంబర్ 2025 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No Vijayawada, Tuesday 16 September 2025 Rs



ఫిడే మహిళల గ్రాండ్

- 2026 క్యాండిడేట్ టోర్నీకి అర్హత

8



కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న చంద్రబాబు, చిత్రంలో సిఎస్, డిజిపి, మంత్రులు

యూరియా తగ్గిస్తే రాయితీ

- బస్తాకు రూ.800 ఇస్తామన్న సిఎం
- త్వరలో విధివిధానాలు రూపకల్పన
- జిల్లాల అభివృద్ధిలో కలెక్టర్లదే కీలకపాత్ర
- కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కీలక ప్రకటన చేశారు. సోమవారం ప్రారంభమైన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన చంద్రబాబు ఈ విషయాన్ని ప్రస్తావించారు. 'యూరియా వాడకం తగ్గించే రైతులకు ప్రోత్సాహకం ఇద్దాం. బస్తాకు 800 రూపాయలు నేరుగా వారి ఖాతాల్లో జమ చేద్దాం' అని సిఎం అన్నారు. రెండు రోజుల పాటు రాష్ట్ర సచివాలయంలో జరిగే కలెక్టర్ల కాన్ఫరెన్స్ సోమవారం ప్రారంభమైంది. సిఎస్ విజయానంద్ ఈ సమావేశానికి అధ్యక్షతన వహించారు.సిసిఎల్ఎ కమిషనరు జయలక్ష్మీ స్వాగతోపన్యాసం చేశారు. తొలిరోజు ,ప్రాధమిక, పరిశ్రమలు, సేవారంగాలు, సూపర్6, పి4, సర్క్యులర్ ఎకానమీ, లాజిస్టిక్స్, సంక్షేమం, అభివృద్ధి తదితర రంగాలపై సిఎం సమీక్షించారు. వ్యవసాయశాఖపై జరిగిన సమీక్షలో సిఎం యూరియా కొరత అంశాన్ని ప్రస్తావించారు. యూరియా వినియోగం పెరిగితే క్యాన్సర్ వ్యాధి వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా వినియోగం ఎక్కువైతే ప్రమాదం ఏ స్థాయిలో ఉంటుందనేదానికి పంజాబ్ రాష్ట్రం ఓ కేస్‌స్టడీ అని సిఎం పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రం క్యాన్సర్ కేసుల్లో టాప్-5లో ఉందని, యూరియా వినియోగం మరింతగా పెరిగితే టాప్-1కు వెళ్లిపోతుందన్నారు. ఈ క్రమంలో యూరియా వాడకం తగ్గించే అంశంపై రైతుల్లో అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇదే సందర్భంలో యూరియా వినియోగం తగ్గించిన రైతులకు ప్రోత్సాహకాలు ఇచ్చే విధానం తీసుకురావాలని సిఎం చంద్రబాబు చెప్పారు. పిఎం ప్రణామ్ కింద బస్తాకు రూ.800లను ప్రోత్సాహకంగా కేంద్రం రాష్ట్రానికి ఇస్తుందని ఆ డబ్బును రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడం కంటే రైతులకు ఇవ్వడం ముఖ్యమన్నారు. ఇందుకు సంబంధించిన విధి విధానాలను త్వరలో రూపొందించాలని సిఎం కలెక్టర్లు, ఉన్నతాధికారులను ఆదేశించారు.

మానవీయ కోణంలో ఆలోచించండి

అంతకుమందు ప్రారంభోపన్యాసంలో కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు మానవీయ కోణంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఆఫీసులో కూర్చొని పేపర్‌మీద చూస్తే అంతా చక్కగా ఉంటుందని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. ప్రధాని, సిఎం తర్వాత అత్యంత కీలకమైన వ్యక్తులు కలెక్టర్లని, జిల్లాలను అభివృద్ధి చేయడంలో అత్యంత కీలకమైన బాధ్యత వారిదేనని చెప్పారు. ప్రభుత్వం రూపొందించిన విధానాలను సక్రమంగా అమలు చేసేది కలెక్టర్లేనని, సిఎస్, డిజిపిల నుంచి క్షేత్ర స్థాయి వరకు సరైన వ్యక్తి సరైన చోట ఉండాలనే లక్ష్యంతో నియామకాలు చేశామన్నారు. సమర్ధులైన వారికే కలెక్టర్ల పోస్టింగ్‌లిచ్చామని సిఎం స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా పనిచేయాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఎంతటి ప్రాధాన్యం ఇస్తారో శాంతి భద్రతల విషయంలో కూడా అంతే ప్రాధాన్యతనివ్వాలన్నారు. తాను అధికారులకు సపోర్టుగా ఉంటానని, కానీ విఫలమైతే మాత్రం కఠిన నిర్ణయాలు తీసుకుంటానని, కలెక్టర్ల సదస్సు కొత్త ట్రెండ్‌ను సృష్టించాలన్నారు.

ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని అమలు చేస్తున్నట్లు సిఎం పేర్కొన్నారు. సమర్ధ నీటి నిర్వహణతో రిజర్వాయర్లు నింపామని, వాణిజ్యపంటల విషయంలోనూ సరైన సమయానికి నిర్ణయాలు తీసుకుని లాభం వచ్చేలా చేయాలని సిఎం కలెక్టర్లకు సూచించారు. గతంలో భూ వివాదాలను సృష్టించారని రెవెన్యూ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారన్నారు. దీన్ని సరిచేయాలని, రిజిస్ట్రేషన్ పత్రాలను ట్యాంపర్ చేయకుండా ఉండేలా రూపొందించే విధానం ఉండాలన్నారు. ఇక జిఎస్‌టి రెండో దశ సంస్కరణల ఫలాలు ప్రజలందరికీ అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవడంతో పాటు ఒక నెల పాటు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని సిఎం పేర్కొన్నారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీతో పాటు ఈజ్ ఆఫ్ లివింగ్ ముఖ్యమైన అంశం కావాలని సిఎం అన్నారు. సిఎస్ విజయానంద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాలసీలు, అభివృద్ధి , ఎదురయ్యేసవాళ్లపై .అందరూ దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి పెట్టుబడులకు 23 పాలసీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. జిఎస్‌డిపి అభివృద్ధితో పాటు విజన్ తదితర అంశాలపై కలెక్టర్లు దృష్టి సారించాలన్నారు. ఆర్థికాభివృద్ధి, ఉపాధి, ఉద్యోగాల కల్పనతో పాటు సమగ్రాభివృద్ధిపై కలెక్టర్లు దృష్టి సారించాలన్నారు.

సంక్షేమంతో సాధికారత : సిఎం

మరిన్ని వార్తలు 2లో..

'వక్ఫ్' కీలక సెక్షన్ల నిలిపివేత

- సవరణ చట్టంపై సుప్రీం ఆదేశం
- బోర్డులో మెజారిటీ ముస్లిం సభ్యులుండాలి
- ఐదేళ్ల ఇస్లాం అమలుపై నిబంధనలు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వక్ఫ్ సవరణ చట్టంలోని కొన్ని కీలక సెక్షన్లను సుప్రీంకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. కనీసం ఐదేళ్లపాటు ఇస్లాం మతాన్ని ఆచరించిన వ్యక్తికి మాత్రమే ఆస్తిని వక్ఫ్‌గా చేయడానికి అవకాశం ఉంటుందన్న నిబంధన (సెక్షన్ 3)ని సుప్రీంకోర్టు నిలిపివేసింది. ఒక వ్యక్తి ఐదేళ్ల పాటు ముస్లిం మతాన్ని ఆచరించడమంటే వాటికి గల నియమనిబంధనలు, విధి విధానాలేమిటో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించేంత వరకు ఈ నిబంధనను నిలిపివేస్తున్నట్లు జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. సెక్షన్ 3తో పాటు 9, 14, 23, 36, 107, 108 సెక్షన్లను కూడా సుప్రీంకోర్టు నిలిపేసింది. మరికొన్ని సెక్షన్లకు మాత్రం కొంత రక్షణ అవసరమని వ్యాఖ్యానించింది.

వక్ఫ్, వక్ఫ్ స్టేక్ హోల్డర్ల హక్కులను జిల్లా కలెక్టర్ వంటి ప్రభుత్వ అధికారులు నిర్ణయించడానికి అనుమతించడమనేది అధికారాల విభజన సిద్ధాంతానికి విరుద్ధంగా వుందని ధర్మాసనం అభిప్రాయపడింది. వక్ఫ్ బోర్డులో ముస్లిం సభ్యుల సంఖ్య కచ్చితంగా మెజారిటీలోనే వుండాలని స్పష్టం చేసింది. బోర్డులో అత్యధికంగా ముగ్గురు లేదా నలుగురు ముస్లిమేతర సభ్యులు వుండొచ్చని సూచించింది. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ముస్లిం వ్యక్తే వుండటం మంచిదని అభిప్రాయపడింది.

నిలిపివేసిన నిబంధనలు

సెక్షన్ 3 (ఆర్) : ఆస్తిని వక్ఫ్‌కు దానం చేయాలంటే కనీసం 5 సంవత్సరాలు ఇస్లాం ఆచరించి ఉండాలన్న నిబంధన నిలిపివేశారు. ఎందుకంటే, దీన్ని అమలు చేయడానికి సరైన నియమాలు లేకపోతే అధికార దుర్వినియోగం జరిగే అవకాశం వుందని కోర్టు అభిప్రాయపడింది.

సెక్షన్ 2(సి) : నియమిత అధికారి నివేదిక ఇచ్చే వరకు ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించరాదన్న నిబంధన కూడా నిలిపివేశారు. ఎందుకంటే ఆస్తి హక్కులపై కార్యనిర్వాహక అధికారి తీర్పు ఇవ్వలేరు.

సెక్షన్ 3 సి: రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చేసే అధికారం కలెక్టర్‌కు ఇవ్వడమనేది అధికారాల విభజనకు వ్యతిరేకం. అధికారులు తుది నివేదిక వచ్చే వరకు ఆస్తి హక్కులేవీ ప్రభావితం కావు.

ఇతర ముఖ్య నిబంధనలు

- వక్ఫ్ బోర్డులో నలుగురి కంటే ఎక్కువ మంది ముస్లిమేతర సభ్యులు ఉండకూడదు. రాష్ట్ర స్థాయిలో ముగ్గురి కంటే ఎక్కువ ఉండకూడదు.
- వక్ఫ్ బోర్డు ఎక్స్-అఫీషియో అధికారి ముస్లిం సమాజానికి చెందినవారై ఉండాలి.
- వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) ముస్లిం సమాజానికి చెందినవారై ఉండాలని సుప్రీంకోర్టు సూచించింది. ముస్లిమేతర వ్యక్తిని సిఇఒగా నియమించే సవరణను మాత్రం నిలిపివేయలేదు.
- తుది తీర్పు వచ్చే వరకు వక్ఫ్ ఆస్తుల హక్కులు, స్వాధీనం

మిగతా 7లో

స్వాగతిస్తున్నాం : ఎంఎ బేబి

వక్ఫ్ (సవరణ)చట్టం 2025లోని కొన్ని నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే విధించడాన్ని సిపిఎం స్వాగతిస్తున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ తెలిపారు. వివాదాల్లో ఉన్న ఆస్థులను వక్ఫ్ ఆస్థులుగా పరిగణించకూడదనే నిబంధనపై పాక్షిక స్టే విధించడం సరైన నిర్ణయమని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

పోలవరం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ

అమలుకు తక్షణ చర్యలు

- కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్‌కు సిపిఎం బృందం వినతి
- త్వరలో కేంద్ర బృందాన్ని పంపిస్తామని మంత్రి హామీ



జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం ప్రతినిధి బృందం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పోలవరం ప్రాజెక్టుకు పునరావాసం, పరిహార (ఆర్అండ్ఆర్) ప్యాకేజీని అమలు చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సిపిఎం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం నాడిక్కడ పోలవరం నిర్వాసితుల సమస్యలపై జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌ను కలిసిన రాజ్యసభలో సిపిఎం పక్ష నేత జాన్ బ్రిట్టాస్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు కె లోకనాథం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, ఎఎస్ఆర్ జిల్లా కార్యదర్శి బి కిరణ్, ఏలూరు జిల్లా కమిటీ సభ్యులు డి రమేష్‌తో కూడిన బృందం వివరణాత్మక వినతిని అందజేసింది. కాంటూర్ లెక్కల్లో తప్పులు, పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాల గురించి సిఆర్ పాటిల్‌కు సిపిఎం నేతలు వివరించగా, ఆయన స్పందిస్తూ.. త్వరలోనే నిపుణులతో కూడిన కేంద్ర బృందాన్ని పంపించి క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర బృందాన్ని పంపించేందుకు చర్యలు తీసుకోవాలని జలశక్తి మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ ప్రదీప్, ప్రాజెక్టుల కేంద్ర ప్రభుత్వ బాధ్యులు ప్రవీణ్ కుమార్‌కు సూచించారు. అనంతరం ఎంపి జాన్ బ్రిట్టాస్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పోలవరం నిర్వాసితుల సమస్యలు పట్టించుకోవడం లేదని, అవి తీర్చాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు.

'పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అతి ముఖ్యమైన నిర్వాసితులకు ఆర్అండ్ఆర్‌ను అమలు చేయలేదు. పునరావాసంతో సహా మొత్తం ఖర్చు కేంద్ర ప్రభుత్వ బాధ్యత. 8 మండలాల్లోని 392 గ్రామాల్లో 1,06,000 కుటుంబాలు మునిగిపోతున్నాయి. పూర్తి రిజర్వాయర్ స్థాయి (ఎఫ్ఆర్ఎల్) చేరుకున్నప్పుడు 2 లక్షల నుంచి 3 లక్షల మంది ప్రజలు నిరాశ్రయులవుతారని అంచనాలు సూచిస్తున్నాయి. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వటం లేదు. ప్రాజెక్టు డిపిఆర్ అంచనా ప్రకారం ఆర్అండ్ఆర్‌కు దాదాపు

మిగతా 7లో

డిఎస్‌సిలో 15,941 మంది ఎంపిక

- 19న నియామక పత్రాలు
- నవంబర్‌లో టెట్ : కోన శశిధర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మెగా డిఎస్‌సి-2025లో ఎంపికైన అభ్యర్థుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. 16,347 పోస్టులకు విడుదల చేసిన ఈ నోటిఫికేషన్‌లో 15,941 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసింది. 406 ఖాళీలు సంబంధిత కమ్యూనిటీలో అర్హత పొందిన అభ్యర్థులు అందుబాటులో లేకపోవడంతో భర్తీ కాలేదని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం ద్వారా సోమవారం విడుదల చేశారు. అనంతరం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజుతో కలిసి సచివాలయంలో శశిధర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేసిన డిఎస్‌సి ప్రక్రియను కేవలం 150 రోజుల్లో పూర్తిచేసి అభ్యర్థుల తుది జాబితాను జారీ చేశామని శశిధర్ చెప్పారు. మొత్తం 10 యాజమాన్యాల్లో 16,347 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశామని తెలిపారు. 3,36,300 మంది అభ్యర్థులు 5,77,675 దరఖాస్తులు చేశారన్నారు. తొలిసారి ఎస్‌సి వర్గీకరణ అమలు చేసిన

మిగతా 7లో

మా జీవితాలతో ఆడుకోవద్దు

- హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని ఆదివాసీల ర్యాలీ, మహాధర్నా 3

భూమిచ్చాక నిర్వాసితుడు ఉద్యోగం కోసం నిరీక్షించాల్సిందేనా?

- హైకోర్టు ఆగ్రహం 5

పలువురు ఐఎఎస్‌ల బదిలీ

- రతన్ టాటా ఇన్నోవేషన్ సిఇఒగా ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పలువురు ఐఎఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు జిఓఆర్‌టి నెంబరు 1696ను సోమవారం విడుదల చేసింది. ఏలూరు జాయింట్ కలెక్టరు పి ధాత్రిరెడ్డిని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సిఇఒగా బదిలీ చేశారు. కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టరు గీతాంజలి శర్మను ఎపి స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ ఎమ్‌డిగా, పాడేరు సబ్‌కలెక్టరు శౌర్యమన్ పటేల్‌ను ఆర్‌టిజిఎస్ అడిషనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా నియమంచారు. అలాగే, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఐపిఎస్ రాహుల్ దేవ్ శర్మకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డైరెక్టర్, ఎపిఎస్‌బిసిఎల్ ఎమ్‌డిగా అదనపు బాధ్యతలతోపాటు డిస్టిలరీస్ అండ్ బ్రేవరీస్ కమిషనర్‌గా పూర్తి బాధ్యతలను అప్పగిస్తూ ఎక్సైజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా జిఓ జారీ చేశారు.

యుటిఎఫ్ 'రణభేరి'

- రాష్ట్రంలో ఐదు ప్రాంతాల నుంచి జాతాలు ప్రారంభం
- శ్రీకాకుళం జిల్లాలో అడ్డుకున్న పోలీసులు
- రాష్ట్ర అధ్యక్షుడు సహా పలువురు అరెస్టు, విడుదల
- 19 వరకూ కొనసాగనున్న జాతాలు



కాకినాడ జిల్లా శంఖవరంలో జాతాకు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు (ఇన్‌సెట్‌లో) యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లును అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- యంత్రాంగం

విద్యారంగ, ఉపాధ్యాయుల ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ రణభేరి మోగించింది. సోమవారం రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల నుంచి జాతాలను ప్రారంభించింది. ఈ జాతాలు ఈ నెల 19 వరకూ కొనసాగనున్నాయి. తొలిరోజు ఆయా జాతాలకు ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై స్వాగతం పలికారు. శ్రీకాకుళం జిల్లా పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు ఢంకా మోగించి రణభేరి జాతాను ప్రారంభించారు. కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు, సిఐ సూర్యనారాయణ పోలీసు సిబ్బందితో అక్కడకు చేరుకొని సెక్షన్-30 అమల్లో ఉందని, జాతాకు అనుమతుల్లేవని అడ్డుకున్నారు. తాము శాంతియుతంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని యుటిఎఫ్ నాయకులు చెప్పినా డిఎస్‌పి అంగీకరించలేదు. దీంతో, యుటిఎఫ్ నాయకులు జాతాను కొనసాగించేందుకు ప్రయత్నించగా వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ కోశాధికారి రెడ్డి మోహనరావు, రాష్ట్ర కార్యదర్శి కిషోర్ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తితోపాటు పలువురు నాయకులను పోలీసులు

మిగతా 7లో

ప్రతి మంగళవారం పరిశ్రమల రోజు

- పరిశ్రమల శాఖ కార్యదర్శి సూచన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి



రాష్ట్రంలో పరిశ్రమలను అభివృద్ధి చేసేందుకు ఇకపై ప్రతి మంగళవారాన్ని పరిశ్రమల రోజుగా నిర్వహించాలని పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్ కలెక్టర్లకు సూచించారు. కలెక్టర్ల సదస్సు సందర్భంగా పరిశ్రమల శాఖపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ గ్రీవియెన్స్ డే తరహాలోనే పరిశ్రమల రోజును కూడా నిర్వహించాల అన్నారు. పరిశ్రమలు ఏర్పాటుచేసేందుకు ముందుకొచ్చే సంస్థలు, వ్యక్తులతో స్వయంగా సంప్రదింపులు జరపాలని కలెక్టర్లకు సూచించారు. పరిశ్రమలు ఏర్పాటుచేసేందుకు ప్రధానంగా భూమి అవసరమని, అందువల్ల భూసేరణపై కలెక్టర్లు దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ భూమి లభ్యం కాని ప్రాంతాల్లో ల్యాండ్ పూలింగ్ ద్వారా భూసేకరణ చేయాలని సూచించారు.

జగ్గయ్యపేటలో మిస్సైల్ క్లస్టర్

గతేడాది జూన్ నుంచి ఇప్పవరకు రాష్ట్రంలో పది లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు ఆమోదం లభించినట్లు యువరాజ్ పేర్కొన్నారు. ప్రస్తుతం 30 క్లస్టర్లలో, రానున్న రోజుల్లో మరో 20 క్లస్టర్లలో లక్ష ఎకరాల ఖాళీ స్థలాన్ని గుర్తించినట్లు చెప్పారు. విశాఖ, శ్రీకాకుళం జిల్లాల మధ్య మూడు వేల ఎకరాల్లో నావల్ క్లస్టర్, మరో ఐదు చోట్ల డిఫెన్స్ క్లస్టర్లు, జగ్గయ్యపేటలో మూడు ఎకరాల స్థలంలో మిస్సైల్, ఆయుధాల క్లస్టర్లు, ఓర్వకల్లులో అన్‌మాన్డ్ సిస్టమ్ క్లస్టర్, అనంతపురం జిల్లా మడకశిర, లేపాక్షి మధ్యలో ఐదు వేల ఎకరాల్లో ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్ క్లస్టర్, ప్రకాశం జిల్లాలోని దొనకొండలో నాలుగు వేల ఎకరాల్లో ఎయిర్‌క్రాఫ్ట్ విడిభాగాల క్లస్టర్ రాబోతున్నాయని వివరించారు.

2029 నాటికి రూ.50 వేలకోట్ల పర్యాటక పెట్టుబడి

- పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



పర్యాటక రంగంలో 2029 నాటికి రూ.50 వేలకోట్ల పెట్టుబడి, 3 లక్షల ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు. సచివాలయంలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. 2025-26 మొదటి త్రైమాసిక లక్ష్యాల్లో 22.14 శాతం పర్యాటక రంగం సాధించిందని, 10.70 శాతం వృద్ధిని కొనసాగించిందని పేర్కొన్నారు. సేవల రంగం రాష్ట్రం జిఎస్‌డిపిలో అత్యధిక వాటా కలిగి ఉందని చెప్పారు. 2025-26కు రూ.7,10,714 కోట్ల విలువైన సేవా రంగం పలు విభాగాల్లో స్థిరమైన పనితీరు చూపిందని చెప్పారు. కమ్యూనికేషన్స్ 25.90 శాతం లక్ష్యాన్ని సాధించి అత్యధిక పనితీరుతో నిలిచిందన్నారు. విశాఖపట్నం నుంచి పుదుచ్చేరి వరకు కార్డేలియా క్రూజ్, ట్యూడా, అరకులో టెంట్ సిటీలు, వైజాగ్‌లో 14 ఆకర్షణలను కవర్ చేసే హాఫ్ ఆన్ హాఫ్ ఆఫ్ బస్సులు, క్యారవాన్లతో పార్కులు వంటి కొత్త కార్యక్రమాలను విజయవంతంగా ప్రారంభించామని చెప్పారు. పర్యాటకశాఖకు 3,212 ఎకరాల భూమిని ప్రభుత్వం బదిలీ చేసిందన్నారు.

'ఉపాధి'లో 15.28 కోట్ల పనిదినాలు

- పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ఉపాధి హామీ పథకంలో వేతనదారులకు రాష్ట్రంలో 15.28 కోట్ల పని దినాలు కల్పించినట్లు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ వెల్లడించారు. సచివాలయంలో సోమవారం కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. ఇది నిర్దేశించిన లక్ష్యం కన్నా ఎక్కువని అన్నారు. మొత్తం 63.60 లక్షల మందికి పని కల్పించినట్లు చెప్పారు. ఈ పథకం కింద రూ.6057.84 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. పల్లె పండుగలో భాగంగా 4 వేల కిలోమీటర్ల సిసి రోడ్లను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. 22,514 పశు సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. రాష్ట్రంలో 10 లక్షల ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం ఇప్పటికే 1.02 లక్షల ఫామ్ పాండ్స్ నిర్మాణాలు పూర్తైనట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లో అంతర్గత రోడ్లను సిసి రోడ్లుగా అభివృద్ధి చేసే పనులు వేగవంతం చేశామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 71,436 కిలో మీటర్ల మేర అంతర్గత రోడ్లు ఉన్నాయని, వాటిలో 58,436 రోడ్లు సిసి రోడ్లుగా మార్చామని తెలిపారు. రోడ్లు అనుసంధానం లేని గిరిజన ప్రాంతాలకు అడవి తల్లి బాట కార్యక్రమంలో భాగంగా రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. 1753 గిరిజన ఆవాసాలకు గాను 1483 ఆవాసాలకు రోడ్ల అనుసంధానం లేదని తెలిపారు.

సంక్షేమంతో సాధికారత

- అసమానతలు తగ్గించే అన్ని మార్గాలు వినియోగించాలి
- కలెక్టర్ల సదస్సులో సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంక్షేమం అంటే పేదలకు దానం కాదని.. వారి అభివృద్ధికి, సాధికారతకు మార్గమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సచివాలయంలో సోమవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఆర్థిక అసమానతలు తగ్గించే అన్ని మార్గాలను వినియోగించుకుందామని పిలుపు నిచ్చారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధికి సమతూకంగా నిధులు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. మూలధన వ్యయానికి ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం అందరికీ అందించామన్నారు. లబ్ధిదారులకు సాయం అందే విషయంలో తలెత్తే లోటుపాట్లను కలెక్టర్లు సరిదిద్దాలని సూచించారు. స్త్రీ శక్తి విజయవంతం అయ్యిందన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకంలో భాగంగా ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. అక్టోబరు 1వ తేదీన 3 లక్షల మంది ఆటో డ్రైవర్లకు రూ.15వేలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. వడ్డెర్లకు క్వారీల్లో రిజర్వేషన్లు అమలు చేయడంతోపాటు సీనరేజిలో మినహాయింపు ఇస్తామని, ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం ఇస్తున్నట్లు చెప్పారు. హజ్ యాత్రీకులకు లక్ష ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. నిర్మాణ రంగంలో కార్మికుల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేస్తున్నామని, శాశ్వత కుల ధృవీకరణ పత్రాలు త్వరలోనే జారీ చేస్తామన్నారు. భోగాపురం ఎయిర్ పోర్ట్‌కు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టినట్లు తెలిపారు. ఎవరికీ అన్యాయం జరగకుండా ఎస్సీ వర్గీకరణ పూర్తి చేశామని వెల్లడించారు. డ్రైవర్ల సాధికార సంస్థ ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు పావలా వడ్డీకే ఎంతైనా రుణం తీసుకునే అవకాశం ఉందన్నారు. సంక్షేమ వసతి గృహాలను కలెక్టర్లు తప్పనిసరిగా సందర్శించాలని సూచించారు. వసతి గృహాలకు సరికొత్త రూపు తీసుకురావాలని, పునర్నిర్మాణానికి ఎంత వ్యయం అవుతుందో అంచనా రూపొందించాలన్నారు. ఎస్సి, ఎస్టి, బిసి వసతి గృహాలను మెరుగు పరిచేందుకు నిధుల కొరత లేదన్నారు. కలెక్టర్లు తమ టాలెంట్‌తో కొత్త పంథాలో పాలన చేపట్టాలని యూనివర్సల్ హెల్త్ సర్వీసెస్ కింద రూ.2.5 లక్షల భీమా రాష్ట్రంలో ప్రజలందరికీ వస్తుందన్నారు. జన ఔషధి కింద జనరిక్ మెడిసిన్స్ కూడా అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. పి4 మరో గేమ్ చేంజర్ కార్యక్రమం అన్నారు. వాలంటీరీగానే అందరూ ముందుకు వస్తున్నారని, బలవంతం ఉందన్నారు. పి4, డ్వాక్రా, మెప్మా ఇంటిగ్రేట్ చేసి ముందుకు వెళ్లాలని సూచించారు.



కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు, సిఎస్ విజయానంద్

డ్వాక్రా సంఘాల పొదుపు రూ.20,739 కోట్లు

డ్వాక్రా సంఘాలు పొదుపు మొత్తం రూ.20,739 కోట్లకు చేరిందని, ఇది దేశంలోనే అత్యధిక మొత్తమని పంచాయతీరాజ్‌శాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి వాకాటి కరుణ తెలిపారు. సచివాలయంలో సోమవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో ఆమె మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘాలు రుణాల మంజూరులో కలెక్టర్లు దృష్టి సారించాలని కోరారు. ఈ సంఘాల్లో రుణాల ఎగవేత కేవలం 0.02 శాతమని పేర్కొన్నారు. ప్రస్తుతం రూ.40,424 కోట్లతో స్త్రీనిధి, ఉన్నతి బ్యాంక్ లింకేజి రుణాలు అందించామని వెల్లడించారు. రాష్ట్రంలో 89 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నారని, 8.32 లక్షల డ్వాక్రా సంఘాలు ఉన్నట్లు తెలిపారు. ఈ సంఘాలు తీసుకున్న రుణాల్లో 74 శాతం సందప సృష్టి, 13 శాతం ఉత్పాదకత వినియోగిస్తున్నట్లు చెప్పారు.

పాడి రంగం పట్ల మహిళలు ఆసక్తి కనబరుస్తున్నారని, 6,84,876 మంది పాడిపశువుల కోసం రుణాలు కావాలని కోరుతున్నారని, ఈ రుణాల విలువ రూ.8,989 కోట్లు ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే 3,39,820 మందికి రూ.4,415 కోట్లు రుణాలు అందించినట్లు తెలిపారు. పొదుపు సంఘాలతో మిల్లెట్ కేఫ్‌లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 875 మిలెట్ కేఫ్‌లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకూ 12 జిల్లాల్లో 200 కేఫ్‌లు ఏర్పాటు చేశామన్నారు. నమో డ్రోన్ దీదీ పథకంలో 440 మంది మహిళలను డ్రోన్ ఆపరేటర్లుగా చేయనున్నట్లు చెప్పారు. డ్వాక్రా సంఘాల పనితీరు పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. డ్వాక్రా పొదుపు సొమ్ము, రుణాల వివరాలు, ఇతర అన్ని సమస్యల గురించి తెలుసుకోవడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించడంపై కార్యదర్శి కరుణను ఆయన అభినందించారు.

'ఆ' అధికారం కలెక్టర్లదే : అనగాని

ప్రైవేట్ భూములు తప్పుడు రిజిస్ట్రేషన్లు జరిగితే వాటిని రద్దు చేసే అధికారం కలెక్టర్లదేనని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. ప్రభుత్వం కేటాయించిన భూముల్లో పరిశ్రమలు ప్రారంభమయ్యేలా చూడాలని అన్నారు. త్వరలో భూమి రిజిస్ట్రేషన్ అయిన వెంటనే సుమోటోగా పట్టాదారుపాస్‌పుస్తకాలు ఇంటికి వచ్చేలా కసరత్తు చేస్తున్నట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

ఈ విధంగా చేయడం వల్ల భూ యజమానులు, రైతులు పాస్‌పుస్తకాల కోసం అధికారుల చుట్టూ తిరిగే పని ఉండదన్నారు. భూములు రీ సర్వే చేసిన గ్రామాల్లో కొత్తగా ఉచితంగా 21లక్షల పట్టాదారుల పాస్‌పుస్తకాల పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, వీటిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పంపిణీ చేస్తామన్నారు. ఎటువంటి తప్పులు లేకుండా పట్టాదారుపాస్‌పుస్తకాలు అందించే బాధ్యత ప్రభుత్వానిదే నన్నారు. ఈ విషయంలో రైతులెవరూ కంగారు పడాల్సిన పనిలేదన్నారు. ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానం (పిజిఆర్ఎస్)ను పకడ్బందీగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తున్నామని, ఒక వేళ పరిష్కరించలేకపోతే కారణాలను చెబుతూ స్పీకింగ్ ఆర్డర్స్ ఇస్తున్నట్లు ఆయన చెప్పారు.

కలెక్టర్ల కాన్ఫరెన్స్

కరువు రహిత రాష్ట్రం

- 2027 డిసెంబర్ కల్లా పోలవరం
- ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చడమే ధ్యేయంగా అన్ని ప్రాంతాలకు, రంగాలకు పుష్కలంగా నీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్ తెలిపారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో తొలిరోజు జలవనరులపై ఆయన ప్రెజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం వాతావరణంలో అనూహ్య మార్పులు వచ్చాయని తెలిపారు. ఎప్పుడు వర్షం వస్తుందో క్లౌడ్ బరస్ట్ అవుతుందో అంతుపట్టని విధంగా ఉందని అన్నారు. ఇటువంటి అసమానతల మధ్య నీటి సంరక్షణ పెద్ద సవాలుగా మారుతుందని పేర్కొన్నారు. ఉన్న నీటి వనరులను ఎలా సంరక్షించుకోవాలనే అంశంపై కలెక్టర్లు దృష్టి సారించాలని తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలో 88.99 శాతం నిండాయని పేర్కొన్నారు. 1,014 టిఎంసిల నీటి సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లు ఉంటే 914 టిఎంసిల నీటి లభ్యత ఉందని వివరించారు. అలాగే చిన్న, మధ్య తరహా రిజర్వాయర్లు కూడా నిండాయని మంచి శుభపరిణామమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో 38,457 మీడియం ఇరిగేషన్ ట్యాంకులను అభివృద్ధి చేయాలని సంకల్పించామన్నారు. ఇప్పటికే 5,815 ట్యాంకులను పూర్తి చేశామని చెప్పారు. వీటిపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. 7,762 గ్రామాల్లో భూగర్భ జలాల నీటిమట్టం ఎనిమిది మీటర్ల కంటే దిగువన ఉన్నాయని, వాటిని రీఛార్జి చేయించాలని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబర్ నాటికల్లా పూర్తి చేయాలని లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. పనులు వేగవంతంగా చేపట్టి లక్ష్యానికంటే ముందుగానే జూన్ 2027 నాటికి పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ఈ ఏడాది అక్టోబరు నెలాకరుకల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దీనివల్ల అనకాపల్లి వరకూ నీటిని తీసుకుపోగలమని చెప్పారు. ఈ పనులపై కూడా కలెక్టర్లు శ్రద్ధ పెట్టాలన్నారు. 3.21 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని తెలిపారు. 7 ప్రాజెక్టులకు సంబంధించి రూ.9,221 కోట్లతో పూర్తి చేస్తామని, దీని ద్వారా 3,21,862 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించనున్నామని వివరించారు.

పాఠశాలకు అనుసంధానంగా అంగన్‌వాడీ కేంద్రాలు

- మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



పాఠశాలలకు అనుసంధానంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉండేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి సూచించారు. సచివాలయంలో సోమవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో ఆమె మహిళా శిశు సంక్షేమానికి సంబంధించి ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు ఏళ్లు దాటిన పిల్లలు కూడా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండిపోతున్నారని, వీరిని బడిలో చేర్చేందుకు కలెక్టర్లు దృష్టి సారించాలన్నారు. అంగన్వాడీలను మరింత పారదర్శకంగా, జవాబుదారీ తనంగా నిర్వహించాలన్నదే ప్రభుత్వ ఆశయమని అన్నారు. ఇప్పటి వరకూ అంగన్వాడీలు అంటే కేవలం తల్లులు, బిడ్డలను మాత్రమే అనుకునేవారని, ఇప్పుడు తండ్రులను కూడా భాగస్వాములుగా చేస్తున్నామని తెలిపారు. బిడ్డ బాధ్యత తల్లితోపాటు తండ్రికి కూడా ఉంటుందని, దీనిపై తండ్రులకు చైతన్యం కల్పిస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వికలాంగులైన పిల్లల కోసం లిఫ్ట్ లేక ర్యాంప్‌లు ఏర్పాటు చేసేందుకు నిధులున్నాయని చెప్పారు రాష్ట్రంలో కొత్తగా 13 వృద్ధాశ్రమాలను ఆటల్ వయోజన అభ్యుదయ యోజన పథకంలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 9,246 మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నది లక్ష్యమని, ఇప్పటి వరకూ 6,662 పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 17 నుంచి 'రాష్ట్రీయ పోషన్ మా' కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. పిల్లల హాజరు 65 శాతం లోపు ఉన్న జిల్లాల్లో కృష్ణా, పల్నాడు, పశ్చిమ గోదావరి ఉన్నాయని, ఈ జిల్లాల కలెక్టర్లు పిల్లల హాజరుపై దృష్టి సారించాలని సూచించారు.

తిరోగమనంలో వృద్ధి

- 2024-25లో 12.02 శాతం
- ఈ ఏడాది అంచనా 17.11 శాతం
- వచ్చే ఏడాది నుంచి క్రమంగా క్షీణత
- ముఖ్యమంత్రికి నివేదించిన అధికారులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎంతో గొప్పగా చెప్పుకుంటున్న రాష్ట్ర వృద్ధి రానున్న కాలంలో తిరోగమనంలో పయనించనుంది. సాక్ష్యాత్తూ ఉన్నతాధికారులే కలెక్టర్ల సదస్సు నేపథ్యంలో ముఖ్యమంత్రికి ఈ మేరకు వివరించారు. నిరంతరాయంగా 15 శాతం వృద్ధి సాధిస్తామని పదేపదే చెబుతున్నప్పటికీ, తాజా గణాంకాల మేరకు 2047 నాటికి భారీగా తగ్గనున్నట్లు తేలింది. అయితే అనుకున్న వృద్ధి లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు గట్టిగా ప్రయత్నించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించినట్లు సమాచారం. కలెక్టర్ల సదస్సు సందర్భంగా జిఎస్‌డిపిపై అధికారులు, కలెక్టర్లతో చంద్రబాబు చర్చించారు. ఈ సందర్భంగా ఆర్థిక, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయుష్‌కుమార్ నివేదిక సమర్పిస్తూ ఈ ఏడాది 17.11 శాతం వృద్ధిని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా వేగంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. 2023-24లో 8.60 శాతం వృద్ధి నమోదుకాగా, 2024-25లో 12.02 శాతం వృద్ధి నమోదైనట్లు వివరించారు. ఇదే సమయంలో 2029 వరకు, 2047 వరకు వృద్ధి లక్ష్యాలను కూడా తన నివేదికలో పేర్కొన్నారు. ప్రస్తుతం తొలి త్రైమాసికంలో 10.5 శాతం వృద్ధి సాధించామని, ఇది జాతీయ వృద్ధి 8.8 శాతం కన్నా ఎక్కువగా ఉందని వివరించారు. అయితే ఇదే నివేదికలో రానున్న కాలంలో వృద్ధి గమనించగా, క్రమంగా తగ్గనున్నట్లు పేర్కొనడం విశేషం. గడచిన సంవత్సరం కన్నా కొనసాగుతున్న ఆర్థిక సంవత్సరంలో ఏకంగా ఐదు శాతం కన్నా ఎక్కువ వృద్ధిని లక్ష్యంగా పెట్టుకోగా, 2026-27 నుంచి వృద్ధి తగ్గనున్నట్లు ఆ నివేదికలో పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 16.18 శాతం వృద్ధి ఉంటుందని అంచనా వేయగా, ఆ తరువాత వరుసగా 16.23, 16.28 శాతంగా ఉంటుందని పేర్కొన్నారు. అయితే 2033-34 ఆర్థిక సంవత్సరానికి 14.41 శాతానికి తగ్గుతున్న వృద్ధి 2038-39 నాటికి 13.65 శాతానికి, 2043-44 లో 12.78 శాతానికి, తుది లక్ష్యమైన 2047-48 నాటికి 11.97 శాతానికి తగ్గుతుందని ఈ నివేదికలో అధికారులు వివరించారు. గత కొన్ని నెలలుగా 2047-48వరకు 15 శాతం వృద్ధిని కొనసాగించాలని ముఖ్యమంత్రి చెప్పడం తెలిసిందే. దీనికి తాజా గణాంకాలకు మధ్య తేడా కనిపించడం విశేషం. ఈ అంచనాలు ఎలా ఉన్నప్పటికీ కలెక్టర్ల సదస్సులో మాత్రం వృద్ధిని పెంచేందుకు అధికారులు, జిల్లాల్లో కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని, ఆర్థిక, ప్రణాళిక శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం విశేషం.

2047-48 వరకు జిఎస్‌డిపి (రూ.కోట్లలో), వృద్ధి (శాతం) అంచనా వివరాలు

ఏడాది	జిఎస్‌డిపి	శాతం
2024-25	15,93,062	12.02
2025-26	18,65,704	17.11
2026-27	21,67,606	16.18
2027-28	25,19,359	16.23
2028-29	29,29,402	16.28
2033-34	57,21.610	14.41
2038-39	1,08,10,372	13.65
2043-44	1,96,54,265	12.78
2047-48	3,08,11,722	11.97

2025-26లో రంగాల వారీ జివిఏ (రూ.కోట్లలో), వృద్ధి (శాతం)

రంగం	జిజిఏ	వృద్ధి
వ్యవసాయం	81,496	9.06
పరిశ్రమలు	92,843	11.91
సేవా రంగం	1,57,321	10.70
మొత్తం జివిఏ	3,31,660	10.76

పట్టణ ప్రాంతాల్లో 1343 ఎకరాలు అమ్మకం

- 78 చోట భూములు గుర్తించిన ప్రభుత్వం
- ఆ దిశలో చర్యలు తీసుకోవాలని సిఎం సూచన
- సదుపాయాల కల్పనకు పదేళ్లలో లక్ష కోట్లు అవసరమని అంచనా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో సదుపాయాల కల్పన పేరుతో భూముల అమ్మకానికి ప్రభుత్వం తెరలేపింది. దీనిలో భాగంగా పట్టణ ప్రాంతాల్లో 78 చోట్ల 1,343 ఎకరాలు అమ్మకానికి పెట్టింది. రానున్న పదేళ్లలో పట్టణ ప్రాంతాల్లో సదుపాయాల కల్పన కోసం లక్ష కోట్లు అవసరం అవుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. పట్టణ సంస్కరణలు అమలు చేయడం ద్వారా కేంద్రం నుండి కొంత నిధులు వచ్చే అవకాశం ఉంది. మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చుకోవాల్సిఉంది. దీనిలో భాగంగా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.30 వేల కోట్ల విలువైన ప్రాజెక్టుల ప్రతిపాదనలను సిద్ధం చేసి కేంద్రానికి పంపించింది. వీటిలో గ్రోత్ హబ్స్, నగరాల పునరాభివృద్ధి, శానిటేషన్ ప్రాజెక్టులతో పాటు, పట్టణ ప్రాంతాల్లో నిధుల సమీకరణకు పిపిపి పద్ధతిని అమలు చేయడంతో ల్యాండ్ మానిటైజేషన్ ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించింది. దీనికోసం 18 పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో 78 చోట్ల భూములను గుర్తించింది. ఇలా అమ్మడానికి పెట్టిన స్థలాల్లో ఎసైన్డ్, డికెటి, డిపట్టా భూములు 28 ఉన్నాయి. 45 చోట్ల ప్రభుత్వ, పట్టణాభివృద్ధి సంస్థలకు చెందిన భూములున్నాయి. వాటిని అమ్మడం లేదా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం ద్వారా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇలా అప్పగించిన భూముల్లో పట్టణాభివృద్ధిశాఖల ప్రమేయం ఏ మాత్రమూ ఉండకూడదని నిర్ణయించినట్లు తెలిసింది. పిపిపి పద్ధతిలో అప్పగించే భూముల్లో ప్లాట్ల అభివృద్ధి, గేటెడ్ కమ్యూనిటీ, వేర్‌హౌసింగ్, ఫ్యూయల్ స్టేషన్లు, హాస్పిటళ్లు, వాణిజ్యభవనాలు, సోలార్ పార్కులు, హోటళ్లు, రిసార్టులు, హబ్స్ ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం ఆయా సంస్థల పరిధిలో వేర్వేరు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన భూమిని కూడా యుడిఏకు అప్పగించడం వంటి పనులు పూర్తయ్యాయి. వాటికి ఎసెన్‌మెంట్ కూడా ఇచ్చేశారు. అలాగే 78 చోట్ల గుర్తించిన వాటిల్లో 73 సైట్లకు ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు పిలవడానికి ప్రభుత్వం సిద్ధమైంది. వాటిల్లోనూ 33 చోట్ల అభివృద్ధికి అనుకూలంగా ఉన్నాయని, 27 చోట్ల పరిశీలన చేయాల్సి ఉందనీ ఈ మొత్తంలో 1275 ఎకరాలు అప్పగించేందుకు సిద్ధంగా ఉందనీ నివేదిక రూపొందించింది. సోమవారం జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టణాభివృద్ధిశాఖ ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎక్కడ ...ఎన్ని ఎకరాలు

వీటిల్లో శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో 8 చోట్ల 159.38 ఎకరాలు, బొబ్బిలి యుడిఏలో 10 చోట్ల 44.38 ఎకరాలు, అమలాపురం యుడిఏలో 2 చోట్ల 5జ10 ఎకరాలు, రాజమహేంద్రవరం పరిధిలో 3 చోట్ల 66.49 ఎకరాలు, కాకినాడలో 4 చోట్ల 31.51 ఎకరాలు పిపిపి పద్ధతిలో మానిటైజేషన్ ప్రక్రియకు కేటాయించారు. వీటితోపాటు ఏలూరులో నాలుగు చోట్ల 164.03 ఎకరాలు, మచిలీపట్నం పరిధిలో మూడు చోట్ల 35.76 ఎకరాలు, బాపట్ల యుడిఏ పరిధిలో రెండుచోట్ల 5.25 ఎకరాలు, పల్నాడు పరిధిలో ఒకచోట 40 ఎకరాలు, ఒంగోలులో మూడుచోట్ల 25.94 ఎకరాలు, నెల్లూరులో ఒకచోట 34 ఎకరాలు, తిరుపతిలో ఐదుచోట్ల 167.12 ఎకరాలు, చిత్తూరులో 8.54 ఎకరాలు, పలమనేరు, కుప్పం, మదనపల్లె యుడిఏ పరిధిలో నాలుగు చోట్ల 76.46 ఎకరాలు పిపిపికి ఇవ్వనున్నారు. పుట్టపర్తి పరిధిలో ఆరుచోట్ల 40.64 ఎకరాలు, అనంతపురం, హిందూపురం యుడిఏలో 11 చోట్ల 229.39 ఎకరాలు, అన్నమయ్య, కడప యుడిఏలో ఆరచోట్ల 114.39 ఎకరాలు, కర్నూలులో నాలుగు చోట్ల 95 భూములను అమ్మడంగానీ, ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంగానీ చేయాలని నిర్ణయించారు.

'ప్రాజెక్టులకు' భూములు గుర్తించే బాధ్యత కలెక్టర్లదే

- ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు, కంప్రెస్డ్ బయోగ్యాస్ (సిబిజి) ప్లాంట్లకు భూములను గుర్తించే బాధ్యత జిల్లా కలెక్టర్లకు అప్పగించామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. సచివాలయంలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఇంధనశాఖపై ఆయన మాట్లాడారు. పిఎం కుసుమ్ స్కీం కింద సోలార్ ప్రాజెక్టులు సాఫీగా అమలయ్యేందుకు, వచ్చే సవాళ్లకు వేగవంతమైన పరిష్కారం కోసం డిస్కమ్‌లు, పునరుత్పాదక విద్యుత్ అభివృద్ధి సంస్థ (ఎన్ఆర్ఇడిసిఎపి)తో సన్నిహిత సహకారం అవసరమని కలెక్టర్లకు చెప్పారు. రాష్ట్రంలో 2,93,587 వ్యవసాయ పంపుసెట్ల సోలారైజేషన్ కోసం 1,163 మెగావాట్లకు టెండర్లను ఆహ్వానించామని తెలిపారు. రానున్న మార్చి నాటికి ఈ ప్రాజెక్టులు పూర్తవుతాయని చెప్పారు. 6 లక్షల ఎస్‌సి, ఎస్‌టి వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని ఎన్ఆర్ఇడిసిఎపి 1,198.21 మెగావాట్ల గ్రిడ్ కనెక్టెడ్ రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లకు టెండర్లను ఆహ్వానించిందని వివరించారు. అక్టోబర్ నుంచి మార్చి వరకు రాష్ట్ర విద్యుత్ డిమాండ్ 12,762 మెగావాట్లు, రోజువారీ డిమాండ్ 250 మిలియన్ యూనిట్ల వరకు ఉంటుందని చెప్పారు. 21,728 మెగావాట్ల ఇన్‌స్టాల్డ్ కెపాసిటీ ఉన్నా.. దాదాపు 50 శాతం పునరుత్పాదక విద్యుత్ వనరుల నుంచి వస్తుందన్నారు. వీటి అనిశ్చితి స్వభావం వల్ల 24 గంటల డిమాండ్‌ను తీర్చడంలో సవాళ్లు ఎదురవుతున్నాయని తెలిపారు. గతేడాదితో పోల్చితే నెలవారీ డిమాండ్ 15.38 శాతం పెరిగిందన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న ఇంధన అవసరాలు ఆర్థిక కార్యకలాపాలను చూపిస్తుందని వివరించారు.



నిర్దిష్టమైన పని విధానం కల్పించాలి

- మెడికల్ రిప్రజెంటేటివ్స్ ధర్నా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నిర్దిష్టమైన పని విధానం కల్పించాలని, వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ ధర్నా నిర్వహించారు. విజయవాడలోని ధర్నా చౌక్‌లో సోమవారం ధర్నా జరిగింది. దీనికి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు మద్దతు తెలిపి మాట్లాడారు. రిప్రజెంటేటివ్స్‌ను హైస్కిల్డ్ వర్కర్స్‌గా గుర్తించి కనీస వేతనం రూ.26,900 చెల్లించాలని డిమాండ్ చేశారు. వేజ్‌బోర్డు ఏర్పాటు చేసి అమలు చేయాలని కోరారు. నిర్దిష్టమైన పని విధానాలు చట్టబద్ధంగా ఉండాలని చెప్పారు. సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ యాక్ట్‌ను పూర్తిస్థాయిలో యాజమాన్యాలు అమలు చేయాలని, దీనికోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విజయవాడ నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ.. రిప్రజెంటేటివ్స్ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అసిసోయేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ కుమార్, సి వెంకటరావు మాట్లాడుతూ.. మహిళా కార్మికులకు 6 నెలల ప్రసూతి సెలవులు ఇవ్వాలని, కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ మందులు, వ్యాక్సిన్ కంపెనీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మందులు, వైద్యపరికరాలపై ఎటువంటి పన్నులు ఉండకూడదన్నారు. బడ్జెట్‌లో వైద్యరంగానికి 6 శాతం కేటాయింపులు చేయాలని కోరారు. వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, ట్యాక్స్‌పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎంవి ఆంజనేయులు, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు రాజు ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపారు. డిమాండ్ల పరిష్కారం కోసం భవిష్యత్తులో చేపట్టే ఆందోళనలకు తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ సంయుక్త ప్రధాన కార్యదర్శి వైఎస్ రవికుమార్, ఉపాధ్యక్షులు యువి కృష్ణయ్య, కార్యదర్శులు సత్తిరాజు, శ్రీనివాస్, విశ్వనాథ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం అసోసియేషన్ నాయకులు విజయవాడ లేబర్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

బాలికపై అత్యాచారం

- ఆలస్యంగా వెలుగులోకి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సెలవు రోజు కావడంతో వ్యవసాయం పొలం వద్దకు వెళ్లి ఆవులను మేపుకుంటున్న 13 ఏళ్ల బాలికపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మదనపల్లె మండలంలోని ఓ గ్రామంలో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. దీంతో బాలిక తల్లిదండ్రులు సబ్ కలెక్టర్‌కు, తాలూకా పోలీసులకు చేసిన ఫిర్యాదు ప్రకారం.. మదనపల్లె మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక మదనపల్లె పట్టణంలో ఓ ప్రయివేటు పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతోంది. రెండో శనివారం పాఠశాలకు సెలవు కావడంతో ఆవులను తోలుకొని బాలిక పొలం వద్దకు వెళ్లింది. అది గమనించిన గ్రామానికి చెందిన నరసింహులు అనే వ్యక్తి ఒంటరిగా ఉన్న బాలిక నోరు అదిం పెట్టి, చెట్ల పొదలులోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెప్పావంటే చంపేస్తానని బెదిరించాడు. ఆదివారం తెల్లవారుజామున బాలికకు రక్తస్రావం అవడంతో తల్లికి అనుమానం వచ్చి గట్టిగా అడగడంతో విషయం బయటపెట్టింది. బాలికను తల్లిదండ్రులు మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు, తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని సోమవారం అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలికి మెరుగైన చికిత్సలు అందించేలా సబ్ కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. నిందితుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

మా జీవితాలతో ఆడుకోవద్దు

హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని ఆదివాసీల ర్యాలీ, మహాధర్నా
అడ్డుకోవడానికి ప్రయత్నించిన పోలీసులు


హుకుంపేట తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన గిరిజనులు

ప్రజాశక్తి- హుకుంపేట (అల్లూరి జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం బూర్జ పంచాయతీలో నిర్మించ తలపెట్టిన హైడ్రో పవర్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ హుకుంపేటలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యాన ఆదివాసీలు సోమవారం మహాధర్నా నిర్వహించారు. అనంతగిరి, హుకుంపేట, అరకు మండలాల పరిధిలోని 17 పంచాయతీల ఆదివాసీలు రాళ్లగెడ్డ వద్దకు భారీగా చేరుకున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్తుండగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. తాము శాంతియుతంగా పోరాడుతున్నామని, తమను అడ్డుకోవడం సరికాదని ఆదివాసీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో, పోలీసులు వెనక్కి తగ్గారు. అనంతరం ఆదివాసీలు అక్కడి నుంచి హుకుంపేట తహశీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లారు. మా జీవితాలతో ఆడుకోవద్దని, హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలని నినదిస్తూ తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ సురేష్ కుమార్ అధ్యక్షతన అక్కడ జరిగిన సభలో ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స, అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. అప్పలనర్స మాట్లాడుతూ 5వ షెడ్యూల్‌లోని భూభాగాన్ని నవయుగ, అదాని కంపెనీలకు కట్టబెట్టాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చూస్తోందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీలకు నష్టం కలిగించే హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి

- ప్రజారోగ్యం, వైద్య విద్య ప్రభుత్వ ఆధీనంలో ఉండాలి
- మోడీ ప్రభుత్వ వైఖరితో దేశ పత్తి రైతాంగానికి తీవ్ర నష్టం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మూడు రోజులపాటు ఢిల్లీలో హరి కిషన్ సింగ్ సుర్జిత్ భవన్‌లో జరిగిన సిపిఎం కేంద్ర కమిటీ సమావేశాలకు హాజరైన ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. దేశంలోని తాజా రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలపై కేంద్ర కమిటీ సమావేశంలో చర్చించామన్నారు. ఇండియాపై అమెరికా ట్రంప్ టారిఫ్ నిర్ణయాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళన నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. బీహార్ ఎన్నికలు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇండియా బ్లాక్‌తో కలిసి ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు చెప్పారు. ట్రంప్ టారిఫ్‌లు టెర్రరిజం లాంటిదని విమర్శించారు. దీనిపై మోడీ ప్రభుత్వం దోబూచులాడుతుందని దుయ్యబట్టారు. తెరవెనుక అన్ని కార్యక్రమాలనూ మోడీ ప్రభుత్వం నిర్వహిస్తోందని విమర్శించారు. పత్తిపై ఎలాంటి పన్ను లేకుండా కేంద్ర ప్రభుత్వం దిగుమతులు చేసుకునేందుకు అంగీకరించిందని, ఇది దేశ రైతాంగానికి తీవ్ర నష్టం చేస్తోందని పేర్కొన్నారు. రాబోయే నెలరోజుల్లో దేశవ్యాప్తంగా ప్రచార ఆందోళనలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 10 మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం చేయడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. కేరళలో ప్రభుత్వ ఆధ్వర్యాన వైద్య విద్య, ప్రజారోగ్యం నడుస్తోందని తెలిపారు. అమలాపురం మెడికల్ కాలేజ్ ఇప్పటికే సగం పూర్తయిందని, కంపెనీవారు పనిచేయకుండా వెళ్లిపోయారని అన్నారు. పాడేరులో 100 సీట్లతో మెడికల్ కాలేజీ ప్రారంభమైందని అన్నారు. వైద్యం, విద్య ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యం, వైద్య విద్యను ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. ట్రైబల్ యూనివర్సిటీకి సైతం క్యాంపస్ లేదని తెలిపారు.

మహిళలు చట్టసభల్లోకి వస్తే..
విధాన నిర్ణయంలో సమాన భాగస్వామ్యం

- జాతీయ సదస్సులో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్


మహిళా సాధికారత ముగింపు సభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'మహిళలు చట్టసభల్లోకి వస్తే విధానపరమైన నిర్ణయాల్లో సమాన భాగస్వామ్యం ఉంటుంది' అని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. 2023 లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో 33 శాతం సీట్ల రిజర్వేషన్ కల్పించారని, ప్రస్తుతం లోక్‌సభలో మహిళలు 14 శాతం మాత్రమే ఉన్నారన్నారు. రువాండాలో అమలవుతున్న మహిళా రిజర్వేషన్లను ఉదహరిస్తూ 30 శాతం కోటా నుంచి పదేళ్లలో 64 శాతం మహిళా శాసనసభ్యులను పెంచారని వివరించారు. తిరుపతిలో రెండు రోజుల పాటు జరిగిన పార్లమెంట్, రాష్ట్ర/కేంద్ర పాలిత ప్రాంతాల శాసనసభల మహిళా సాధికారత కమిటీ/ మహిళా సంక్షేమ కమిటీ చైర్మన్ల మొదటి జాతీయ సదస్సు సోమవారం ముగిసింది. ముగింపు సభకు గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్‌నజీర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 1997, ఏప్రిల్ 29న 11వ లోక్‌సభలో ఏర్పాటు చేసిన మహిళా సాధికారత కమిటీ, దేశంలో మహిళా సాధికారతకు ఒక ప్రధాన మైలురాయిగా నిలిచిందన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ మాట్లాడుతూ 1997లో ఏర్పాటైన మహిళా సాధికారత కమిటీ 28 సంవత్సరాల తరువాత మొదటిసారిగా ఇంత విస్తృత స్థాయిలో సమావేశం జరగడం చారిత్రక ఘట్టమన్నారు. సాధికారత కమిటీ చైర్‌పర్సన్ పురంధేశ్వరి మాట్లాడుతూ జెండర్ రెస్పాన్సివ్ బడ్జెటింగ్, కొత్తగా ఎదుగుతున్న టెక్నాలజీల సవాళ్లను ఎదుర్కోవడానికి మహిళలను సాధికారపరచడం అనే విషయం ప్లీనరీ సెషన్లలో జరిగిన చర్చలు లోతైన, దూరదృష్టిగల ఫలితాలను ఇచ్చాయన్నారు.

తీర్మానాలు

డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ ద్వారా భారతదేశం డిజిటల్ పరివర్తన కోసం కృషి చేయాలని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాక్‌చెయిన్, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, డేటా విశ్లేషణ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాల సవాళ్ల, సురక్షితమైన ఉపయోగం గురించి మహిళలకు అవగాహన కల్పించాలి. మహిళల్లో డిజిటల్ విద్యను ప్రోత్సహించాలని తదితర తీర్మానాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణ రాజు, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూళ్ళూరుపేట, పలువురు ఎంఎల్‌సిలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

తక్షణమే వేతనాలు చెల్లించాలి

- కంచాలు మోగించి ఉక్కు కార్మికులు, వారి కుటుంబ సభ్యుల నిరసన



వినూత్న నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

తక్షణమే తమ వేతనాలు చెల్లించాలంటూ విశాఖ ఉక్కు కార్మికులు కుటుంబాలతో కలిసి సోమవారం కంచాలు కొట్టి వినూత్న నిరసన తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు వైటి దాస్ ఆధ్వర్యాన ఉక్కు ప్రధాన పరిపాలనా భవనం ఎదుట జరిగిన ఈ నిరసనలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ మాట్లాడారు. ఉక్కు కార్మికులకు జీతాలు చెల్లించామని కేంద్ర మంత్రి ప్రకటించడం అత్యంత దుర్మార్గమన్నారు. ఉక్కు కార్మికులకు గత సంవత్సర కాలంగా పూర్తి జీతాలు చెల్లించకుండా యాజమాన్యం మొండి వైఖరిని ప్రదర్శిస్తోందని వివరించారు. జీతాలు అడిగిన కార్మిక నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తూ షోకాజ్ నోటీసులు ఇచ్చే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యు రామస్వామి, సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ తొలగించిన నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, పూర్తిస్థాయి ఉత్పత్తికి అవసరమైన ముడి ఖనిజాన్ని సమకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పి శ్రీనివాసరాజు, కె గంగాధర్, టివికె రాజు, పుల్లారావు, బి అప్పారావు, వి ప్రసాద్, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా ముఠా అరెస్ట్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

అక్రమంగా గంజాయిని రవాణా చేస్తున్న ముఠాను అరెస్టు చేశామని కర్నూలు డిఎస్‌పి జె.బాబు ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బళ్లారి చౌరస్తాపై ఓవర్ బ్రిడ్జి మీద కర్నూలు నాలుగో పట్టణ సిఐ విక్రమ్‌సింహ, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తమ సిబ్బందితో వాహన తనిఖీ చేస్తుండగా టయోటా గ్లాంజా కారు డోర్లలో దాచి ఉంచిన గంజాయి ప్యాకెట్లు గుర్తించారు. ఆ కారులో ప్రయాణిస్తున్న కర్నూలు నగరంతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన మీనుగ నరేంద్ర, నల్లగొట్టి ఉమేష్‌చంద్ర, సాయిబాబా, సిరిగిరి మృత్యుంజయ రెడ్డి, షేక్ మహమ్మద్ ఆరిఫ్, పగిడ్యాల చాకలి గోవర్ధన్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. గురువారం కారులో వెళ్లిన ఈ ఐదుగురు ఒరిశా సరిహద్దులో సుమారు 20 కేజీల గంజాయిని రూ.80వేలకు కొనుగోలు చేసి, రూ.4 లక్షలకు అమ్మాలనే ఉద్దేశంతో ఇక్కడికి తీసుకొచ్చినట్లు నిందితులు చెప్పారు.



సబ్ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

వైద్య కళాశాలను ప్రభుత్వమే నడపాలి

- సబ్ కలెక్టరేట్ వద్ద ధర్నాలో విద్యార్థి సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్ (అన్నమయ్య జిల్లా)

అన్నమయ్య జిల్లా మదనపల్లె వైద్య కళాశాలను ప్రభుత్వ అధీనంలోనే నిర్వహించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ ఆధ్వర్యంలో సోమవారం ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘాలు, మదనపల్లె అభివద్ధి వేదిక, విద్యార్థులతో కలిసి సబ్ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకుని ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నడపాలని నినాదాలు చేశారు. 107, 108 జిఒలను రద్దు చేసి పేద, బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయాలని కోరారు. విద్యార్థి సంఘాలకు వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు మద్దతు తెలియజేస్తూ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రెడ్డి సాహెబ్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మురళి మాట్లాడుతూ పిపిపి విధానం వల్ల బలహీన వర్గ విద్యార్థులు రిజర్వేషన్ల పొందే హక్కు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

ఇలాంటి వాటికి విద్యార్థులు వారి తల్లిదండ్రులు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు సంపత్, ఎస్ఎఫ్ఐ నాయకులు అఫ్రిద్, జయబాబు, సిపిఎం నాయకులు నాగరాజు, ఐటియుసి


భార్యాపిల్లలతో రైతు కుంటెన్న (ఫైల్‌ఫొటో)

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆత్మకూరు (అనంతపురం జిల్లా)

అప్పుల బాధతాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం పి.యాలేరు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... పి.యాలేరు గ్రామానికి చెందిన రైతు హరిజన కుంటెన్న (38)కు నాలుగు ఎకరాల వ్యవసాయ సాగుభూమి ఉంది. ఇందులో 3 ఎకరాలు వరి పంట, మిగిలిన దాంట్లో చీనీ పంట సాగు చేశారు. పంటల సాగు నిమిత్తం దాదాపు రూ.10 లక్షలు అప్పులు చేశారు. మూడేళ్ల నుంచి పంటలు చేతికందక కనీసం పెట్టుబడులు కూడా తిరిగి రాలేదు. ట్రాక్టర్ కంతులు కట్టడం కూడా కష్టమైంది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఆయన భార్య పుట్టింటికి వెళ్లారు. సోమవారం ఉదయం పిల్లలు పాఠశాలకు వెళ్లారు. అప్పు ఎలా తీర్చాలో తెలీక ఒంటరిగా ఉన్న కుంటెన్న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గోడ కూలి విద్యార్థి మృతి

పదిమందికి తీవ్ర గాయాలు
సిపిఎం, సిఐటియు, ఎస్ఎఫ్ఐ, ఇతర ప్రజా సంఘాల నిరసన
ఘటనపై మంత్రి టిజి భరత్ విచారం


గోడకూలి మృతిచెందిన విద్యార్థి, కూలిన గోడ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పాఠశాల గోడ కూలి విద్యార్థి మృతి చెందిన ఘటన కర్నూలు జిల్లా కవాడీ వీధిలో సోమవారం చోటు చేసుకుంది. పది మంది విద్యార్థులు తీవ్ర గాయాలపాలయ్యారు. పోలీసులు, విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. కవాడీ వీధిలో కీర్తి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆలస్యంగా వచ్చారని నెపంతో కొంతమంది విద్యార్థులను పాతబడిన గోడ పక్కన క్రమశిక్షణ చర్యల పేరుతో నిల్చోబెట్టారు. హఠాత్తుగా గోడ ఒక్కసారిగా విరిగి పడింది. దీంతో ఒకటోవ తరగతి విద్యార్థి హకిబ్ (5) అక్కడికక్కడే మతి చెందాడు. మరో పదిమంది తీవ్ర గాయాల పాలయ్యారు. విద్యార్థులను హుటాహుటిన చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. ఇందులో ఒక విద్యార్థి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. వన్ టౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

విద్యార్థి మృతికి విచారం వ్యక్తం చేస్తూ మంత్రి టీజీ భరత్ వ్యక్తం చేశారు. కర్నూలు అర్బన్ తహశీల్దార్ రవికుమార్, ఎంఇఒ చేరుకొని ఘటనపై ఆరా తీశారు. సిపిఎం, ఎస్ఎఫ్ఐ, సిఐటియు, ఇతర ప్రజా సంఘాల నాయకులు చేరుకొని ఆందోళన నిర్వహించారు. పోలీసులు అక్కడకు చేరుకుని వారికి నచ్చచెప్పారు. ఈ ఘటనపై జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్యాకు ఎస్ఎఫ్ఐ, సిఐటియు, ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేసి సంబంధిత పాఠశాల యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఎపి రెరా ఛైర్మన్‌గా శివారెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ ఛైర్మన్‌గా ఎ.శివారెడ్డిని నియమించారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్‌గా పనిచేసిన శివారెడ్డి స్వతహాగా నిర్మాణ రంగంలో ఉన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధానిపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయన్ను రెరా ఛైర్మన్‌గా నియమించింది.

వైజాగ్‌లో కెవిబి విస్తరణ



విశాఖపట్నం : ప్రయివేటు రంగంలోని కరూర్ వైశ్య బ్యాంక్ (కెవిబి) విశాఖపట్నంలో తన ఉనికిని విస్తరించినట్లు ఓ ప్రకటనలో తెలిపింది. వడలపూడిలో ఏర్పాటు చేసిన నూతన శాఖను హిందుస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఫైనాన్స్ అండ్ కమర్షియల్ డైరెక్టర్ సిఎ ఇ కిరణ్‌తో పాటు స్టార్9 హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ మహతి సుధాకర్ లాంచనంగా ప్రారంభించారు. దీంతో దేశ వ్యాప్తంగా తమ బ్యాంక్ శాఖలు 894కు చేరాయని ఆ సంస్థ ఎండి, సిఇఒ రమేష్ బాబు పేర్కొన్నారు. కొత్త బ్రాంచ్‌లో సేవింగ్స్, కరెంట్ అకౌంట్లు, డిపాజిట్లు, లోన్లు వంటి సమగ్ర బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

పోలీసుల బెదిరింపు వల్ల వ్యక్తి మృతి

- మృతదేహంతో పోలీస్‌స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళన



మృతదేహాన్ని స్ట్రెచర్‌పై పోలీసు స్టేషన్ వద్దకు తీసుకెళ్తున్న రామకృష్ణ నాయక్ కుటుంబ సభ్యులు, పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - శింగనమల (అనంతపురం జిల్లా)

పేకాట ఆడుతున్నావంటూ పోలీసులు బెదిరించడంతో ఓ వ్యక్తి తీవ్ర ఆందోళనకు గురై అధిక రక్తపోటుతో మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... అనంతపురం జిల్లా శింగనమల మండల పరిధిలోని నాగలగుడ్డం తండా పరిధిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు తనిఖీల నిమిత్తం ఆదివారం రాత్రి ఆ గ్రామానికి వెళ్లారు. ఆ ప్రాంతంలో నాగులగుండం తండాకు చెందిన రామకృష్ణ నాయక్ (38) పోలీసులకు కన్పించారు. దీంతో, ఆయన పేకాట ఆడుతున్నారంటూ సెల్‌ఫోన్‌ను పోలీసులు తీసుకుని, సోమవారం పోలీసు స్టేషన్‌కు రావాలని చెప్పడంతో ఆందోళన పడి అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు గార్లదిన్నె ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లగా, అనంతపురం తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు సూచించారు. ఈ క్రమంలో ఆదివారం వేకువజామున పరిస్థితి విషమించి శింగనమల ప్రభుత్వాస్పత్రిలో రామకృష్ణ మృతి చెందారు. ఆయనకు ముగ్గురు చిన్న పిల్లలున్నారు. భర్త మృతి విషయం తెలుసుకున్న ఆయన భార్య రెండు నెలల బాలింత స్పృహకోల్పోయారు. రామకృష్ణ నాయక్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆయన మృతదేహంతో శింగనమల ప్రభుత్వాసుపత్రి, పోలీసు స్టేషన్ వద్ద సోమవారం ఉదయం ఆందోళన చేపట్టారు. ఆందోళన విషయం తెలుసుకున్న సిఐ కౌలుట్లయ్య, గార్లదిన్నె, నార్పల ఎస్ఐ సాగర్ పోలీసు స్టేషన్ వద్దకు చేరుకుని చర్చలు జరిపారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని నాగులగుండం తండాకు తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు.

కౌంటర్లు దాఖలు చేసే తీరిక లేదా?

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి

సర్వశిక్షాభియాన్ పథక విద్యా సంస్థల్లో విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యాబోధన, శాశ్వత ప్రాతిపదికన పనిచేసే బోధనా సిబ్బంది నియామకం కోసం తీసుకున్న చర్యలు తెలియజేయాలని ఆదేశించినప్పటికీ కౌంటర్లు ఎందుకు దాఖలు చేయలేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హైకోర్టు ప్రశ్నించింది. అఫిడవిట్లు దాఖలు చేయాలన్న తమ ఆదేశాలను ఖాతరు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికారులు బిజీగా ఉన్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరపు న్యాయవాదులు చెప్పడంపై ఆగ్రహించింది. కోర్టుల్లో న్యాయమూర్తులు ఖాళీగా ఏమీ లేరని తీవ్ర స్వరంతో ఘాటు వ్యాఖ్య చేసింది. కోర్టు ఆదేశాల్ని తేలిగ్గా తీసుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. ఈ నెల 22న జరిగే విచారణ నాటికి అఫిడవిట్లను దాఖలు చేయని పక్షంలో ప్రతివాదులైన రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి స్వయంగా హైకోర్టు విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కెజిబివి) పార్ట్ టైం పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు (పిజిటి)గా పనిచేస్తుంటే అర్ధాంతరంగా తొలగించారంటూ పెద్ద సంఖ్యలో పిజిటిలు రెండేళ్ల క్రితం పిటిషన్లు దాఖలు చేశారు. తొలగింపు చట్ట వ్యతిరేకమని గతంలో సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. వారి సేవల్ని కొనసాగించాలని ఆదేశించారు పిటిషనర్లను పిజిటిలుగా కొనసాగించే విషయాన్ని పరిశీలించాలని 2023లో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ తీర్పును రద్దు చేయాలంటూ గత జనవరిలో ప్రభుత్వం అప్పీల్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో గత విచారణ సమయంలో డివిజన్ బెంచ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. సోమవారం అప్పీళ్లను బెంచ్ మరోసారి విచారణ చేపట్టగా, రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది జి రామచంద్రరావు స్పందిస్తూ, పాఠశాల విద్యాశాఖ అధికారి సంతకం చేయలేనంత పని ఒత్తిడిలో ఉన్నారని చెప్పారు. కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ కల్పించుకుని, పార్లమెంటు సమావేశాలు ఉన్నందున అధికారులు బిజీగా ఉన్నారని, అయితే, సర్వశిక్షాభియాన్ పథకం కింద విద్యా సంస్థల్లో శాశ్వత ప్రాతిపదికన బోధనా సిబ్బంది నియామకంపై వివరాలు తెప్పించుకున్నట్లు చెప్పారు. దీనిపై హైకోర్టు పై విధంగా వ్యాఖ్యానించింది.

సంపాదకీయం

ప్రైవేటు చేటు

కొత్తగా రాష్ట్రానికి మంజూరైన గవర్నమెంట్ మెడికల్ కాలేజీలను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) కిందికి తీసుకొస్తూ టిడిపి కూటమి ప్రభుత్వం చేసిన నిర్ణయం ఒకవైపు వైద్య విద్యనభ్యసించాలని ఆశ పడుతున్న పేద, మధ్యతరగతి యువతకు వైద్య విద్యకు దూరం చేస్తుండగా ఇంకోవైపు ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతుంది. వైద్య విద్యను, వైద్య సేవలను మరింత ఖరీదైన మార్కెట్ సరుకుగా మార్చేందుకు సర్కారు పూనుకోవడం ఆందోళన కలిగించే విషయం. లోక్‌సభ నియోజకవర్గానికొక మెడికల్ కాలేజీ ఉండాలన్న నీతిఆయోగ్ నిర్దేశం మేరకు గత వైసిపి హయాంలో ఆంధ్రప్రదేశ్‌కు కొత్తగా 17 మెడికల్ కాలేజీలకు కేంద్ర ప్రభుత్వం నుంచి లాంఛనప్రాయ అనుమతులొచ్చాయి. వాటిలో ఐదు కాలేజీలు లెటర్ ఆఫ్ పర్మిషన్ ప్రాతిపదికన ప్రారంభమయ్యాయి. గిరిజన, మారుమూల ప్రాంతాల్లో పూర్తి స్థాయి కేంద్రం నిధులతో మరో రెండు కాలేజీలూ మొదలయ్యాయి. కాగా రాష్ట్రానికి మంజూరైన మెడికల్ కాలేజీలలో పదింటిని పిపిపి పద్ధతిలో నడిపేందుకు కూటమి సర్కార్ ఇటీవల కేబినెట్‌లో తీర్మానం ఆమోదించి ప్రభుత్వరంగానికి నిలువునా పాతరేసింది. ప్రభుత్వం నడపాల్సిన మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగించి చేతులు దులుపుకోవడం సర్కార్ తన బాధ్యత నుంచి తప్పుకోవడమే.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు కూటమి సర్కారు చెప్పేవి సాకులు మాత్రమే. నిపుణుల కొరత, సౌకర్యాల లోటు, పెట్టుబడులు లేమి వలన ప్రైవేటుకు ఇస్తున్నామనడం బూటకం. ఒక్కొక్క కాలేజీ నిర్మాణానికి రూ.500 కోట్లవుతుంది. వాటిలో కేంద్రం 80 శాతం నిధులు తన బడ్జెట్ నుంచి ఇవ్వాలి. తతిమ్మా 20 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం తన బడ్జెట్ నుంచికానీ, నాబార్డు ఇత్యాది బ్యాంకుల నుంచి కానీ రుణం తీసుకొనే వెసులుబాటు ఉంది. మంజూరైన కొన్ని కాలేజీల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి. ప్రభుత్వం 50-60 కోట్లు సమకూర్చితే పూర్తయ్యేవీ ఉన్నాయి. ఆ వైపు ఆలోచించకుండా ప్రైవేటుకు అప్పగిండాన్నిబట్టి ప్రభుత్వం ఎంచుకున్న దారేమిటో స్పష్టమవుతుంది. దాదాపు 80 శాతం ప్రభుత్వ నిధులతో నిర్మాణమయ్యే కాలేజీలను 20 శాతం పెట్టుబడుల కోసం ప్రైవేటు చేతిలో పెడతారన్నమాట! ప్రైవేట్ అంటే ఫక్తు లాభాల కోసమే పని చేస్తాయి తప్ప హ్యూమన్ ఫేస్ ఉండదన్న విషయం తెలిసిందే. నిర్వహణా బాధ్యతలు చేపట్టిన ప్రైవేట్, కార్పొరేట్లు కచ్చితంగా సీట్లను వేలం వేసి అమ్ముకుంటాయి. ఇప్పటికే ప్రైవేటు కాలేజీల్లో సీటు కోటి వరకు పలుకుతున్న దృష్టాంతాలెన్నో! ప్రైవేటు కాలేజీలకే పరిమితమైన ఈ దోపిడీ ఇక ప్రభుత్వం కింద నడపాల్సిన పిపిపి కాలేజీకూ విస్తరిస్తుంది. కోటీశ్వరులే డాక్టర్లు కాగలుగుతారు. ఆ విధంగా డాక్టర్లయిన వారు తాము పెట్టిన ఖర్చుకు రిటర్న్ ఆశిస్తారు. ప్రజారోగ్యానికి, పేదల వైద్య సేవలకు భారీ గండి పడుతుంది.

ప్రైవేటీకరణ, పిపిపి.. రెండూ వేర్వేరనడం ప్రజలను, యువతను తప్పుదారి పట్టించే వాదన. రెండు విధానాల్లోనూ సీట్ల అమ్మకం, నిర్వహణ కామన్ పాయింట్. ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుసంధానంగా నడిచే ఆస్పత్రుల్లో వైద్య సేవలు ఉచితంగా అందుతాయి. పిపిపి విధానంలో వైద్య సేవలను ప్రజలు డబ్బులు చెల్లించి కొనుక్కోవాల్సిందే. ప్రైవేటు నిర్వహణ అద్భుతంగా ఏమీ లేదు. దేశ వ్యాప్తంగా 40 కాలేజీల్లో భారీ అక్రమాలు జరిగాయని సిబిఐ దర్యాప్తులో వెల్లడైంది. క్రిమినల్ కేసులు నమోదైన వాటిలో ఎపికి చెందిన సంస్థలూ ఉన్నాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు తెచ్చామంటున్న వైసిపి ప్రభుత్వం... సెల్ఫ్‌ఫైనాన్స్‌ను ప్రవేశపెట్టి కొన్ని సీట్లకు లక్షల వంతున రేటు నిర్ణయించి అమ్మకానికి పెడుతూ జీవోలిచ్చింది. ఆ జీవోలను రద్దు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన టిడిపి, జనసేన అధికారంలోకొచ్చాక రద్దు చేయకపోగా అంతకుమించి పిపిపి దారి పట్టింది. ఇప్పటికే ఆరోగ్యశ్రీని ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించింది. ఇప్పుడు ఏకంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు అర్పిస్తోంది. ఈ చర్యలు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, మహిళలు, వికలాంగులకు, పేదలకు నష్టం కలిగిస్తాయి. విభజిత ఎ.పి.లో వైద్య విద్య, సేవల కొరత తీవ్రంగా ఉంది. ప్రభుత్వరంగంలో ఉంటేనే ప్రజారోగ్యానికి భరోసా. ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలను ప్రజలు ప్రతిఘటించాలి.

మహనీయుల మాట



ఒక దేశం గొప్పతనం ఆ దేశం ప్రజలకు కల్పించిన హక్కులపై ఆధారపడి వుంటుంది.

-హెచ్.జె.లాస్కీ
బ్రిటిష్ ఆర్థికవేత్త.

సోషలిజం ఆర్థిక మాంద్యాన్ని ఏ విధంగా నివారించగలుగుతుంది?

భారతదేశంలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న కాలంలో పలువురు కార్యకర్తలు సోషలిజం వైపు ఆకర్షితులయారు. ఒకవైపున పెట్టుబడిదారీ ప్రపంచం యావత్తూ మహామాంద్యంలో పడి భారీ నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతూంటే, సోవియట్ యూనియన్ మాత్రం మహామాంద్యం ప్రభావం ఏమీ పడకుండా ముందుకు సాగింది. ఈ తేడా కొట్టొచ్చినట్టు కనిపించడంతో ఆ కార్యకర్తలు సోషలిజం వైపు ఆకర్షితులయ్యారు. అలా సోషలిజం వైపు వచ్చినవారిలో కామ్రేడ్ ఇఎంఎస్ నంబూద్రిపాద్ ఒకరు. ఆ సంగతి ఆయనే పేర్కొన్నారు. సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలోనే అంతర్గతంగా ఉన్న ఏదో ఒక లక్షణం వలన అది ఆర్థిక మాంద్యాన్ని నివారించగలుగుతోందని వారు భావించారు. అదే విధంగా వ్యవస్థ మొత్తంగా అధికోత్పత్తి జరిగే పరిస్థితిని కూడా సోషలిజం నివారించగలుగుతోందని వారు గుర్తించారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఇందుకు భిన్నంగా ఉంటుంది. ఈ రెండు వ్యవస్థలకూ తేడా ఎక్కడుంది?





ప్రభాత్ పట్నాయక్

అందుబాటులో ఉన్న మొత్తం ఉత్పత్తి సాధనాలను అన్నింటినీ పూర్తి సామర్థ్యం మేరకు వినియోగించి గరిష్ట స్థాయి ఉత్పత్తి సాధించినప్పుడు అది ఆనాటి మార్కెట్‌లో ఉన్న డిమాండ్ కన్నా ఎక్కువగా ఉంటే అప్పుడు అధికోత్పత్తి సమస్య తలెత్తినట్టు పరిగణిస్తాం. అందుచేత ఈ పరిస్థితిని నివారించడానికి ఉత్పత్తి జరిగే చోట్ల అవసరం లేని ఉత్పత్తుల జాబితాలు చేరుతాయి. వాటి ఆధారంగా ఉత్పత్తులను పరిమితం చేస్తారు. మార్కెట్‌లో ఎంత డిమాండ్ ఉందో అంత మేరకే సరుకులు ఉత్పత్తి అయ్యేట్టు చూస్తారు.

కార్మికులకు డబ్బు రూపంలో చెల్లించే జీతాలు, ధరలు రెండూ ఎప్పటికప్పుడు మార్చుకోదగ్గట్టు ఉంటే అధికోత్పత్తి సమస్య తలెత్తకుండా నివారించవచ్చునని బూర్జువా ఆర్థిక పండితులు అంటారు. వారి వాదన ఈ విధంగా ఉంటుంది: అధికోత్పత్తి జరిగి సరుకులు చెల్లుబాటు కాకుండా మిగిలిపోయినప్పుడు ఉత్పత్తి తగ్గుతుంది. దాని వలన కార్మికులకు చెల్లించే వేతనాలు తగ్గుతాయి. అప్పుడు మార్కెట్‌లో ఉన్న సరుకుల ధరలు తగ్గి దాని వలన ప్రజల దగ్గర ఉండే నగదు విలువ పెరుగుతుంది. అప్పుడు వారు మరింత ఎక్కువగా కొనుగోలు చేస్తారు. దాని వలన మొత్తంగా చూసినప్పుడు డిమాండ్ పెరుగుతుంది. ఈ ధోరణి ఇలాగే కొనసాగి పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి మళ్ళీ చేయవలసిన పరిస్థితి వస్తుంది. ఆ ఉత్పత్తికి తగిన డిమాండ్ కూడా ఏర్పడుతుంది. ఐతే ఇది కొత్త రేట్లతో వేతనాలు పునర్ నిర్ణయించబడేందుకు, సరుకుల ధరలు కొత్తగా నిర్ణయించబడేందుకు దారితీస్తుంది. అందుచేత పూర్తి ఉత్పత్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి సాగకపోవడానికి, ఉపాధి పూర్తి స్థాయిలో కల్పించబడక పోవడానికి కారణం కార్మికుల వేతనాలు, సరుకుల ధరలు ఎప్పటికప్పుడు మార్చుకునే విధంగా లేకపోవడమే కారణం అని వారంటారు. క్లుప్తంగా చెప్పాలంటే, మార్కెట్లను వాటివరకూ అవి నడుచుకునేట్టు వదిలిపెట్టకుండా నియంత్రించడం వల్లే అధికోత్పత్తి సమస్య వస్తుందని వారు వాదిస్తారు. ఇలా జరగడానికి కారణం కార్మిక సంఘాలు ఉనికిలో ఉండడ మేనని, ఆ సంఘాలు కార్మికుల వేతనాలను ఒక స్థాయి కన్నా తక్కువకు పడిపోకుండా అడ్డుపడతాయని, ఆ విధమైన జోక్యం కారణంగానే అధికోత్పత్తి ఒకవైపు, భారీ నిరుద్యోగం మరోవైపు తలెత్తుతాయని వారు అంటారు. అందు చేత అధికోత్పత్తి సమస్యను పరిష్కరించాలంటే ముందు కార్మికసంఘాలు లేకుండా చేయాలని, అప్పుడే మార్కెట్లు స్వేచ్ఛగా తమ పని తాము చేయ గలుగుతాయని వారు చెప్తారు. మార్గరెట్ థాచర్ తదితరులు చెప్పినది ఇదే.

ఐతే ఈ బూర్జువా ఆర్థిక పండితులు చెప్పిన సిద్ధాంతం యావత్తూ వొట్టి బూటకం మాత్రమే. అధికోత్పత్తి సమస్యను పరిష్కరించడానికి కార్మికుల వేతనాలను తగ్గించడం, సరుకుల ధరలను తగ్గించడం వంటి చర్యలు చేపడితే అది ఉత్పత్తిని పెంచడం, ఉపాధి అవకాశాలను పెంచడం వంటి ఫలితాలకు దారి తీయదు సరికదా, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో వినాశకర పరిణామాలకు దారి తీస్తుంది. అనేక పరిశ్రమలు రుణాలు తీసుకుని పని చేస్తాయి. ఈ రుణాలు డబ్బు రూపంలోనే లెక్కించబడతాయి. ఒకసారి వేతనాలతోపాటు సరుకుల ధరలు కూడా తగ్గిపోతే అప్పుడు ఈ పరిశ్రమలకు వచ్చే ఆదాయం తగ్గిపోతుంది. అప్పుడు ఆ పరిశ్రమలు తాము చెల్లించవలసిన రుణాలను తిరిగి చెల్లించలేని స్థితిలో పడిపోయి వారిలో చాలామంది దివాలా తీసే పరిస్థితి ఏర్పడుతుంది. అందుచేత కార్మికుల వేతనాలను, సరుకుల ధరలను తగ్గించడం వంటి చర్యలు డిమాండ్‌ను పెంచలేవు సరికదా ఉపాధి అవకాశాలు తగ్గిపోతాయి. చాలా పరిశ్రమలు మూత పడడం వలన ఉత్పత్తి తగ్గిపోతుంది.

ఒకవేళ ధరలు తగ్గి జీతాలు మాత్రం తగ్గకుండా యథాతథంగా కొనసాగితే అప్పుడు నిస్సందేహంగా డిమాండ్ పెరుగుతుంది. కాని పరిశ్రమల లాభాలు తగ్గిపోతాయి. అందుకే ఈ పరిష్కారానికి పరిశ్రమలు ఒప్పుకోవు. పైగా కొన్ని పరిశ్రమలకు నష్టాలు కూడా వస్తాయి. అప్పుడవి మూతబడతాయి. దాని వలన అటు ఉత్పత్తి, ఇటు ఉపాధి రెండూ తగ్గుతాయి. మొత్తం మీద చూస్తే పెట్టుబడివారీ వ్యవస్థలో అధికోత్పత్తి సమస్యను మార్కెట్ యంత్రాంగం ద్వారా ఎన్నటికీ పరిష్కరించలేం.

సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ ఇందుకు పూర్తి భిన్నం. అక్కడ ఉత్పత్తి సాధనాలన్నీ సామాజికపరంగానే ఉంటాయి. అంటే ప్రభుత్వ యాజమాన్యంలోనే పరిశ్రమలన్నీ నడుస్తాయి. అన్ని పరిశ్రమల లాభాలూ ప్రభుత్వానికే చెందుతాయి. అందుచేత ఏదో ఒక పరిశ్రమకు లాభం వచ్చిందా లేక నష్టం వచ్చిందా అన్నది ఆ పరిశ్రమ యజమానికి, అంటే ప్రభుత్వానికి పెద్ద సమస్యగా మారదు. మొత్తం మీద అన్ని పరిశ్రమలనూ కలిపి చూసుకున్నప్పుడు తగినంత లాభం వచ్చిందా లేదా అన్నదే ప్రధానం ఔతుంది. అక్కడ నష్టాలు వచ్చినంత మాత్రాన పరిశ్రమను మూసివేయరు. అక్కడ ప్రభుత్వం అన్ని పరిశ్రమలనూ వాటి పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి చేయమని ఆదేశించవచ్చు. అదే సమయంలో కార్మికుల వేతనాలను తగ్గించకుండా యథాతథంగా కొనసాగిస్తూ సరుకుల ధరలను తగ్గించవచ్చు, తద్వారా మార్కెట్ డిమాండ్‌ను పెంచి సరుకులన్నీ చెల్లిపోయేట్టు చేయవచ్చు. ఈ క్రమంలో కొన్ని పరిశ్రమలకు నష్టం కూడా రావచ్చు. లాభాలార్జించే పరిశ్రమల నుండి ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. నష్టాలు వచ్చే పరిశ్రమలకు ప్రభుత్వం సబ్సిడీలు అందించి ఆదుకుంటుంది. మొత్తం మీద పరిశ్రమలన్నీ పూర్తి సామర్థ్యంతో పని చేస్తాయి.

సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ ఇందుకు పూర్తి భిన్నం. అక్కడ ఉత్పత్తి సాధనాలన్నీ సామాజికపరంగానే ఉంటాయి. అంటే ప్రభుత్వ యాజమాన్యం లోనే పరిశ్రమలన్నీ నడుస్తాయి. అన్ని పరిశ్రమల లాభాలూ ప్రభుత్వానికే చెందుతాయి. అందుచేత ఏదో ఒక పరిశ్రమకు లాభం వచ్చిందా లేక నష్టం వచ్చిందా అన్నది ఆ పరిశ్రమ యజమానికి, అంటే ప్రభుత్వానికి పెద్ద సమస్యగా మారదు. మొత్తం మీద అన్ని పరిశ్రమలనూ కలిపి చూసుకున్నప్పుడు తగినంత లాభం వచ్చిందా లేదా అన్నదే ప్రధానం ఔతుంది. అక్కడ నష్టాలు వచ్చినంత మాత్రాన పరిశ్రమను మూసివేయరు. అక్కడ ప్రభుత్వం అన్ని పరిశ్రమలనూ వాటి పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి చేయమని ఆదేశించవచ్చు. అదే సమయంలో కార్మికుల వేతనాలను తగ్గించకుండా యథాతథంగా కొనసాగిస్తూ సరుకుల ధరలను తగ్గించవచ్చు, తద్వారా మార్కెట్ డిమాండ్‌ను పెంచి సరుకులన్నీ చెల్లిపోయేట్టు చేయవచ్చు. ఈ క్రమంలో కొన్ని పరిశ్రమలకు నష్టం కూడా రావచ్చు. లాభాలార్జించే పరిశ్రమల నుండి ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. నష్టాలు వచ్చే పరిశ్రమలకు ప్రభుత్వం సబ్సిడీలు అందించి ఆదుకుంటుంది. మొత్తం మీద పరిశ్రమలన్నీ పూర్తి సామర్థ్యంతో పని చేస్తాయి. ఇలా పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి చేసినప్పుడు లాభాలను ఆర్జించే పరిశ్రమల లాభాలు బాగా పెరుగుతాయి. అవి నష్టాలు వచ్చే పరిశ్రమల వలన బడ్జెట్‌కు కలిగే లోటును సైతం భర్తీ చేయగలుగుతాయి. దేశ బడ్జెట్ ఎప్పుడూ లోటులో పడదు.

ఇంత గట్టిగా ఎలా చెప్పగలుగుతున్నాం? పెట్టుబడిలో పెరుగుదల ఉన్నంత కాలమూ ఆర్థిక వ్యవస్థలో పొదుపు కూడా పెరుగుతూనే వుంటుంది (ఇక్కడ విదేశీ పెట్టుబడులను పక్కన పెడదాం). కార్మికులకు చెల్లించే వేతనాలను వారు పూర్తిగా ఖర్చు చేసేస్తారని, పరిశ్రమల నుంచి వచ్చే లాభాలన్నీ పొదుపు రూపంలో ప్రభుత్వం దగ్గర చేరుతాయనుకుంటే, ఉత్పత్తిని పెంచడానికి పెట్టే పెట్టుబడులు అన్నీ అంతిమంగా లాభాలు పెరగడానికి దారి తీస్తాయని బోధపడుతుంది. మొత్తం మీద చూసినప్పుడు లాభాలార్జించే సంస్థలు నష్టాలలో ఉండే సంస్థల నష్టాలను అధిగమించే స్థాయిలో లాభాలను సాధిస్తాయి. అందుచేత సోషలిస్టు సమాజంలో అన్ని పరిశ్రమలనూ వాటి వాటి పూర్తి ఉత్పత్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి చేసేలా నడిపించవచ్చు, వాటిలో నష్టాలొచ్చే పరిశ్రమలకు సబ్సిడీలు కూడా అందించవచ్చు.

దీనిని బట్టి సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ ఎల్లప్పుడూ తన పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో పని చేయగలుగుతుంది అని స్పష్టం ఔతోంది. ఏ పరిశ్రమకు ఆ పరిశ్రమ విడివిడిగా లాభాలను ఆర్జించితీరాలన్న నియమం లేదు. ఐతే సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలో కూడా మార్కెట్‌లో డిమాండ్‌లో ఎగుడుదిగుళ్లు ఉంటాయి. ఎందుకంటే పెట్టే పెట్టుబడులలో ఎక్కువ తక్కువలు చోటు చేసుకుంటాయి. దానికి ఉన్న కారణాలలో ఒక ముఖ్యమైన కారణం ఇలా ఉంటుంది: సోషలిస్టు నిర్మాణం ప్రారంభం అయినప్పుడు పరిశ్రమల స్థాపనకు కావాల్సిన యంత్రాల కోసం, పరికరాల కోసం ఎక్కువగా పెట్టుబడులు అవసరం అవుతాయి. కొన్ని సంవత్సరాలు గడిచాక ఆ యంత్రాలు, పరికరాలు పాతబడిపోయి కొత్త వాటి కోసం మళ్ళీ ఎక్కువ పెట్టుబడులు అవసరం అవుతాయి. ఆ విధంగా పెట్టుబడుల్లో ఎక్కువ తక్కువలు చోటు చేసుకోవడం అనేది స్థూల డిమాండ్‌లో పెద్దగా మార్పులకు దారి తీయదు. ఎందుకంటే సరుకుల ధరలు (కార్మికుల వేతనాలతో సాపేక్షంగా పోల్చినప్పుడు) పెట్టుబడులు తగ్గినప్పుడు తగ్గుతాయి. అప్పుడు డిమాండ్ పెరుగుతుంది. అదే పెట్టుబడులు పెరిగినప్పుడు దానితోబాటు డిమాండ్ కూడా పెరుగుతుంది. మొత్తం మీద మార్కెట్‌లో డిమాండ్ ఎప్పుడూ పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యానికి అనుగుణంగా కొనసాగుతూ వుంటుంది.

ఇదేదో సోషలిస్టు ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అమూర్తమైన సిద్ధాంతం వంటిది కాదు. ఈ విధంగా సోవియట్ యూనియన్ లోను, తర్వాత తూర్పు యూరప్ దేశాలలోను జరిగింది. ఆ దేశాల్లో పెట్టుబడుల్లో సంభవించే ఎక్కువ తక్కువల వలన మార్కెట్లు పెద్దగా మార్పులకు లోనవలేదు. అదే పెట్టుబడిదారీ వ్యవస్థలోనైతే, పెట్టుబడులలో ఎగుడుదిగుళ్లు పలు దొంతరలలో ప్రకంపనలకు దారితీస్తాయి. అదే సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలో ఎటువంటి ఎగుడుదిగుళ్లనైనా మార్కెట్ డిమాండ్ సమస్థితికి తీసుకు వస్తుంది. ఆర్థిక వ్యవస్థ ఎప్పుడూ పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడుస్తుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడులలోని ఎగుడు దిగుళ్లు అదే మాదిరి ఎగుడు దిగుళ్ల వినిమయంలో కూడా ఏర్పడేందుకు దారి తీస్తాయి. అదే సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులలోని ఎగుడుదిగుళ్ల దిశకు ప్రతికూల దిశలో వినిమయం లో మార్పులు జరుగుతాయి. తద్వారా ఎల్లప్పుడూ పూర్తి స్థాయిలో ఉత్పత్తి సామర్థ్యాన్ని వినియోగించుకోవడం సాధ్యమౌతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం విడివిడిగా ఉండే ప్రైవేటు వ్యక్తులది కావడం చేత అక్కడ డిమాండ్ తగ్గితే అప్పుడు నేరుగా ఉత్పత్తి కూడా తగ్గుతుంది. ఆ పెట్టుబడిదారులలో కొంతమంది గుత్తాధిపత్యం కలిగి వున్నందున వాళ్ళు డిమాండ్ తగ్గినా సరుకుల ధరలు తగ్గకుండా మార్కెట్‌ను అదుపు చేస్తారు. అప్పుడు కొంతమంది చిన్న పెట్టుబడిదారులు నష్టపోయి రంగం నుండి తప్పుకుంటారు. దాని వలన ఉత్పత్తి తగ్గుతుంది. అందుచేత పెట్టుబడిదారీ విధానంలో డిమాండ్ తగ్గితే అనివార్యంగా ఉత్పత్తి తగ్గుతుంది. అదే సోషలిజంలోనైతే ఆ తగ్గిన డిమాండ్ పర్యవసానాన్ని ఆర్థిక వ్యవస్థ ఇముడ్చుకుని ఉత్పత్తి యథాతథంగా పూర్తి స్థాయిలోనే కొనసాగేట్టు చూస్తుంది.

ప్రముఖ మార్క్సిస్టు ఆర్థికవేత్త, పోలండ్‌కు చెందిన మిచల్ కాలెక్కి పెట్టు బడివారీ వ్యవస్థకు, సోషలిస్టు వ్యవస్థకు తేడాను ఈ విధంగా చెప్పాడు. "పెట్టుబడిదారీ విధానంలో ఎప్పుడూ డిమాండ్‌కు లోటు ఉంటుంది. సోషలిజంలో సరఫరాకు లోటు ఉంటుంది." అందుచేత పెట్టుబడివారీ విధానంలో డిమాండ్ పెరిగితే దానికి అనుగుణంగా ఉత్పత్తి పెరుగుతుంది. అదే సోషలిజంలోనైతే ఎప్పుడూ ఉత్పత్తి పూర్తి సామర్థ్యంతో కొనసాగుతూ వుంటుంది కనుక డిమాండ్ పెరిగితే ధరలు పెరుగుతాయి. సోషలిజంలో నిరుద్యోగం అనేది ఉండదు. కనుక డిమాండ్ పెరిగినప్పుడు అదనంగా ఉద్యోగులను నియమించి ఉత్పత్తిని పెంచడం అనేది వెంటవెంటనే సాధ్యం కాదు.

కోరుకున్నవారందరికీ ఉపాధి కల్పించగలగడం అనేది పాత సోషలిస్టు సమాజాలు సాధించిన గొప్ప విజయం. అటువంటి విజయాన్ని ఈ ఆధునిక కాలంలో ఇంతవరకూ ఎవరూ చేరుకోలేకపోయారు.

(స్వేచ్ఛానుసరణ)

యూరియా కష్టాలకు కారణం ఎవరు?



శ్రీకాకుళం జిల్లా బూర్జ గ్రామ రైతు సేవా కేంద్రం ఆవరణలో యూరియా కోసం రైతుల పడిగాపులు

45 కిలోల బరువుగల సాధారణ యూరియాకు ప్రభుత్వం సుమారుగా రూ.2,400 నుండి రూ.2,600 వరకు సబ్సిడీ భరించాల్సి వస్తుంది. నానో యూరియాకు సబ్బిడీ ఇవ్వాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉండదు. రైతులను మార్కెట్ కంపెనీలకు బలిచ్చే ఈ విధానం అమలులో భాగమే నేడు యూరియా కొరతకు మూల కారణం. కేంద్రం నుండి రాష్ట్రాలకు ఇచ్చే యూరియా కోటాను తగ్గించుకుంటే ఆ వ్యత్యాసం సబ్సిడీ డబ్బును ఆ యా రాష్ట్రాలకు గ్రాంటుగా ఇస్తామని కేంద్రం చెప్పి అన్ని రాష్ట్రాలకు పది శాతం యూరియా సరఫరాకు కోత కోసింది. మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 25 శాతం తగ్గించుకుని ఆ వ్యత్యాసం డబ్బును తన ఖజనాలో వేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. రైతుల ప్రాణాలతో పాలకులు చెలగాటం ఆడుతున్నారు. దీనికి వ్యతిరేకంగా రైతులు, కౌలుదారులు ఉద్యమాలకు సిద్ధంకావాలి.

విశ్లేషణ

యూరియా కొరత లేదని రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు చెబుతుంటే, రైతుల క్యూలు మాత్రం రాష్ట్రమంతటా వ్యాపిస్తున్నాయి. ముఖ్యమంత్రి అడిగిందే తడవుగా టన్నుల కొద్దీ యూరియాను వ్యాగిన్లకు నింపి కేంద్రం పంపిందని ప్రచారం చేస్తున్న మీడియా సంస్థలు కూడా యూరియా రైతుల కష్టాల గురించి రాయక తప్పడంలేదు. ఎరువుల కొరత అనేది గత కొన్ని సంవత్సరాలుగా పెరుగుతున్నది. ఇలా ఎందుకు జరుగుతున్నది? దీనికి కారణాలు ఏమిటి, కారకులు ఎవరు?



యం. హరిబాబు

దేశంలో 1957లో ఎరువుల కంట్రోల్ ఆర్డర్ ఏర్పడింది. ఆ తర్వాత 1985లో ఈ చట్టాన్ని సవరించి మరింత బలపరిచారు. దీని ద్వారా పంటలకు అవసరమైన ఎరువులను ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా ఉత్పత్తి చేయడంతో పాటు, ప్రైవేటు కంపెనీల నుండి ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు సబ్సిడీ ఇచ్చే విధానం వుండేది. అయితే 1990 తర్వాత వచ్చిన నూతన ఆర్థిక విధానాలు ఈ పద్ధతికి తిలోదకాలు ఇచ్చాయి. రిటెన్షన్ ప్రైస్ సిస్టమ్ ద్వారా కంపెనీల ఉత్పత్తి ఖర్చును లెక్కించి రైతులకు భారం పడకుండా అవసరమైన సబ్సిడీని ప్రభుత్వాలు భరించే పద్ధతిని పూర్తిగా మార్చి వేస్తూ ప్రస్తుత బిజెపి ప్రభుత్వం 2025లో సవరించింది.

దీని వల్ల యూరియా, ఇతర ఎరువుల కొరత దేశవ్యాప్తంగా పెరుగుతుంది. అయితే అత్యధిక రాష్ట్రాలు బిజెపి ఏలుబడిలో వున్నాయి కనుక డిమాండ్‌కు తగ్గట్టుగా ఆ రాష్ట్రాలకు సరఫరా చేసి మన లాంటి రాష్ట్రాలను ఎండబెడుతు న్నారు. ఎరువులను సబ్సిడీకి అందించకుండా ఆహార భద్రతను సాధించలేము. రైతు ఉద్యమాల ఫలితంగా కొన్ని చట్టాలు అమలులోకి వచ్చాయి. అయితే కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తున్న బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఈ కంపెనీలకు అప్పగించడానికి అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నది. వ్యవసాయ నల్ల చట్టాలతో పాటు, రైతులకు కొద్ది మేరకైనా రక్షణగా వున్న ధరల నియంత్రణ కమిషన్, ఎరువుల కంట్రోల్ ఆర్డర్ లాంటి వాటిని మార్చివేస్తున్నారు. 1992 నుండి ఫాస్పేట్ ఎరువులపై కంట్రోల్ ఎత్తివేయటం మొదలు పెట్టారు. యూరియాపై నియంత్రణను ఒకేసారి ఎత్తివేస్తే రైతుల్లో వ్యతిరేకత వస్తుందనే భయంతో దొడ్డిదారిన కోత వేస్తున్నారు.

రామగుండం లాంటి అనేక ప్రభుత్వ రంగ ఎరువుల పరిశ్రమలను మూసివేసి విదేశాల నుండి దిగుమతులు చేసుకోవడం విధానంగా మారింది. ఏ కంపెనీ ఏ దేశం నుండి దిగుమతి చేసుకోవాలో కేంద్రం నిర్ణయించే విధానం అమలులోకి వచ్చింది. 2010లో ప్రవేశపెట్టిన న్యూట్రియంట్ ఆధారిత సబ్సిడీ (యన్.బి.ఎస్) స్కీము కూడా నష్టం తెచ్చింది. యన్.బి.ఎస్ స్కీమ్‌లో యూరియాను మినహాయించారు. మిగిలిన ఎరువులపై కంట్రోల్ పూర్తిగా ఎత్తివేశారు. దీంతో మార్కెట్ డిమాండ్‌ను బట్టి ఎరువుల ధరలు భారీగా పెంచి కంపెనీలు లాభపడుతుంటే, రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. సరసమైన ధరలకు మాత్రమే ఎరువులను అమ్మాలని ఉత్పత్తిదారులకు ప్రభుత్వాలు చేస్తున్న విజ్ఞప్తులు మొసలి కన్నీరు లాంటివి. సరసమైన ధర అంటే ఏమిటో 2015లో ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వలేదని కాగ్ (కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా) చెప్పింది. ఉత్పత్తి ఖర్చుపై 12 శాతానికి మించకుండా లాభాలు ఉండాలని 2019లో ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఉత్పత్తి ఖర్చు ఎంత అనే వివరాలు ఉత్పత్తిదారుల దగ్గర అందుబాటులో లేవనీ కాగ్ చెప్పింది. ఎరువుల ఉత్పత్తి కంపెనీలు తమ ఇష్టారీతిన ఎం.ఆర్.పి ధరలు నిర్ణయించుకుంటున్నాయి. కంపెనీలు ఎంత శాతం లాభాలు వేసుకుంటున్నాయో లెక్కాపత్రం లేకుండా పోయిందని కాగ్ చెప్పింది. ఎరువులపై కంట్రోల్ ఎత్తివేయడంతో 2010లో పొటాష్ టన్ను ధర రూ.4,455 ఉంటే 2023లో రూ.34,644 ప్రస్తుతం 30 వేలకు పైనే ధర ఉంది. డై అమోనియం ఫాస్పేట్ (డి.ఎ.పి) 2017లో రూ.9,350 ఉండే, 2023లో రూ.27,000 వుండగా ప్రస్తుతం రూ.60 వేలకు పైగా టన్ను ధర ఉంది.

యూరియాను మాత్రం న్యూట్రియెంట్ ఆధారిత సబ్సిడీ కింద చేర్చలేదు. కాబట్టి యూరియాపై ప్రభుత్వాలు సబ్సిడీని కొనసాగిస్తున్నాయి. ప్రస్తుతం యూరియా 45 కేజీల బస్తా రూ.266.50గా నిర్ణయించారు. దీంతో యూరియాకు సబ్సిడీ ఉండటం వల్ల తక్కువ ధరకు రైతులకు అందుబాటులో ఉంది. డి.ఎ.పి, పొటాష్, ఫాస్పేట్ తదితర ఎరువుల ధరలు విపరీతంగా పెరగటం, యూరియా ధర తక్కువగా ఉండటంతో రైతులు యూరియా వాడకం పెంచారు. దేశీయ డిమాండ్‌కు అనుగుణంగా యూరియా ఉత్పత్తి చేయకుండా విదేశాల నుండి దిగుమతి చేసుకోవడంతో కొరత పెరిగి ధర భారీగా పెంచి కంపెనీలు, వ్యాపారసంస్థలు లాభపడుతు న్నాయి. ఈ మూడు దశాబ్దాల్లో దేశీయ ఉత్పత్తి బాగా పడిపోతూ వచ్చింది. ప్రత్యేకించి డి.ఎ.పి 60 శాతం, ఎం.ఓ.పి 100 శాతం విదేశాల మీద ఆధారపడి వుంది. ప్రపంచ ఎరువుల ఉత్పత్తిలో 84 శాతం ఎం.ఓ.పి ని ఏడు కంపెనీలు నియంత్రిస్తున్నాయి. 10 పెద్ద ఎరువుల కంపెనీలు 38 శాతం ఎరువుల అమ్మకాలు జరుపుతున్నాయి. కంపెనీల ను నియంత్రించే శక్తి ప్రభుత్వాలకు లేకుండా పోయింది. ముడి పదార్థాల ధరలు పెరగటం, రూపాయి విలువ తగ్గటం, అంతర్జాతీయ మార్కెట్ ధరల ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థ మీద, ముఖ్యంగా రైతాంగం మీద చాలా తీవ్రంగా పడింది. గత నాలుగు సంవత్సరాలుగా ఎరువుల కొరత గురించి పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఉద్దేశ పూర్వకమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. 2020లో అవసరమైన ఎరువులలో 40 శాతం తక్కువగా రైతులకు ఇచ్చారు. క్రమంగా ఆ కొరత 68 శాతానికి పెరిగింది. యూరియా కొరత మరింత పెద్ద సమస్యగా తయారైంది. కరోనా అనంతరం 2020 మార్చి గణాంకాలను 2019తో పోలిస్తే 15 శాతం తక్కువగా యూరియా మార్కెట్‌లోకి వచ్చింది. 2020 డిసెంబర్ 20 నాటికి 52 శాతం కొరత ఏర్పడింది. ఫలితంగా రైతులు ఎరువులను బ్లాక్ మార్కెట్లో కొనుక్కోవాల్సి వచ్చింది. ఇచ్చే అరకొర ఎరువులకు కూడా అధార్ లింక్ పెట్టారు. దీనివల్ల కౌలు రైతులపై మరింత అదనపు భారం పడుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని చెప్పే మాటలు ఎండమావుల్లా మారుతున్నాయి. ఎన్నికల ముందు కౌలు రైతులను ఆదుకుంటామన్న మన ముఖ్యమంత్రి రానున్న రబీలో ఎరువులను ఆధార్‌తో, ఈ క్రాప్‌తో లింక్ చేసి రైతులకు అమ్ముతామని ప్రకటించారు. దీంతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతారు.

గత సంవత్సరం ఆగస్టు నాటితో పోలిస్తే ఈ సంవత్సరం యూరియా నిల్వలు 49 శాతం తక్కువగా ఉన్నాయి. డి.ఎ.పి, కాంప్లెక్స్, పొటాష్ నిల్వలు కూడా తక్కువగానే ఉన్నాయి. ప్రభుత్వ ప్రకటనలు, మంత్రుల సవాళ్ళు చూస్తుంటే వాస్తవ పరిస్థితుల నుండి రైతులను ఆదుకోవాలనే చిత్తశుద్ధి కంటే సమస్యను పక్కదారి పట్టించి రాజకీయ నష్ట నివారణకు ప్రయత్నిస్తున్నట్లుగా వుంది. ఎరువుల సమస్యకు మూలమైన కేంద్ర ప్రభుత్వ విధానాల గురించి వైసిపి ఒక్క మాట మాట్లాడకుండా వీధుల్లో ఆందోళన చేస్తుంది. నానో యూరియా, బయో ఫెర్టిలైజర్, ఆర్గానిక్ ఫార్మింగ్ వాడి ఆరోగ్యాన్ని కాపాడుకొమ్మని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. ప్రభుత్వ విధానం వెనుక వున్న ఉద్దేశాన్ని గుర్తించకుండా కొద్దిమంది మేధావులు గుడ్డిగా బలపరుస్తున్నారు. భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'ఇఫ్కో' ఈ సంవత్సరం 1,224.36 లక్షల నానో యూరియా బాటిళ్లను 500 మిల్లీలీటర్ల పరిమాణంలో తయారు చేసింది. ఇప్పటికి 993.61 లక్షల బాటిళ్లను అమ్మారు. 45 కిలోల బరువుగల సాధారణ యూరియాకు ప్రభుత్వం సుమారుగా రూ.2,400 నుండి రూ.2,600 వరకు సబ్సిడీ భరించాల్సి వస్తుంది. నానో యూరియాకు సబ్బిడీ ఇవ్వాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉండదు. రైతులను మార్కెట్ కంపెనీలకు బలిచ్చే ఈ విధానం అమలులో భాగమే నేడు యూరియా కొరతకు మూల కారణం. కేంద్రం నుండి రాష్ట్రాలకు ఇచ్చే యూరియా కోటాను తగ్గించుకుంటే ఆ వ్యత్యాసం సబ్సిడీ డబ్బును ఆ యా రాష్ట్రాలకు గ్రాంటుగా ఇస్తామని కేంద్రం చెప్పి అన్ని రాష్ట్రాలకు పది శాతం యూరియా సరఫరాకు కోత కోసింది. మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 25 శాతం తగ్గించుకుని ఆ వ్యత్యాసం డబ్బును తన ఖజానాలో వేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. రైతుల ప్రాణాలతో పాలకులు చెలగాటం ఆడుతున్నారు. దీనికి వ్యతిరేకంగా రైతులు, కౌలుదారులు ఉద్యమాలకు సిద్ధంకావాలి.

/వ్యాసకర్త ఎ.పి కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి/

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

ఇంజినీర్లకు ఆదర్శం విశ్వేశ్వరయ్య

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ రంగంలో సుస్థిర అభివృద్ధి కోసం ఇంజినీర్లు సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తెలిపారు. విశ్వేశ్వరయ్య జయంతి, ఇంజినీర్స్‌డే సందర్భంగా ఎపిఎస్ఇబి ఇంజినీర్ల సంఘం ఆధ్వర్యాన రూపొందించిన 'ఆంధ్రప్రదేశ్ పవర్ ట్రెండ్స్' అనే న్యూస్ లెటర్‌ను విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం విజయానంద్ ఆవిష్కరించారు. విశ్వేశ్వరయ్య భారత ఇంజినీరింగ్ పితామహుడని, నీటివనరుల వినియోగంలో ఆయన చేసిన కృషి అపారమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అనేక ఆనకట్టల నిర్మాణంలో ఆయన పాత్ర చిరస్మరణీయమని గుర్తు చేశారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిలో 2030 నాటికి 50 శాతం స్థాపిత సామర్థ్యం, పునరుత్పాదక వనరుల నుంచి విద్యుత్ సామర్థ్యం అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ క్లీన్‌ఎనర్జీ పాలసీని విడుదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డైరెక్టర్లు ఎవి భాస్కర్, జెవి రావు, సంఘం అధ్యక్షులు ఎన్ స్యామ్యూల్, అసిసోయేట్ ప్రెసిడెంట్ కె వెంకట రామారావు, ప్రధాన కార్యదర్శి కె నాగప్రసాద్, అదనపు సెక్రటరీ జనరల్ డి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. విశ్వేశ్వరయ్య జయంతి విజయవాడలోని విద్యుత్ సౌధలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్ బాబు నివాళులర్పించారు. ఇంజినీర్ల అంకిత భావం వల్ల విద్యుత్ రంగం బలోపేతం కావడమే కాకుండా వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించగలమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డైరెక్టర్లతోపాటు జెన్‌కో డైరెక్టర్లు ఎం సుజయ్‌కుమార్, పి అశోక్‌కుమార్ రెడ్డి, వి ఉషా, అదనపు కార్యదర్శి రోజా తదితరులు పాల్గొన్నారు.

త్రిపురలో బిజెపి బరితెగింపు

ఐద్వా నేత ఇంటిపై దాడి, గేటుకు తాళం



ఐద్వా నేత ఇంటికి తాళాలు వేసి, నల్లరంగు పూసిన దృశ్యం

అగర్తల : త్రిపురలో బిజెపి బరితెగించింది. బిజెపి నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక, మహిళా వ్యతిరేక చర్యలను నిరసిస్తూ ఐద్వా చేపడుతున్న ఉద్యమంలో వివిధ వర్గాల మహిళల భాగస్వామ్యం పెరుగుతుండటం తో అణచివేతకు ప్రయత్నిస్తోంది. ఆదివారం రాత్రి ఐద్వా మోహన్‌పూర్ సబ్-డివిజనల్ కమిటీ కార్యదర్శి జర్నా మజుందార్ ఇంటిపై దాడి చేయడంతోపాటు ఆమె ఇంటి తలుపులు, కిటికీల గోడ, ప్యానెల్‌లకు నల్లరంగు వేసింది. బయటి నుంచి తలుపు, గేటుకు తాళం వేసింది. జర్నా మజుందార్ పార్టీ, ఐద్వా కార్యకర్త. జిల్లా, సబ్ డివిజనల్ సమావేశాలకు సిద్ధమవుతున్న తరుణంలో ఆమెను భయభ్రాంతులకు గురిచేసేందుకు బిజెపి గూండాలు ఈ దాడికి తెగబడ్డారు.

వాహన ఉత్పత్తిలో తగ్గుదల

- ఆగస్టు విక్రయాల్లో 9 శాతం తగ్గుదల



న్యూఢిల్లీ : వాహనాల ఉత్పత్తిలో తగ్గుదల చోటు చేసుకుంది. ఈ ఏడాది ఆగస్టులో నెలలో ప్యాసింజర్ వాహనాల ఉత్పత్తిలో 4.1 శాతం తగ్గుదల చోటు చేసుకున్నట్లు పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు తయారీదారులు డీలర్లకు పంపిన డెలివరీలు దాదాపు 9 శాతం తగ్గాయి. వాహనాలపై జిఎస్‌టిని తగ్గించనున్నామని కేంద్రం ప్రకటించిన తర్వాత ఒక్కసారిగా అమ్మకాలు తగ్గాయి. ధరల తగ్గింపు ఆశతో వినియోగదారులు కొనుగోలు నిర్ణయాలను వాయిదా వేసుకుంటున్నారని.. దీంతో అనేక డీలర్‌షిప్‌లలో రిటైల్ అమ్మకాలు దెబ్బతిన్నాయని ఆ వర్గాలు తెలిపాయి. దీంతో ఆగస్టు చివరి నాటికి కార్ల ఇన్వెంటరీ నిల్వలు 60 రోజులకు చేరుకున్నాయి. మొత్తం ఛానల్ ఇన్వెంటరీ దాదాపు 6,00,000 యూనిట్లకు చేరింది. దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి డెలివరీలు 8 శాతం తగ్గాయి. ఎంఅండ్ఎం 9 శాతం కంటే ఎక్కువ, హ్యుందాయ్ మోటార్ ఇండియా డిస్పాచ్‌లు సుమారు 10 శాతం తగ్గాయి.

'గడిచిన ఆగస్టులో ప్యాసింజర్ వెహికల్ అమ్మకాలు గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 8.8 శాతం తగ్గి 3,22,000 యూనిట్లకు చేరాయి. మొత్తం ప్రయాణికుల వాహనాల ఉత్పత్తి 4 శాతం తగ్గి 1,25,000 యూనిట్లకు పరిమితమయ్యాయి." అని సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియోమ్) డైరెక్టర్ జనరల్ రాజేష్ మీనన్ పేర్కొన్నారు. ద్వి, త్రిచక్ర వాహన అమ్మకాలు 7.1 శాతం పెరిగి 18.3 లక్షల యూనిట్లుగా చోటు చేసుకున్నాయి. స్కూటర్ అమ్మకాలు 12.7 శాతం, మోటార్‌సైకిళ్లు 4.3 శాతం చొప్పున పెరిగాయి. సియోమ్ గణాంకాల ప్రకారం.. ఆథర్ డిస్పాచ్‌లు దాదాపు 70 శాతం పెరిగి 22,757 యూనిట్లకు చేరాయి. హీరో మోటోకార్ప్ 5.4 శాతం వృద్ధిని నమోదు చేయగా..రాయల్ ఎన్‌ఫీల్డ్ డిస్పాచ్‌లు 56 శాతం పెరిగాయి. గడిచిన ఆగస్టులో మూడు చక్రాల వాహనాల అమ్మకాలు 8.3 శాతం పెరిగి 76,000 యూనిట్లకు చేరాయి.

భూమిచ్చాక నిర్వాసితుడు ఉద్యోగం కోసం నిరీక్షించాలా? : హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి

ప్రాజెక్టు కోసం భూమి తీసుకున్నప్పుడు ఉద్యోగం ఇస్తామన్న 1992 నాటి హామీని ఇప్పటికీ అమలు చేసే తీరిక అధికారులకు లేదా అని హైకోర్టు ప్రశ్నించింది. భూమి తీసుకునేందుకు చూపిన ఉత్సుకత భూమి కోల్పోయిన వ్యక్తికి ఉద్యోగం ఇచ్చేటప్పుడు ఎందుకు చూపడం లేదని నిలదీసింది. భూమిని కోల్పోవడం అంటే జీవనాన్ని దెబ్బతీయడమేనని, ఇది రాజ్యాంగం కల్పించిన హక్కును కాలరాయడం కిందకే వస్తుందని వ్యాఖ్యానించింది. భూ నిర్వాసితులు హుందాగా జీవించలేరని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రాజెక్టు నిర్మాణం అయ్యే వరకు ఉద్యోగం ఇవ్వరా? ప్రాజెక్టు 25, 30 ఏళ్లు పడితే బాధితుడి బతుకు ఏం కావాలని నిప్పులు చెరిగింది. రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్‌టిపిపి) స్టేజ్-1 రైల్వే ట్రాక్ కోసం 1992లో చేపట్టిన భూ సేకరణలో భూమిచ్చిన వ్యక్తికి జూనియర్ ప్లాంట్ అటెండెంట్ (జెపిఎ) ఉద్యోగం ఇవ్వాలని గతంలో సింగిల్ జడ్జి ఆదేశించారు. ఈ తీర్పును రద్దు చేయాలంటూ రాష్ట్రం దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌పై తీర్పును వాయిదావేస్తున్నట్లు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ ఎ.హరిహరనాథశర్మతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ప్రకటించింది. కడప జిల్లా, ముద్దనూర్ గ్రామానికి చెందిన రామసుబ్బయ్య.. ప్రాజెక్టు కోసం 60 సెంట్ల భూమిచ్చారు. తనకు లేదా కొడుకుకు ఉద్యోగం ఇవ్వాలని అప్లికేషన్ పెట్టుకున్నాడు. ఫలితం లేకపోవడంతో హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై సింగిల్ జడ్జి సుబ్బయ్య కొడుకు రాజశేఖర్ పేరును పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ రెండేళ్ల క్రితం తీర్పు చెప్పారు. అప్లికేషన్ పెట్టే సమయానికి ఉద్యోగాల భర్తీ జరిగిపోయిందని ప్రభుత్వ వాదన. భూనిర్వాసితుల పట్ల ప్రభుత్వ తీరు దయనీయంగా ఉందని హైకోర్టు తప్పుపట్టింది. అప్పీల్‌పై తీర్పు తరువాత చెబుతామని ప్రకటించింది.

ఎపిపిఎస్‌సి ఛైర్మన్ అనూరాధ రిలీవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) ఛైర్మన్ ఎఆర్ అనూరాధ పదవీ విరమణకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన జిఓ 104ను సాధారణ పరిపాలనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ సోమవారం విడుదల చేశారు. అక్టోబర్ 9న ఆమె పదవీ విరమణ చేస్తారని పేర్కొన్నారు. 1987 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన అనూరాధ 2024 అక్టోబరు 23న ఎపిపిఎస్‌సి ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఎపిపిఎస్‌సి ఛైర్మన్‌గా నియమితులైన వారు ఆరేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగే అవకాశం ఉంది. అయితే ఆ పదవిలో ఉండేవారి వయసు 62 ఏళ్లు దాటకూడదు. ప్రస్తుతం అనూరాధకు వచ్చే నెలలో 62 ఏళ్లు దాటడంతో ఆమెను ఆ బాధ్యతల నుంచి ప్రభుత్వం రిలీవ్ చేస్తుంది.

వచ్చే ఏడాది ఐపిఒకు మెడికవర్ హాస్పిటల్

- రూ.2,000 కోట్ల టర్నోవర్ లక్ష్యం
- నేడు సికింద్రాబాద్‌లో కొత్త ఆసుపత్రి ప్రారంభం
- సిఎండి అనిల్ కృష్ణ వెల్లడి



ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

వచ్చే ఏడాది తమ సంస్థను ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు తెచ్చే యోచనలో ఉన్నామని మెడికవర్ హాస్పిటల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) అనిల్ కృష్ణ వెల్లడించారు. సంస్థ వ్యాల్యుయేషన్ ఒక బిలియన్ డాలర్లు (దాదాపు రూ.8800) ఉండొచ్చని అంచనా వేస్తున్నామన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అనిల్ కృష్ణ మాట్లాడుతూ.. సంస్థ విస్తరణ ప్రణాళికలను ప్రకటించారు. ప్రస్తుతం తమకు 23 హాస్పిటల్స్ ఉన్నాయని.. మంగళవారం సికింద్రాబాద్‌లో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించడం ద్వారా 24కు చేరనున్నాయని వెల్లడించారు. దీన్ని 100 కోట్ల పెట్టుబడితో.. 300 పడకలతో అందుబాలోకి తెచ్చామన్నారు. దీంతో మొత్తం పడకలు 5800కి చేరనున్నాయని చెప్పారు. త్వరలోనే ఫైనాన్షియల్ డిస్ట్రిక్ కోకాపేటలో మరో హాస్పిటల్ అందుబాటులోకి రానుందన్నారు. తమ సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో కార్యకలాపాలను కలిగి ఉందన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూ.1850 కోట్ల టర్నోవర్ నమోదు చేశామని చెప్పారు. ప్రస్తుతం 2025-26లో రూ.2,000 కోట్ల మేర సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 6300 బెడ్లకు విస్తరించనున్నామని చెప్పారు. ఫైనాన్సియల్ డిస్ట్రిక్‌లో రూ.150 కోట్లతో తెస్తోన్న హాస్పిటల్‌లో 500 పడకల సామర్థ్యంతో రానుందన్నారు. దీంతో 25 ఆసుపత్రులకు చేరనున్నాయని చెప్పారు. భవిష్యత్తులో ప్రస్తుతం తాము కార్యకలాపాలు కలిగిన ఉన్న ప్రధాన నగరాలు సహా ద్వితీయ శ్రేణీ నగరాల్లో మరొన్ని కొత్త హాస్పిటళ్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

వక్ఫ్ చట్టంపై సుప్రీం తీర్పును స్వాగతించిన మంత్రి ఫరూక్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వక్ఫ్ చట్టంపై సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పును స్వాగతిస్తున్నట్లు న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్టం సవరణలపై ముస్లిం వర్గాల్లో నెలకొన్న ఆందోళనలను దృష్టిలో పెట్టుకుని జెపిసి దృష్టికి వెళ్లేలా సిఎం చంద్రబాబు కృషి చేశారని మంత్రి తెలిపారు. చట్టాన్ని పరిశీలించిన జెపిసి కొన్ని అసమంజస సవరణలను తొలగించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వక్ఫ్ చట్ట సవరణల అమలుపై సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పును వెల్లడించి, రాజ్యాంగ పరంగా కల్పించిన హక్కులను కాపాడి, తన ఔన్నత్యాన్ని చాటి చెప్పడంతో ప్రజల విశ్వాసాన్ని గెలిచిందన్నారు.

టిక్‌టాక్ అమెరికా నియంత్రణలోకి..

మాడ్రిడ్ : ప్రముఖ సామాజిక మాధ్యమం టిక్‌టాక్ అమెరికా కంపెని నియంత్రణలోకి వస్తుందని అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ సోమవారం ప్రకటించారు. చైనా ప్రతినిధులతో జరిగిన చర్చల్లో ఫ్రేమ్ వర్క్ ఒప్పందం కుదిరిందని, రెండు దేశాల ప్రతినిధులు వాణిజ్యపరమైన నిబంధనలకు అంగీకరించారని స్కాట్ తెలిపారు. అమెరికాలో టిక్‌టాక్ నిషేధానికి కారణమైన సమస్యలను పరిష్కరించే విదంగా చర్చలు జరిపామని, మరిన్ని విషయాలను త్వరలో తెలుపుతామన్నారు. చైనాపై 100% సుంకాలను విధించాలని ట్రంప్ యూరోపియన్ యూనియన్‌ను బెదిరించిన సంగతి తెలిసిందే. మరోవైపు తన సోషల్ ట్రూత్‌లో " అమెరికా యువతకు ఇష్టమైన సామాజిక మాధ్యమంతో ఒప్పందం కుదిరింది. మీరు ఎంతో సంతోషంగా ఉంటారు " అంటూ టిక్‌టాక్ పేరు ప్రస్తావించకుండా రాసుకొచ్చారు. ఈ డీల్ కోసం చైనా అధ్యక్షుడితో శుక్రవారం మాట్లాడతానని తెలిపారు. చైనా కంపెని బైట్‌డాన్స్‌కు చెందిన టిక్‌టాక్ ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రెండు బిలియన్ల వినియోగదారులను కలిగివుంది. సోమవారం జరిగిన ఒప్పందంతో టిక్‌టాక్‌ని అమెరికాలో అనుమతించారు. దీంతో మిలియన్ల మంది అమెరికన్లకు ఇది అందుబా టులోకి వచ్చింది. ఈ నెల 17 లోగా డీల్‌ను చైనా పూర్తిచేయకుంటే టిక్‌టాక్‌ను నిషేధిస్తామ ని అమెరికా అధికారులు స్పష్టం చేశారు.

శ్రీవారిని దర్శించుకున్న మారిషస్ దేశ ప్రధాని

ప్రజాశక్తి - తిరుమల

మారిషస్ దేశ ప్రధానమంత్రి నవీన్ చంద్ర రామ్‌గులాం సోమవారం సాయంత్రం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు, ఇఒ అనిల్ కుమార్ సింఘాల్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించిన అనంతరం స్వామిని రామ్‌గులాం దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించగా టిటిడి ఛైర్మన్, ఇఒలు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దాడులపై ఇజ్రాయిల్‌ను జవాబుదారీ చేయాల్సిందే

- అంతర్జాతీయ సమాజానికి ఖతార్ ప్రధాని విజ్ఞప్తి
- నేడు మానవ హక్కుల మండలిలో చర్చ
- నెతన్యాహు జాగ్రత్తగా ఉండాలంటూ అమెరికా సుద్దులు

జెనీవా : హమాస్ నేతలను మట్టుబెట్టే లక్ష్యంతో ఖతార్‌పై ఇజ్రాయిల్ దాడులకు పాల్పడిన ఘటనపై మంగళవారం చర్చ జరపనున్నట్లు ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి తెలిపింది. ఇజ్రాయిల్ దాడిపై అత్యవసరంగా చర్చ జరగాలంటూ అధికారికంగా రెండు అభ్యర్థనలు వచ్చాయని, ఆ మేరకే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు కౌన్సిల్ సోమవారం తెలిపింది. ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్ (ఓఐసి) సభ్య దేశాల తరపున పాకిస్తాన్ నుండి ఒక అభ్యర్థన రాగా, గల్ఫ్ అరబ్ దేశాల సహకార మండలి తరపున కువైట్ నుండి మరో అభ్యర్థన వచ్చిందని మండలి తెలిపింది. 2006లో మండలి ఏర్పడిన తర్వాత అత్యవసరంగా చర్చలు జరిపిన వాటిల్లో ఇది పదవదని కౌన్సిల్ తెలిపింది. ఖతార్‌పై దాడులకు అంతర్జాతీయంగా తీవ్ర ఖండనలు వెల్లువెత్తాయి.

నెతన్యాహూ జాగ్రత్తగా వుండాలన్న అమెరికా మంత్రి

ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుతో ఖతార్‌పై దాడుల విషయాన్ని చర్చించేందుకు అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రూబియో భేటీ అయ్యారు. ఖతార్‌పై దాడుల వల్ల గాజాలో కాల్పుల విరమణ చర్చలు పక్క దారిపట్టే అవకాశం వుందని అమెరికా ఆందోళనలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం జరుగుతోంది. ఆదివారం ట్రంప్, కతార్‌కు మద్దతును ప్రకటించారు. ఖతార్ మాకు మంచి మిత్రపక్షం. ఇజ్రాయిల్‌తో సహా ఎవరైనా సరే జాగ్రత్తగా వుండాల్సిందే, ప్రజలపై దాడి చేసేటప్పుడు మరింత అప్రమత్తత అవసరమని ట్రంప్ విలేకర్లతో వ్యాఖ్యానించారు. ఖతార్‌పై దాడులకు ముందు అమెరికాకు తెలియజేశామని ఇజ్రాయిల్ ఇప్పటికే ప్రకటించడం గమనార్హం.

ద్వంద్వ ప్రమాణాలు తిరస్కరించండి : ఖతార్ ప్రధాని విజ్ఞప్తి


ద్వంద్వ ప్రమాణాలను పాటించడాన్ని తిరస్కరించి, ఇజ్రాయిల్‌ను తాను పాల్పడిన నేరాలకు జవాబుదారీ చేయాలని ఖతార్ ప్రధాని షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ జాసిమ్ అల్ తాని అంతర్జాతీయ సమాజాన్ని కోరారు. దోహాలో ఇజ్రాయిల్ అనూహ్యంగా జరిపిన దాడులపై చర్చించేందుకు అత్యవసరంగా ఏర్పాటుచేసిన అరబ్-ఇస్లామిక్ సదస్సుకు ముందస్తు మంత్రిత్వస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఈ దాడిలో ఖతార్ సెక్యూరిటీ ఆఫీసర్‌తో సహా ఐదుగురు హమాస్ నేతలు మరణించారు. గల్ఫ్ దేశాల మధ్య ఐక్యతను ప్రదర్శించేలా సోమవారం అరబ్, ఇస్లామిక్ నేతలు అత్యవసరంగా సమావేశమయ్యారు. తద్వారా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి పెంచాలని భావిస్తున్నారు. గాజాలో పాలస్తీనా జాతిని అంతం చేయాలన్న ఇజ్రాయిల్ లక్ష్యం నెరవేరదని ఖతార్ ప్రధాని స్పష్టం చేశారు. ఇజ్రాయిల్‌ను ఇంతలా ప్రోత్సహిస్తున్నది ఏమిటనుకుంటున్నారు? మౌనం, నిష్క్రియాపరత్వం అదే ఇంతవరకు తెచ్చింది, ఇకపై ఇటువంటివి సాగబోవని, చేసిన నేరాలకు శిక్ష అనుభవించాల్సిందేనని ఇజ్రాయిల్‌కు స్పష్టం చేయాల్సిందేనని ప్రధాని పేర్కొన్నారు.

మెయితీలతో ఒప్పందం కుదిరేవరకూ ఎన్‌హెచ్-2 ప్రారంభం కాదు : కుకి - జో కౌన్సిల్

న్యూఢిల్లీ : మెయితీలతో పరిష్కార ఒప్పందం కుదిరే వరకూ మణిపూర్‌లో జాతీయ రహదారి-2ను ప్రారంభించేది లేదని కుకి-జో కౌన్సిల్ (కెజెడ్‌సి) సోమవారం స్పష్టం చేసింది. ఎన్‌హెచ్ - 2 పునఃప్రారంభం కోసం ఈ నెల 4న కేంద్ర హోం మంత్రిత్వ శాఖతో జరిగిన ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు తెలిపింది. 'మెయితీ - కుకి జో గ్రూపుల మధ్య వివాదానికి ఇంకా పరిష్కారం లేదా ఒప్పందం కుదరనందున ఎన్‌హెచ్ - 2 ప్రారంభం కాలేదు. ఇరు వైపుల నుంచి ఎవరూ బఫర్ జోన్లను దాటకూడదు' అని కెజెడ్‌సి సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. 'ఎన్‌హెచ్-2ను పునఃప్రారంభిస్తున్నట్లు కెజెడ్‌సి ఎప్పుడూ ప్రకటించలేదు. ఈ మార్గంలో ఎటువంటి స్వేచ్ఛా కదలికకు అనుమతి లేదు. ఎన్‌హెచ్-2 వెంబడి ప్రయాణికుల భద్రతను కాపాడ్డానికి భద్రతా దళాలకు తగిన సహకారం అందించాలని కాంగ్‌పోక్పి ప్రజలకు మా అభ్యర్థన' అని ప్రకటనలో తెలిపింది. 2023 మే 3 నుంచి హింసాకాండ జరుగుతుండటంతో మణిపూర్‌లో ఎన్‌హెచ్2 మూసివేశారు. ఈ హైవే సాధారణ ట్రాఫిక్ కోసం తెరిచే ఉంటుంది.

కుకి-జో, మెయితీ సభ్యులు ఒకరి జోన్లలోకి మరొకరు ప్రవేశించడం లేదు. ఇంఫాల్ లోయకు అవసరమైన రవాణా సామాగ్రి తరలించడానికి, ప్రయాణాలకు ఈ రహదారి అత్యంత కీలకం. ఇంఫాల్‌లోని విమానాశ్రయానికి ఇది కీలకమైన రహదారి.



న్యూమెరోస్ మోటార్స్ డిప్లోస్ మాక్స్ ప్లస్ విడుదల

బెంగళూరు : విద్యుత్ వాహనాల తయారీ కంపెనీ న్యూమెరోస్ మోటార్స్ కొత్తగా డిప్లోస్ మ్యాక్స్ ప్లస్‌ను విడుదల చేసినట్లు వెల్లడించింది. డిప్లోస్ మాక్స్‌లో 4కిలోవాట్ డ్యూయల్ లిక్విడ్ ఇమర్షన్ కూల్డ్ బ్యాటరీ, 156 కి.మీ రేంజ్, గంటలకు 70 కిలోమీటర్ల టాప్ స్పీడ్‌తో ప్రయాణించగలదని ఆ కంపెనీ పేర్కొంది. దీని ఎక్స్‌షోరూం ధరను రూ.1.21 లక్షలుగా నిర్ణయించింది.



ఎరువుల కోసం రైతుల ఆందోళన

ప్రజాశక్తి - గజపతినగరం (విజయనగరం)

విజయగనరం జిల్లాలోని గజపతినగరం మండలంలో ఎరువుల కోసం రైతులు ఆందోళనకు దిగారు. పిఎసిఎస్‌లకు, ఆర్‌బికెలకు ఎరువులు వస్తున్నాయని తెలుసుకున్న రైతులు వందలాదిగా ఆయా కేంద్రాలకు చేరడం, అరకొరగా మాత్రమే ఎరువులు రావడంతో తోపులాట చోటు చేసుకొని ఉద్రిక్తత నెలకొంది. గజపతినగరం పిఎసిఎస్‌లో ప్రభుత్వం, అధికారుల తీరుపై కొంతమంది రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో యూరియా పంపిణీ నిలిపివేయాలని పిఎసిఎస్ చైర్మన్ లెంక బంగారునాయుడు, సిబ్బంది నిర్ణయించారు. దీంతో, రాజకీయ నాయకుల సిఫార్సులు కారణంగానే పంపిణీ నిలిపివేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపై రైతులు బైఠాయించారు. ట్రాక్టర్‌ను రోడ్డుకు అడ్డంగా నిలిపివేసి యూరియా తక్షణమే పంపిణీ చేయాలని నినాదాలు చేశారు. సిఐ జివివి రమణ అక్కడకు చేరుకొని రైతులకు సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. రైతులు ఆందోళన విరమించకపోవడంతో గజపతి నగరం ఎడి నిర్మల జ్యోతి అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి రెండురోజుల్లో రైతు సేవా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో యూరియా పంపిణీకి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

భవన నిర్మాణ కార్మికులకు

సంక్షేమ పథకాలు అమలు

- ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ డిమాండ్
- కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడి
- వచ్చే 15లోగా సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం తీవ్రం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిల్డింగ్ వర్కర్స్‌కు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన భవన నిర్మాణ కార్మికులు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా విజయవాడకు తరలివచ్చి కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయాన్ని సోమవారం ముట్టడిం చారు. ఈ సందర్భంగా నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. వచ్చేనెల 15వ తేదీలోగా భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. ముట్టడి కార్యక్రమానికి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రమణరావు అధ్యక్షత వహించారు.

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కేటాయించాల్సిన రూ.3 వేలకోట్లకు పైగా నిధులను ప్రభుత్వాలు.. కార్మికు లకు ఖర్చు చేయకుండా దోచుకుంటున్నాయని తెలిపారు. ఎన్నికల సమయంలో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన ఏ వాగ్దానాన్ని అమలు చేయలేదన్నారు. కరోనా సమయంలో పనుల్లేక కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్న సమ యంలో ఒక్కో కుటుంబానికి కనీసం రూ.10 వేలు అందజేయాలని కోరినా ప్రభుత్వాలు పట్టించుకో లేదని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నెల రోజుల్లోపు కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి తొలిసంతకం హామీని నెరవేర్చాలని కోరగా, 15 నెలలైనా అతీగతీ లేదని చెప్పారు. పరిశ్రమలకు ఇచ్చేందుకు 5 లక్షల ఎకరాలను ఈ ప్రభుత్వం సేకరిస్తుందని, భవన నిర్మాణ కార్మికులకు ఇల్లు కట్టుకోవడానికి 2 సెంట్లు స్థలం ఎక్కడైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ఉండేందుకు, కార్మికుల నమోదు నిలిపివేయడం దుర్మార్గమన్నారు. సంక్షేమ పథకాల అమలును నిలిపివేయాలని గత ప్రభుత్వం తీసుకొచ్చిన మెమో 1,214ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి మాట్లాడుతూ.. కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన ఏ హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. భవన నిర్మాణ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. డిమాండ్ల సాధనకు వారు చేసే ఉద్యమాలకు పూర్తి మద్దతు ప్రకటించారు. ఎపి బిల్డింగ్ అండ్ అదర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్‌వి నర్సింహారావు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో రూ.3,600 కోట్లు నిధులు ఉన్నాయని తెలిపారు. ఈ నిధులను కార్మికుల సంక్షేమానికి వినియోగించకుండా ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో భవన నిర్మాణ కార్మికులకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దుర్మార్గంగా పేర్కొన్నారు. కార్మిక సంక్షేమానికి కేటాయించిన నిధుల్లో 5 శాతం మాత్రమే పరిపాలనా వ్యయానికి వినియోగించాలని.. ఈ నిబంధన ప్రకారం బోర్డులో ఏ ఒక్క ఉద్యోగి జీతం తీసుకోవడానికి అవకాశం లేదన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి వాసంశెట్టి సుభాష్, నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పించినా ఎటువంటి ఫలితం లేదన్నారు. అలాగే ఇతర రాష్ట్రాల నుంచి రాష్ట్రానికి వచ్చి పనిచేసే కార్మికు లను నమోదు చేసుకుని వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కార్మికశాఖ కమిషనర్ కార్యాలయ అధికారికి సమస్య లపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు అనసూయ, కెవి గోపాలరావు, అల్లాడ గోపాల్, ఎం రామాంజి, నరసింహులు, ఎం సుందరబాబు, ఎం సూరిబాబు, పి అప్పారావు, వివిధ జిల్లాలకు చెందిన నాయకులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

నేడు భారత్-అమెరికా వాణిజ్య చర్చలు

న్యూఢిల్లీ : భారత్, అమెరికా అధికారుల మధ్య మంగళవారం ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై (బిటిఎ) తిరిగి చర్చలు ప్రారంభమవుతాయి. చర్చల నిమిత్తం అమెరికా సహాయ వాణిజ్య ప్రతినిధి (దక్షిణ, మధ్య ఆసియా) బ్రెండన్ లించ్ సోమవారం రాత్రి న్యూఢిల్లీ చేరుకున్నారు. చర్చల్లో భారత్ తరపున వాణిజ్య మంత్రిత్వ శాఖలో ప్రత్యేక కార్యదర్శిగా పనిచేస్తున్న రాజేష్ అగర్వాల్ పాల్గొంటారు. రెండు దేశాల మధ్య అనేక నెలలుగా వాణిజ్య చర్చలు జరుగుతున్న విషయం తెలిసిందే.

అతిసారకు జ్వరాలు తోడు

- నమోదవుతున్న కొత్త కేసులు
- వారం అవుతున్నా అదుపులోకి రాని పరిస్థితి



చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి- విజయవాడ

విజయవాడలోని న్యూఆర్ఆర్‌పేటలో అతిసారకు జ్వరాలు తోడయ్యాయి. వైద్య బృందాలు నిర్వహించిన ఇంటింటి సర్వేలో జ్వరాల కేసులు కూడా అధికంగా నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ప్రాంతంలో ఈ నెల 9న డయేరియా ప్రబలింది. అప్పటి నుంచి కొత్త కేసులు నమోదవుతూనే ఉన్నాయి. సోమవారం కొత్తగా ఏడుగురు డయేరియా బారిన పడ్డారు. వారం రోజులు అవుతున్నా వ్యాధి ఇంకా అదుపులోకి రాకపోవడం ఆందోళనకు గురి చేస్తోంది. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డిఎం అండ్ హెచ్‌ఓ) చెప్తున్న వివరాల ప్రకారం... మొత్తం 313 మంది డయేరియా బారిన పడ్డారు. బాధితుల్లో 253 మంది డిశ్చార్జి అయ్యారు. వైద్యశిబిరాల్లో ఇంకా 60 మంది చికిత్స పొందు తున్నారు. వైద్యశిబిరాల్లో అరకొరగా చికిత్స అందించి పంపేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నారా యణ అనే వృద్ధుడు డయేరియాతో ఆదివారం మధ్యాహ్నం కేర్ అండ్ షేర్ వైద్యశిబిరానికి వచ్చారు. చికిత్స అనంతరం అదే రోజు రాత్రి తొమ్మిది గంటలకు డాక్టర్లు ఆయనకు డిశ్చార్జి ఇచ్చేశారు. ఇంటికి వెళ్లిన తర్వాత మళ్లీ వాంతులు, విరోచనాలు ప్రారంభం కావడంతో సోమవారం తెల్లవారుజామున నారాయణ మరలా వైద్యశిబిరానికి చికిత్స కోసం వచ్చారు. తిరువూరుకు చెందిన కార్పెంటర్ ఆర్ నాగేశ్వరరావు న్యూ ఆర్‌ఆర్‌పేటలో ఉంటున్న తన తల్లి లక్ష్మీకాంతం డయేరియా బారిన పడి మృతి చెందడంతో ఇక్కడకు వచ్చారు. ఆయనకు కూడా ఆదివారం రాత్రి నుంచి వాంతులు, విరోచనాలు ప్రారంభం కావడంతో కేర్ అండ్ షేర్ వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్నారు. నాగేశ్వరరావు బంధువు ఆర్ వెంకన్న కూడా తాజాగా డయేరియా బారిన పడ్డారు. వైద్య బృందాలు ఈ నెల పదో తేదీ నుంచి 14వ తేదీ వరకూ నిర్వహించిన ఇంటింటి సర్వేలో డయేరియా కేసులు 146 బయట పడ్డాయి. మరో 104 మంది జ్వరాలతో బాధపడు తున్నట్టు గుర్తించారు. జ్వర బాధితుల్లో చిన్నారులు, వృద్ధులు అధికంగా ఉన్నారు. వీరిలో కొందరు ప్రైవేట్ ఆస్పత్రిని ఆశ్రయించారు. ఇంకొందరు వైద్యశిబిరాలకు వెళ్లారు. మందులు ఇచ్చి పంపేశారని, పూర్తి స్థాయిలో చికిత్స అందించలేదని జ్వర బాధితులు వాపోతున్నారు.

నేటికీ బయటపెట్టని రిపోర్టు...

డయేరియా ప్రబలి వారం రోజులు కావస్తున్నా నేటికీ కారణాలను అధికారులు బయటపెట్టలేదు. 48 గంటల్లోనే రిపోర్టు వస్తుందని తొలుత వైద్యాధికారులు చెప్పారు. డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సుహాసినీని సోమవారం దీనిపై మీడియా ప్రశ్నించగా ఒకసారి వచ్చిన రిపోర్టు నెగిటివ్‌గా ఉందని, రెండవ, మూడవసారి కూడా రిపోర్టులు వస్తాయని, అవి వచ్చిన వెంటనే కారణలు వెల్లడిస్తామని చెప్పడం గమనార్హం.

నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి డయేరియాపై చర్చించాల : సిహెచ్ బాబూరావు

57వ డివిజన్ న్యూ ఆర్ఆర్ పేటలోని ఉచిత వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న అతిసార బాధితులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిసార ప్రబలడానికి కారణాలపై సమగ్ర విచారణ చేయాలని, వ్యాధి పూర్తిగా అదుపులోకి వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, డయేరియాపై చర్చించడానికి నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశాన్ని తక్షణమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అతిసారతో మరణించిన వారి కుటుంబాలకు రూ.పది లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని, డయేరియా బాధితులకు రూ.పది వేలు ఇవ్వాలని, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలని, బాధితుల కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేయాలని కోరారు. ఆయన వెంట సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావు, సిపిఎం నాయకులు చింతల శ్రీనివాస్, ఎంవి రమణ, మోహిద్దీన్ తదితరులు ఉన్నారు.

పామాయిల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా



ధర్నా చేస్తున్న పామాయిల్ కార్మికులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తమ సమస్యలు తక్షణం పరిష్కరించాలని, ఏలూరు కలెక్టరేట్ వద్ద పామాయిల్ కార్మికులు సోమవారం ధర్నా చేశారు. పామాయిల్ తోటల్లో పనిచేస్తూ ప్రమాదవశాత్తూ మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి పామాయిల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో పామాయిల్ కార్మికుల సంఘం ఏలూరు జిల్లా గౌరవాధ్యక్షులు పి.రామకృష్ణ మాట్లాడుతూ ఆగస్టు నుండి డిసెంబర్ వరకు పామాయిల్ తోటల్లో విద్యుద్ఘాతానికి గురై సుమారు 8 మంది కార్మికులు మృతి చెందారని తెలిపారు. మృతుల కుటుంబాలకు విద్యుత్ శాఖాధికారులు రూ.ఐదు లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని, కార్మిక శాఖ ద్వారా పామాయిల్ కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యాల నుండి సబ్సిడీపై గెడలు, కత్తులు, ఇతర పనిముట్లు ఇవ్వాలని కోరారు. ఏలూరు ఎంపి పామాయిల్ కార్మికుల పక్షాన కూడా నిలవాలని, ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. సంఘం జిల్లా కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రమాదాల్లో దీర్ఘకాల వికలాంగులుగా మారిన కార్మికులకు ప్రభుత్వం వికలాంగ సర్టిఫికెట్ ఇచ్చి పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జెసి ధాత్రిరెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఆమె సానుకూలంగా స్పందించి గ్రూప్ ఇన్సూరెన్స్ ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు జె.హరీష్, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆందోళనపై పోలీసుల ఉక్కుపాదం

- కేసులు, నిర్బంధాలకు భయపడకుండా రెండో రోజూ ఆందోళన



మెడకు ఉరితాడుతో నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

ప్రజాశక్తి - నక్కపల్లి (అనకాపల్లి జిల్లా)

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే నిరాహార దీక్షలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. రిలే దీక్షలకు అనుమతి లేదని పోలీసులు ఆంక్షలు విధించి 21 మందిపై కేసు నమోదు చేసినా, ఒకరిని నిర్బంధిం చినా మత్స1్యకారులు వెనక్కి తగ్గకుండా, తమ ఆందోళనను రెండో రోజూ కొనసాగించారు. టెంట్ వేసేందుకు అనుమతి లేదని పోలీసులు అడ్డగించడంతో మత్స్యకారులు టెంటు లేకుండానే బైఠాయించి, మెడకు ఉరితాడు తగిలించుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు.

బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తే తమ ఉనికికే ప్రమాదమని మత్స్యకారులు ఆవేదన వెలిబుచ్చారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ తామంతా శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసు బలగాలు మోహరించి ఆంక్షలు ఎందుకు విధిస్తున్నారని ప్రశ్నించారు. పోలీసుల తీరును వ్యతిరేకిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజును ఉదయం నిర్బంధించారు.

అంధుల మహిళల టి20 ప్రపంచకప్‌నకు

కరుణ కుమారి ఎంపిక



- జాతీయ జట్టుకు ఆడనున్న అల్లూరి జిల్లా కనుమల గిరిజన బాలిక

విశాఖపట్నం: అల్లూరి సీతారామరాజు జిల్లా కనుమల గిరిజన గ్రామానికి చెందిన 15ఏళ్ల పాంగి కరుణ కుమారి(15) అంధుల మహిళల టి20 ప్రపంచకప్‌కు ఎంపికైంది. విశాఖపట్నంలోని ప్రభుత్వ అంధ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న కరుణకు రెండు కళ్లు పూర్తిగా కనబడవు. బి1 కేటగిరీలో జాతీయ జట్టుకు ఎంపికైన కరుణ కుమారి ఇటీవల బెంగళూరులో నిర్వహించిన శిక్షణా శిబిరానికి హాజరై అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి జాతీయ జట్టుకు ఎంపికైంది. జాతీయ జట్టుకు కరుణకుమారి ఎంపికతో ఆమె తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఆమె తండ్రి రాంబాబు మాట్లాడుతూ.. కుమార్తె సాధించిన విజయంగా, ఆమె ప్రతిభకు తగిన గుర్తింపు లభించిదని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ విజయ, సహాయ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు కరుణకు శుభాకాంక్షలు తెలిపారు. భారత మాజీ అంధ క్రికెట్ కెప్టెన్, ప్రస్తుత కోచ్ అజయ్‌కుమార్ రెడ్డి ఆమె ఎంపిక చారిత్రాత్మకమైనదిగా, ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక క్రీడాకారిణి దేశానికి ప్రాతినిధ్యం వహించడం గొప్ప విజయంగా అభివర్ణించారు. ఈ టోర్నమెంట్‌లో బి1 కేటగిరీలో పూర్తిగా అంధులు, బి2లో పరిమిత దృష్టి లోపం గల ఆటగాళ్లు(పాక్షిక అంధులు), బి3లో అవయవ దృష్టి పాక్షికంగా ఉన్న వారు ఆడతారు. బి1 కేటగిరీకి ఎంపికైన కరుణ బంతి శబ్దంతో క్రికెట్ ఆడాల్సి ఉంటుంది. సమర్థనం ట్రస్ట్ ఫర్ ది డిజేబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ ఇండియా(సిఎబిఐ) ఈ టోర్నమెంట్‌ను తొలిసారి నిర్వహిస్తోంది. నవంబర్ 11 నుంచి 25వరకు న్యూఢిల్లీ, బెంగళూరు వేదికలుగా ఈ టోర్నీ జరగనుంది. ఆతిథ్య భారత్‌తోపాటు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, పాకిస్తాన్, శ్రీలంక, నేపాల్, అమెరికా జట్లు పాల్గొంటున్నాయి. మొత్తం 21 లీగ్ మ్యాచ్‌లు, రెండు సెమీస్, ఒక ఫైనల్ మ్యాచ్‌తో షెడ్యూల్‌లో ఇప్పటికే విడుదలైంది.



పోల్‌వాల్ట్‌లో డప్లంటిస్ నయా రికార్డు

టోక్యో: పోల్‌వాల్ట్‌లో డప్లంటిస్ మరోసారి తన రికార్డును తానే అధిగమించాడు. ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా సోమవారం జరిగిన పోల్‌వాల్ట్‌లో డప్లంటిస్ 6.30మీ. ఎగిరి ఈ రికార్డును నెలకొల్పాడు. మూడో ప్రయత్నంలో డప్లంటిస్ ఈ రికార్డు జంప్ చేశాడు. ఫైనల్‌కు అర్హత సాధించిన 12మంది పోల్ట్‌వాల్టర్లలో డప్లంటిస్.. అంతకుముందు 5.90మీ. జంప్ చేసి తన పేర చివరిసారిగా రికార్డును నెలకొల్పాడు. తాజా రికార్డుతో డప్లంటిస్ తన రికార్డును 14వ సారి సవరించుకున్నట్లయ్యింది. గ్రీక్ స్టార్ కరాలిస్ 6.10మీ. ప్రయత్నించి, డప్లంటిస్ 6.20మీ. ప్రయత్నించి విఫలమయ్యారు. ఉసేన్ బోల్ట్, సిమోన్ బైల్స్, మైకెల్ ఫెల్ప్స్ కోవకు చెందిన డప్లంటిస్... ఇటీవల ముగిసిన ఒలింపిక్స్‌లో పతకం సాధించడంలో విఫలమయ్యాడు. అంతకుముందు చివరిసారిగా 2021 ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకంతో మెరిసాడు.

నేపాల్ కేబినెట్‌లోకి మరో ముగ్గురు మంత్రులు

ఖాట్మండు : నేపాల్ ప్రధాని సుశీలా కర్కి నేతృత్వంలోని తాత్కాలిక మంత్రివర్గంలో కొత్తగా ముగ్గురు మంత్రులను చేర్చుకున్నారు. అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌదల్ సోమవారం వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆర్థిక మంత్రిగా రమేషోర్ ఖానల్, ఇంధన శాఖ మంత్రిగా కుల్మాన్ ఘీజింగ్, హోం మంత్రిగా ఓం ప్రకాష్ ఆర్యల్‌లతో ఆదివారం సుశీలా కర్కి కేబినెట్ ఏర్పాటు చేశారు. ఖానల్ ఇప్పటివరకు ఆర్థిక శాఖ కార్యదర్శిగా చేశారు. ఇప్పుడు మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆర్థిక సంస్కరణలపై గత ప్రభుత్వానికి ఆయన 400 పేజీలతో కొన్ని సిఫార్సులను కూడా అందజేశారు.

ఒకప్పుడు నేపాల్‌లో విపరీతంగా వున్న విద్యుత్ కోతలకు అంతం పలికిన ఘనత కుల్మాన్ ఘీజింగ్‌దే. ఎ2016 వరకు నేపాల్ రోజుకు 18గంటల పాటు విద్యుత్ కోత ఎదుర్కొనేది. ఘీజింగ్ వచ్చిన తర్వాత మొదటిసారిగా 24గంటలు విద్యుత్ అందుబాటులోకి వచ్చింది. సుప్రీంకోర్టు న్యాయవాది అయిన ఆర్యల్ అవినీతిపై పోరాడే యోధుడుగా అందరికీ చిరపరిచితుడు. ప్రధాని కర్కికి అత్యంత విశ్వసనీయుడైన ఆర్యల్ పార్లమెంట్ రద్దుపై నెలకొన్న ప్రతిష్టంభనను పరిష్కరించేందుకు జరిగిన చర్చల్లో కీలక పాత్ర పోషించారు.

చట్ట విరుద్ధమైతే రద్దు తప్పదు!

బీహార్ ఎస్ఐఆర్‌పై సుప్రీం హెచ్చరిక

అక్టోబరు 7న తుది వాదనలు

ఆధార్‌ను తక్కువ చేసే ప్రయత్నాలపై ఆగ్రహం



న్యూఢిల్లీ : ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సందర్భంగా భారత ఎన్నికల కమిషన్ చట్టాన్ని పాటిస్తుందని, రాజ్యాంగ పరిధులకు లోబడి వ్యవహరిస్తుందని భావిస్తున్నామని ఒకవేళ చట్టవిరుద్ధంగా ఏదైనా జరిగినట్లు తేలితే మొత్తంగా ఈ ప్రక్రియ అంతా పక్కన పెట్టబడుతుందని సుప్రీంకోర్టు సోమవారం హెచ్చరించింది.

బీహార్ ఎస్ఐఆర్ చెల్లుబాటుపై అక్టోబరు 7న తుది వాదనలు వినాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్య బగ్చిలతో కూడిన బెంచ్ నిర్ణయించింది. ఈ ప్రక్రియపై తాత్కాలికంగా ఎలాంటి అభిప్రాయాలనైనా వెలువరించడానికి తిరస్కరించింది.

ఆధార్ చట్టబద్ధమైన గుర్తింపు పత్రం

ఓటు హక్కు చట్టంలో ఆధార్ ఒక భాగమని సుప్రీం వ్యాఖ్యానించింది. చట్ట ప్రకారం అనుమతించిన మేరకు ఓటర్లు ఆధార్‌ను ఉపయోగించుకోవచ్చని పేర్కొంది. పౌరసత్వాన్ని నిరూపించలేకపోయినప్పటికీ ఆధార్ ఒక చట్టబద్ధమైన గుర్తింపు పత్రంగా మిగిలిపోయిందని స్పష్టం చేసింది. ఇసి ఇచ్చిన జాబితాలోని మిగిలిన 11 పత్రాలతో పోలిస్తే విశిష్ట గుర్తింపు సంఖ్య (ఆధార్)ను తక్కువగా చేసి చూపించడానికి చేస్తున్న ప్రయత్నాలపై ధర్మాసనం పదునైన వ్యాఖ్యలు చేసింది. 'ఆధార్ కన్నా కూడా భూ రికార్డు (11 పత్రాల్లో ఒకటి) మరింత ప్రాముఖ్యమైనదని మీరు చెబుతున్నారా అంటూ జస్టిస్ బాగ్చి పిటిషనర్, అడ్వకేట్ అశ్విని ఉపాధ్యాయను ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్‌కు చట్టం తెలుసునని, పౌరులకు, చొరబాటుదారులకు మధ్య గల తేడాను ఓటర్ల జాబితాలో గుర్తించగలదని జస్టిస్ సూర్యకాంత్ స్పందించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1950లో సెక్షన్ 23(4) కింద ఓటర్ల జాబితాలోకి పేర్లు నమోదు చేసుకోవడానికి ఆధార్‌ను ఉపయోగించుకోవడానికి భారత ఎన్నికల కమిషన్ అనుమతించింది. ఆధార్ కార్డును చెల్లుబాటయ్యే గుర్తింపు కార్డుగా పరిగణించాలంటూ గత విచారణ సందర్భంగా కూడా ఇసిని సుప్రీం ఆదేశించింది. ఆధార్‌ను పౌరసత్వానికి రుజువుగా పరిగణించలేమని మాత్రం స్పష్టం చేసింది. ఒకవేళ ఈ పత్రాలు నిజమైనవేనా? కాదా? అని తెల్చుకోవాలంటే ఇసి వాటిని నిర్ధారించుకోవచ్చని తెలిపింది. సెప్టెంబరు 1 నుండి ఇసి రోజువారీ బులెటిన్లు ఇవ్వడం నిలిపివేసిందని న్యాయవాది శంకర నారాయణన్ తెలిపారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల విచారణ కొనసాగుతోందని ఇసి తరపున న్యాయవాది ద్వివేది తెలిపారు. ఎన్ని క్లెయిమ్‌లు, అభ్యంతరాలు వచ్చాయనే సంఖ్యాపరమైన వివరాలు ఇవ్వడం ఆపివేసి వుండొచ్చునని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కేవలం సుప్రీంకోర్టు ఆదేశాలను మాత్రమే ఇసి పాటిస్తోందని, అంతకుమించి తన స్వంత విధి విధానాలను కూడా పాటించడం లేదని పిటిషనర్ భూషణ్ పేర్కొన్నారు. దీనికి ద్వివేది అభ్యంతరం తెలిపారు.

తొలగించిన లేదా చేర్చిన ప్రతి ఒక్క పేరు, వివరాలను పబ్లిక్ డొమైన్లలో పెట్టాలని భూషణ్ పేర్కొన్నారు. దీనివల్ల వ్యక్తుల గోప్యత దెబ్బతినవచ్చని జస్టిస్ కాంత్ వ్యాఖ్యానించారు. ఇది గోప్యతకు సంబంధించిన అంశం కాదని, ఇసి నిబంధనావళిలో పేర్కొన్న కనీస పారదర్శకత అని భూషణ్ చెప్పారు. అక్టోబరు 1న తుది ఓటర్ల జాబితాను ప్రచురించాల్సి వుందని భూషణ్ అనగా, సుప్రీంకోర్టు విచారణతో సంబంధం లేదని, ఒకవేళ అక్రమాలు వున్నట్లయితే దాన్ని రద్దు చేస్తామని జస్టిస్ కాంత్ చెప్పారు.

మహిళా రాజకీయ కార్యకర్తలను పోష్ చట్టంలో చేర్చలేం : సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు నివారణ చట్టం (పోష్ యాక్ట్-2013) పరిధిలోకి మహిళా రాజకీయ కార్యకర్తలను కూడా చేర్చాలని కోరుతున్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌ను అనుమతిస్తే 'తేనె తుట్ట'ను కదిపినట్లే అవుతుందని వ్యాఖ్యానించింది. ఈ చట్టం కింద 'యజమాని' నిర్వచనం పరిధిలోకి రాజకీయ పార్టీలు వస్తాయని పిటిషనర్, అడ్వకేట్ ఎంజి యోగమాయ తరపున సీనియర్ న్యాయవాదులు శోభా గుప్తా, శ్రీరామ్ పరక్కత్‌లు చేసిన వాదనలను ధర్మాసనం ప్రశ్నించింది. ఇతర వృత్తుల్లోని మహిళలకు అందుబాటులో వున్న రక్షణల నుండి రాజకీయాల్లోని మహిళలను మినహాయించడానికి ఎటువంటి హేతుబద్ధత లేదా స్పష్టమైన అర్థం లేదని పిటిషన్ పేర్కొంది. రాజకీయ వర్గాన్ని కూడా చేర్చేలా 2013 నాటి ఈ చట్టం కింద పని ప్రదేశం, యజమాని నిర్వచనాలను విస్తృతం చేయాలని పిటిషన్ వాదించింది. మహిళా రాజకీయ కార్యకర్తలు, ముఖ్యంగా అట్టడుగు స్థాయిలో ప్రచారాలు, పార్టీ పనుల సమయంలో మహిళలు లైంగిక వేధింపులకు గురవుతున్నారని, వీటికి న్యాయసూత్రాల పరిధిలో తగిన చట్టబద్ధమైన పరిష్కారం లేదని పిటిషన్ పేర్కొంది. "పోష్ చట్టం ప్రకారం పని ప్రదేశాల్లో మహిళల రక్షణ కోసం అనుసరించాల్సిన విధి విధానాలను రాజకీయ పార్టీలు కూడా అనుసరించాల్సిందే" అని కోర్టు డిక్లరేషన్ ఇవ్వాలని పిటిషన్ కోరింది. మహిళా రాజకీయ కార్యకర్తలపై లైంగిక వేధింపులకు వ్యతిరకంగా ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని పిటిషన్ కోరింది.

డిఎస్‌సిలో 15,941 మంది ఎంపిక

(మొదటిపేజి తరువాయి)

ఇస్తామని చెప్పారు. హారిజాంటల్ రిజర్వేషన్ తొలిసారి అమలు చేశామన్నారు. దీనిపై అనుమానాలుంటే జిల్లా విద్యాశాఖ అధికారుల కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఖాళీలను ప్రతియేటా డిఎస్‌సి నిర్వహిస్తామని, విద్యాశాఖ మంత్రి సైతం ఈ విషయాన్ని ప్రకటించారని తెలిపారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు త్వరలో స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పారు. నవంబర్‌లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఉంటుందని, అభ్యర్థులు దీనికి సిద్ధం కావాలని చెప్పారు.

ప్రతియేటా డిఎస్‌సి : లోకేష్

డిఎస్‌సి తుది ఎంపిక జాబితాకు ఎంపికైన అభ్యర్థులకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం ద్వారా అభినందనలు తెలిపారు. ఈ అవకాశం అందుకోలేకపోయిన వారు నిరుత్సాహపడొద్దని, ఇచ్చిన హామీ ప్రకారం ఇకపై ఏటా డిఎస్‌సి నిర్వహిస్తామని ఒక ప్రకటన ద్వారా తెలిపారు. పట్టుదలతో సిద్ధమవుతూ ఉండాలని, అవకాశం తప్పకుండా వస్తుందని పేర్కొన్నారు. నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులను ఆత్మీయంగా ఆహ్వానించి, వారికి మార్గనిర్దేశం చేయాలని ఉపాధ్యాయ వర్గానికి పిలుపునిచ్చారు.

'వక్ఫ్' కీలక సెక్షన్ల నిలిపివేత

(మొదటిపేజి తరువాయి)

ప్రభావితం కావు

మొత్తంగా చట్టంపై స్టే విధించలేం : సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

1923 నుంచి వక్ఫ్ చట్టాల చరిత్రను పరిశీలించామని, మొత్తంగా చట్టాన్ని నిలిపివేయడానికి తగిన ఆధారాలు లేవని, అందువల్ల మొత్తంగా చట్టంపై స్టే విధించలేమని చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్ తెలిపారు. చట్టసభలు ఆమోదించిన చట్టం రాజ్యాంగబద్ధమనే భావనతోనే అత్యున్నత న్యాయస్థానం ఎల్లప్పుడూ వ్యవహరిస్తుందని, అత్యంత అరుదైన సందర్భాల్లో మాత్రమే సవాలు చేయబడిన చట్టం అమలుపై స్టే విధించాల్సి వస్తుందని గవాయ్ నేతృత్వంలోని బెంచ్ వ్యాఖ్యానించింది. అంతిమంగా, వక్ఫ్ సవరణ చట్టం-2025 మొత్తంగారి చెల్లుబాటు అవుతుంది. కానీ కొన్ని నిబంధనలకు చేసిన నిర్దిష్ట సవరణలపై స్టే విధించింది. కేంద్రం తీసుకువచ్చిన వక్ఫ్ (సవరణ) చట్టం-2025 అమలును పూర్తిగా నిలిపివేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో దాదాపు వందకు పైగా పిటిషన్లు దాఖలయ్యాయి. ముస్లిముల ఆస్తులను లాగేసుకోవడానికే ఈ సవరణలు ఉద్దేశించబడ్డాయంటూ ఆ పిటిషన్లు ఆరోపించాయి. వక్ఫ్ ఆస్తులు ఆక్రమణలకు గురికాకుండా వుండేందుకే ఈ చర్యలని కేంద్రం వాదిస్తోంది.

యుటిఎఫ్ 'రణభేరి'

(మొదటిపేజి తరువాయి)

నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి కాశీబుగ్గ స్టేషన్‌కు తరలించారు. పోలీసుల తీరును నిరసిస్తూ యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు నినాదాలు చేశారు. రెండు గంటల పాటు స్టేషన్‌లో నిర్బంధించి అనంతరం వారిని సొంత పూచీకత్తుపై పోలీసులు విడుదల చేశారు. ఆ తర్వాత జాతా కొనసాగింది. చిత్తూరు జిల్లా పలమనేరులో జాతాను మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగంలో చేసిన ప్రయోగాల దుష్పరిణామాలను సరిదిద్దాలని ఈ ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. పైగా, నూతన విద్యా విధానం పేరుతో పాఠశాలలను పునర్ వ్యవస్థీకరణ చేసిందని, దీంతో, తొమ్మిది రకాలైన పాఠశాలలు ఆవిర్భవించాయని వివరించారు. కొన్ని ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయని, మూడు లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు మళ్లిపోయారని తెలిపారు. కర్నూలులో జాతాను జెండా ఊపి యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వానికి విద్యా రంగం పట్ల చిన్నచూపు తగదన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలో జాతాను మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు, ప్రభుత్వోద్యోగులకు నాలుగు డిఎలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ దసరాకి కనీసం రెండు డిఎలు ఇవ్వాలని, పిఆర్‌సి నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని, రిటైర్ ఉద్యోగులకు గత అక్టోబర్ నుంచి బకాయి ఉన్న గ్రాట్యూటీని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎఎన్ కుసుమ కుమారి, రాష్ట్ర కార్యదర్శులు ఎస్‌పి మనోహర్ కుమార్, కె.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో పర్యటించే రణభేరి జాతాను తునిలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు జి.సత్యనారాయణమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పట్టించుకోకపోవడం వల్లనే తాము అధికారంలోకి వచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకుంటున్నారన్నారు. కానీ, అధికారం చేపట్టి ఏడాదిన్నరైనా నేటికీ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించలేదని తెలిపారు. సుమారు రూ.20 వేల కోట్లను ఉపాధ్యాయ, ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. ఈ యాత్రలో ఉపాధ్యాయులు తెలిపిన సమస్యలను డాక్యుమెంట్ రూపంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, శాసనమండలి సమావేశాల్లో ప్రస్తావిస్తానని తెలిపారు. ఎస్‌టిఎఫ్ఐ జాతీయ కార్యదర్శి కె.అరుణకుమారి మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 25న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు.





సదస్సులో మాట్లాడుతున్న ఇర్ఫాన్ హబీబ్

ప్రజాస్వామ్యం, సోషలిజం కోసం

ఏచూరి బలమైన పోరాటాలు

- ప్రజా పోరాటాలను ముందుకు తీసుకెళ్లడమే ఘనమైన నివాళి
- ప్రముఖ చరిత్రకారుడు ప్రొఫెసర్ ఇర్ఫాన్ హబీబ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజాస్వామ్యం, సోషలిజం కోసం సీతారాం ఏచూరి బలమైన పోరాటాలు చేశారని ప్రముఖ చరిత్రకారుడు ప్రొఫెసర్ ఇర్ఫాన్ హబీబ్ తెలిపారు. ప్రజా పోరాటాలను ముందుకు తీసుకెళ్లడమే ఏచూరికి ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. సోమవారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో సీతారాం ఏచూరి మొదటి స్మారక ఉపన్యాసంలో 'జాతీయ ఉద్యమంలో వామపక్షాల పాత్ర, వారసత్వం' అనే అంశంపై ప్రొఫెసర్ ఇర్ఫాన్ హబీబ్ మాట్లాడారు. ఏచూరి జీవితాంతం సోషలిజం, ప్రజాస్వామ్యాన్ని సమర్థించారని అన్నారు. సోషలిజం, ప్రజాస్వామ్యం మధ్య బొడ్డు పేగు సంబంధం ఉందని, ఒకదానిని లేకుండా మరొకటి ఆలోచించలేమని అన్నారు. నియంతృత్వంతో సోషలిజం అమలు చేయబడదని, సోషలిజం వాస్తవికతగా మారాలంటే, పూర్తి ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని పేర్కొన్నారు. ఏచూరి దాని కోసమే పోరాటాలు చేశారని తెలిపారు. ఏచూరితో ఉన్న సన్నిహిత వ్యక్తిగత సంబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. ఆ సంబంధం విభేదాల కంటే ఒప్పందాలతోనే ముందుకు సాగిందన్నారు.

బ్రిటీష్ సామ్రాజ్యవాదం ఇండియాపై చూపిన ప్రభావాలను దేశ కమ్యూనిస్టు నాయకులు ప్రారంభం నుండి విమర్శించారని అన్నారు. 1840లో బ్రిటీష్ సామ్రాజ్యవాదం భారతదేశాన్ని ఎలా దోపిడీ చేసిందో కార్ల్‌మార్క్స్ తీవ్రంగా పరిశోధించారని పేర్కొన్నారు. మార్క్స్ నుండి ప్రేరణ పొంది, భారతదేశ కమ్యూనిస్ట్ నాయకులు వలసవాదం పరిణామాలను అధ్యయనం చేశారన్నారు. వలసవాదానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ దృఢ వైఖరికి ఇటువంటి పరిశోధనలే ఆధారమని ఇర్ఫాన్ హబీబ్ వివరించారు.

ఏచూరి జీవిత సందేశాన్ని ప్రజలకు తెలియజేసేందుకు వేదిక

ఏచూరి జీవిత సందేశాన్ని ప్రజలకు తెలియజేయడానికి పార్టీ ఆధ్వర్యాన శాశ్వత యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తామని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ తెలిపారు. ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ అధ్యక్షతన ఒక కమిటీ ఏర్పాటు చేస్తున్నామని, మొదటి అడుగుగా, ఆసియాలో కమ్యూనిస్టు, కార్మిక ఉద్యమాల చరిత్రను వివరించే డిజిటల్ ఆర్కైవ్‌ను రూపొందిస్తామని వెల్లడించారు. దేశవ్యాప్తంగా సెమినార్లు, చర్చలు నిర్వహిస్తామని ఎంఎ బేబీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నేత ప్రకాశ్ కరత్, పొలిట్‌బ్యూరో సభ్యులు యు వాసుకి, ఆర్ అరుణ్‌కుమార్, ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ పాల్గొన్నారు.

సుదీర్ఘ విరామం తరువాత 94 ఏళ్ల ప్రొఫెసర్ ఇర్ఫాన్ హబీబ్ బహిరంగ వేదికపైకి వస్తున్నారని తెలుసుకుని ఆయన మాటలను వినడానికి, ఏచూరి జ్ఞాపకాలను తిరిగి గుర్తుచేసుకోవడానికి వందలాది మంది హరికిషన్ భవన్‌కు చేరుకున్నారు. ఏచూరి కుటుంబ సభ్యులు, నటి షర్మిలా ఠాగూర్, తదితరులు హాజరయ్యారు.

జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్

- మావోయిస్టు అగ్రనేత సహదేవ్ సహా మరో ఇద్దరు మృతి
- సహదేవ్‌పై రూ.1 కోటి రివార్డు

హజారీబాగ్ : జార్ఖండ్‌లోని హజారీబాగ్ జిల్లా గోర్హార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాటి పిరి అడవి కాల్పులతో దద్దరిల్లింది. భద్రతాబలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, రూ. కోటి రివార్డు ఉన్న సహదేవ్ సోరెన్ అలియాస్ పర్వేష్‌సహా ముగ్గురు మరణించారు. బీహార్-జార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు, రూ.25 లక్షల రివార్డు ఉన్న రఘునాథ్ హెంబ్రామ్, ప్రాంతీయ కమిటీ సభ్యుడు , రూ 10 లక్షల రివార్డు ఉన్న బిర్సెన్ గంజు అలియాస్ రాంఖేలావన్ మృతుల్లో ఉన్నారు. ఘటనా స్థలం నుంచి ఏకే-47 వంటి ప్రాణాంతక ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

209 కోబ్రా బెటాలియన్ , హజారీబాగ్ పోలీసుల సంయుక్త బృందం జత కలిసి ఆపరేషన్ నిర్వహించాయి. ఎదురుకాల్పుల తర్వాత.. పరిసరాల్లో మిగతా మావోయిస్టులను వెతకడానికి వీలుగా మొత్తం ప్రాంతంలో ఇంటెన్సివ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఆపరేషన్ విజయవంతమైందని హజారీబాగ్ ఎస్పీ అంజని అంజన్ ధ్రువీకరించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు.. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లలో 244 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల గరియాబంద్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ కేంద్ర కమిటీ సభ్యుడు మోడెం బాలకృష్ణతో సహా 10 మంది మావోయిస్టు అగ్రనేతలు మరణించారు.

దేశవ్యాప్తంగా ఎరువుల కష్టాలు

- మధ్యప్రదేశ్‌లో ముగ్గురు రైతులకు గాయాలు
- ఒడిశాలో ఆందోళనలు, రోడ్ల దిగ్బంధం

న్యూఢిల్లీ : ప్రస్తుతం పొలంలో పంట కోసం శ్రమించాల్సిన రైతన్న ఎరువులు అందక అగచాట్లు పడుతున్నాడు. తెల్లవారుజాము నుంచే పంపిణీ కేంద్రాల వద్ద క్యూలైన్లలో నిలుచుంటున్నా.. అవి అందుతాయో లేదో అని ఆందోళన చెందుతున్నాడు. బిజెపి పాలిత రాష్ట్రాలుసహా దేశమంతటా ఇదే పరిస్థితి నెలకొంది. సోమవారం మధ్యప్రదేశ్‌లో ఒక ఎరువుల పంపిణీ కేంద్రం వద్ద జరిగిన తోపులాటల్లో ముగ్గురు రైతులు గాయపడ్డారు. మొరెనా జిల్లా కేంద్రంలో సోమవారం ఈ ఘటన జరిగింది. పట్టణంలోని ధాన్యం మార్కెట్ ప్రాంగణంలో ఉన్న ఎరువుల పంపిణీ కేంద్రం వద్ద తెల్లవారుజాము నుంచే క్యూలో నిలబడి ఉన్నారు. ఉదయం 9:30 గంటలకు కౌంటర్ తెరవడంతో తోపులాట ప్రారంభమైంది. రైతులు ఒకరితో ఒకరు ఘర్షణ పడ్డారు. సమాచారం తెలిసిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. గాయపడిన ముగ్గురినీ ఆసుపత్రికి తరలించారు. ఇందులో ఇద్దరిని వెంటనే డిశ్చార్జ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటనపై రాష్ట్రంలోని ప్రతిపక్ష నాయకుడు ఉమాంగ్ సింఘర్ తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వం ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తోందని, అందువల్లే రైతులు క్యూ లైన్లలో కష్టాలను, లాఠీఛార్జిని ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. ఈ నెల 8న భిండ్‌లోని ప్రహత్కార్ సహకారి సంస్థ వద్ద, ఈ నెల 2న రేవాలోని కరాహియా మండి వద్ద రైతులపై పోలీసులు లాఠీఛార్జీ చేశారని ఆయన గుర్తు చేశారు.



ఒడిశాలో రాస్తారోకో చేస్తున్న రైతులు

ఒడిశాలో..

ఎరువుల కొరతతో ఒడిశాలోని గంజాం జిల్లాలో రైతులు ఆందోళనకు దిగారు. రోడ్లను దిగ్బంధించారు. జిల్లాలోని దిగపహండి గ్రామంలోని సిద్ధేశ్వర్ కోపరేటివ్ సొసైటీ వద్ద సోమవారం ఉదయం నుంచే వందలాది రైతులు క్యూలో ఉన్నారు. ఎంతసేపటికీ ఎరువులను పంపిణీ చేయకపోవడంతో దిగపహండి - బెర్హాంపూర్ రోడ్డును దిగ్బంధించారు. రాష్ట్ర హైవే 17పై ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. దిగపహండిలో మాత్రమే కాకుండా సనఖేముండి, హటపడా వద్ద కూడా రైతులు ఎరువులు కోసం ఆందోళనలకు దిగారు. కొరాపుట్ జిల్లాలోని నారాయణపట్న వద్ద కూడా రైతులు నిరసనలకు దిగారు. రెండు రోజుల నుంచి తిండి, కనీసం నీరు కూడా లేకుండా క్యూ లైన్లలో ఎదురుచూస్తున్నామని, ఒక్క బస్తా ఎరువు కూడా ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి వరకూ కూడా ఈ ఆందోళనలు కొనసాగాయి. పోలీసులు, రెవిన్యూ అధికారులు రైతులతో చర్చలు జరుపుతున్నారు.

దాడులపై ఇజ్రాయిల్‌ను జవాబుదారీ చేయాల్సిందే

- అంతర్జాతీయ సమాజానికి ఖతార్ ప్రధాని విజ్ఞప్తి
- నేడు మానవ హక్కుల మండలిలో చర్చ
- నెతన్యాహు జాగ్రత్తగా ఉండాలంటూ అమెరికా సుద్దులు

జెనీవా : హమాస్ నేతలను మట్టుబెట్టే లక్ష్యంతో ఖతార్‌పై ఇజ్రాయిల్ దాడులకు పాల్పడిన ఘటనపై మంగళవారం చర్చ జరపనున్నట్లు ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి తెలిపింది. ఇజ్రాయిల్ దాడిపై అత్యవసరంగా చర్చ జరగాలంటూ అధికారికంగా రెండు అభ్యర్థనలు వచ్చాయని, ఆ మేరకే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు కౌన్సిల్ సోమవారం తెలిపింది. ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్ (ఓఐసి) సభ్య దేశాల తరపున పాకిస్తాన్ నుండి ఒక అభ్యర్థన రాగా, గల్ఫ్ అరబ్ దేశాల సహకార మండలి తరపున కువైట్ నుండి మరో అభ్యర్థన వచ్చిందని మండలి తెలిపింది. 2006లో మండలి ఏర్పడిన తర్వాత అత్యవసరంగా చర్చలు జరిపిన వాటిల్లో ఇది పదవదని కౌన్సిల్ తెలిపింది. ఖతార్‌పై దాడులకు అంతర్జాతీయంగా తీవ్ర ఖండనలు వెల్లువెత్తాయి.

నెతన్యాహూ జాగ్రత్తగా వుండాలన్న అమెరికా మంత్రి

ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుతో ఖతార్‌పై దాడుల విషయాన్ని చర్చించేందుకు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భేటీ అయ్యారు. ఖతార్‌పై దాడుల వల్ల గాజాలో కాల్పుల విరమణ చర్చలు పక్క దారిపట్టే అవకాశం వుందని అమెరికా ఆందోళనలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం జరుగుతోంది. ఆదివారం ట్రంప్, కతార్‌కు మద్దతును ప్రకటించారు. ఖతార్ మాకు మంచి మిత్రపక్షం. ఇజ్రాయిల్‌తో సహా ఎవరైనా సరే జాగ్రత్తగా వుండాల్సిందే, ప్రజలపై దాడి చేసేటప్పుడు మరింత అప్రమత్తత అవసరమని ట్రంప్ విలేకర్లతో వ్యాఖ్యానించారు. ఖతార్‌పై దాడులకు ముందు అమెరికాకు తెలియజేశామని ఇజ్రాయిల్ ఇప్పటికే ప్రకటించడం గమనార్హం.

ద్వంద్వ ప్రమాణాలు తిరస్కరించండి : ఖతార్ ప్రధాని విజ్ఞప్తి

ద్వంద్వ ప్రమాణాలను పాటించడాన్ని తిరస్కరించి, ఇజ్రాయిల్‌ను తాను పాల్పడిన నేరాలకు జవాబుదారీ చేయాలని ఖతార్ ప్రధాని షేక్ మహ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ జాసిమ్ అల్ తాని అంతర్జాతీయ సమాజాన్ని కోరారు. దోహాలో ఇజ్రాయిల్ అనూహ్యంగా జరిపిన దాడులపై చర్చించేందుకు అత్యవసరంగా ఏర్పాటుచేసిన అరబ్-ఇస్లామిక్ సదస్సుకు ముందస్తు మంత్రిత్వస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఈ దాడిలో ఖతార్ సెక్యూరిటీ ఆఫీసర్‌తో సహా ఐదుగురు హమాస్ నేతలు మరణించారు. గల్ఫ్ దేశాల మధ్య ఐక్యతను ప్రదర్శించేలా సోమవారం అరబ్, ఇస్లామిక్ నేతలు అత్యవసరంగా సమావేశమయ్యారు.

తద్వారా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి పెంచాలని భావిస్తున్నారు. గాజాలో పాలస్తీనా జాతిని అంతం చేయాలన్న ఇజ్రాయిల్ లక్ష్యం నెరవేరదని ఖతార్ ప్రధాని స్పష్టం చేశారు. ఇజ్రాయిల్‌ను ఇంతలా ప్రోత్సహిస్తున్నది ఏమిటనుకుంటున్నారు? మౌనం, నిష్క్రియాపరత్వం అదే ఇంతవరకు తెచ్చింది, ఇకపై ఇటువంటివి సాగబోవని, చేసిన నేరాలకు శిక్ష అనుభవించాల్సిందేనని ఇజ్రాయిల్‌కు స్పష్టం చేయాల్సిందేనని ప్రధాని పేర్కొన్నారు.

పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలుకు తక్షణ చర్యలు

(మొదటిపేజి తరువాయి)

కొత్త సర్వే చేపట్టాలి' అని డిమాండ్ చేసింది.

1. దశలతో నిమిత్తం లేకుండా ప్రభావితమైన వారందరికీ ఒకే దశలో (45.75 మీటర్లు) పూర్తి పునరావాసం కల్పించాలి. భూమికి బదులు భూమి, ఇంటి నిర్మాణం, పూర్తి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించాలి. 2025 జులై నాటికి లేదా స్థానభ్రంశం ప్రారంభమైనప్పుడు 18 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తికి ప్యాకేజీ ఇవ్వాలి. గతంలో అమలు చేసిన పునరావాసంలో మినహాయించిన వివాహిత కుమార్తెలను కూడా చేర్చాలి.

2. అధికారిక గణాంకాల ప్రకారం మొదటి దశ కిందకు వచ్చే 38,060 కుటుంబాల్లో 12,658 కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించారు. మొత్తం ప్రభావిత కుటుంబాలు 1,06,000. కేంద్ర ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి రూ.33 వేలకోట్లు అందించాలి. కానీ, ఇప్పటి వరకు రూ.5,900 కోట్లు మాత్రమే తిరిగి చెల్లించారు. అందువల్ల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి ప్రాధాన్యతా ప్రాతిపదికన పూర్తి మొత్తాన్ని అందించాలని మేము మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాము.

3. మునిగిపోయిన గ్రామాలను గుర్తించడంలో తీవ్రమైన లోపాలు/వ్యత్యాసాలు జరిగాయి. ఒకే గ్రామంలో రోడ్డు ఒకవైపు మునిగిపోయినట్లు ప్రకటించారు. మరొక వైపు మునిగిపోలేదని పేర్కొన్నారు. కొన్ని ఇళ్లకు పరిహారం అందగా, మరికొన్నింటికి అందలేదు. దీన్ని సరిచేయాలి. ఉదాహరణకు విఆర్ పురం మండలంలోని రామవరం, చింతూరు మండలంలోని ముక్కునూరు.

4. గత రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా భూమికి పరిహారం ఎకరాకు రూ.26.5 లక్షలు ఇవ్వాలి. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున అమలు చేయాలి. భూమికి భూమి పరిహారం విషయంలో సారవంతమైన, సాగు భూమిని కేటాయించాలి. సేకరించే భూమికి ఎకరాకు రూ.20 లక్షలు మంజూరు చేయాలి.

5. పునరావాస కాలనీల్లో కనీస ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలి. వీటిలో రక్షిత తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, వీధి దీపాలు, మరుగుదొడ్లు, రేషన్ దుకాణాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, రవాణా, శ్మశాన వాటికలు, అవసరమైన అన్ని ఇతర సౌకర్యాలు ఉండాలి.

6. మొదటి దశలో నిర్మించబోయే 75 కాలనీల్లో 26 కాలనీలు మాత్రమే పూర్తయ్యాయి. నిర్మించిన ఇళ్లు లీక్ అవుతున్నాయి. దీనికి పరిహారం చెల్లించాలి. బాధ్యులైన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి.

7. పునరావాస కాలనీలు, భూమికి భూమి పరిహారం కోసం 1/70 చట్టాన్ని ఉల్లంఘించి గిరిజన ఎల్‌టిఆర్ భూములను సేకరిస్తున్నారు. బదులుగా గిరిజనేతర భూ యజమానుల నుంచి భూమిని సేకరించాలి. గతంలో సేకరించిన భూములను చట్టవిరుద్ధంగా కొందరు లీజుకు ఇచ్చారు. భూస్వాములు, ఉన్నత స్థాయి ప్రజా ప్రతినిధులు, అధికారులు అనుభవిస్తున్నారు. ఈ అవినీతిని ఆపాలి. ఇందులో పాల్గొన్న అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి. కొత్త భూ సేకరణలో అవినీతిని నిరోధించాలి. గ్రామసభ/పెసా సమావేశం తరువాత మాత్రమే భూ సేకరణ జరగాలి. 'అటవీ హక్కుల చట్టం కింద 'పోడు భూముల'కు పట్టాలు జారీ చేశారు. అయితే, పట్టాదారులకు పరిహారం ఇవ్వలేదు. వారి భూములు అటవీ భూములని వారికి చెబుతున్నారు. కానీ వాస్తవానికి ఈ భూములు చట్టబద్ధంగా గిరిజనుల యాజమాన్యంలో ఉన్నాయి. వీటికి అటవీ హక్కుల చట్టం కింద పట్టాలు జారీ చేయబడ్డాయి. దాని అమలులో చట్టం స్ఫూర్తిని ఉల్లంఘిస్తున్నారు. చట్టం దాని నిజమైన ఉద్దేశంతో అమలు చేయాలి. చట్టాన్ని అగౌరవపరిచే, గిరిజనులను వేధించే అధికారులపై చర్యలు తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు.

జీవన సారథం

కెరటాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. లేచి పడుతున్నందుకు కాదు.. పడినా లేస్తున్నందుకు..


మీ కోసం

బెండకాయ వేపుడు చేసేటప్పుడు, అర చెక్క నిమ్మకాయ రసం వేస్తే ముక్కలు అతుక్కోకుండా ఉంటాయి. కూర కూడా రుచిగా ఉంటుంది.



JEEVANA జీవన the family

చదువు పట్ల అశ్రద్ధ



లక్ష్మీదేవిపల్లిలో చదువుతున్న విద్యార్థులకు చదువు మీద శ్రద్ధ లేదు. వారిలో మార్పు తప్పనిసరిగా తీసుకురావాలని కొత్తగా వచ్చిన టీచర్లు పిల్లలను మార్చడానికి ప్రణాళిక వేసుకున్నారు. మొదట, వారు పిల్లలతో కఠినంగా వ్యవహరించకుండా, వారి ప్రపంచంలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు.

ఒక రోజు, టీచర్లు గణితం నేర్పించడానికి క్రికెట్ స్కోర్లు, పరుగులను లెక్కించడం మొదలుపెట్టారు. తెలుగు అక్షరాలు నేర్పించడానికి ఆట స్థలంలోనే ఇసుక మీద అక్షరాలను దిద్దించడం, పాటల రూపంలో వాటిని నేర్చుకోవడం వంటివి చేశారు.

పిల్లలు ఆశ్చర్యపోయారు. ఎప్పుడూ పుస్తకాలతో, హెూంవర్క్‌తో ఉండే పాఠశాల, ఇప్పుడు ఆటల మైదానంలా మారిపోయింది. చదువు ఒక భారంలా కాకుండా, ఒక సరదా కార్యక్రమంలా అనిపించింది. టీచర్లు వారి ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించారు. ఒక్కో విద్యార్థిలో ఉన్న ప్రత్యేకమైన నైపుణ్యాలను బయటకు తీసి, దానిని బట్టి వారికి ప్రేరణ కలిగించారు.

క్రమంగా పిల్లలలో మార్పు మొదలైంది. ఆటలతో పాటు చదువు కూడా ముఖ్యమని వారు గ్రహించారు. కేవలం క్లాసులో మాత్రమే కాకుండా, ఇంటి దగ్గర కూడా చదువు మీద దృష్టి పెట్టడం మొదలుపెట్టారు. టీచర్ల కొత్త ఆలోచనలు, ప్రేమతో కూడిన బోధన వల్ల పిల్లలు కేవలం మంచి మార్కులే కాకుండా, మంచి విలువలను కూడా నేర్చుకున్నారు. ఆ పాఠశాల, ఒకప్పుడు చదువు అంటే భయపడిన పిల్లలతో, ఇప్పుడు.. సంతోషంగా చదువుకునే విద్యార్థులతో నిండిపోయింది.

- యాడవరం చంద్రకాంత్ గౌడ్, 94417 62105

మన పయనం


గణ,గణ గంటలు మ్రోగే బండి,
గల,గల గజ్జెల సవ్వడి బండి,
జోరుగ సాగే మన ఎడ్ల బండి,
పల్లె వాసులు పయనించే బండి,
పట్టణ సరుకులు తెచ్చేదండి!
తెలుగుదనాల వెలిగే బండి!
ఛుకు!ఛుకు! మంటూ వచ్చే బండి,
పట్టాలపై పరుగుల రైలుబండి,



పట్నం బస్తీలు తిరిగే బండి,
పిన్నలు పెద్దలు మెచ్చే బండి,
ఆకాశంలో విహరించే విమానము
విశాఖ, ఢిల్లీ, నగర ప్రయాణము,
అమెరికా,రష్యా విదేశ పయనం
విశ్వ వెలుగుల మన విమానయానం
విశ్వ విజ్ఞానం మనదేనండి!

- బెహరా ఉమామహేశ్వర రావు, 92900 61336.

నేను గీసిన బొమ్మ






ఆదర్శ్ ప్రీతమ్, భాష్యం స్కూల్, ఎమ్మిగనూరు, కర్నూలు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కల సాకారమైన వేళ...

సమాజంలో గౌరవం..బాధ్యతాయుతమైన వృత్తి.. ఎందరో పిల్లలను ఉత్తములుగా తీర్చేదిద్దే అవకాశం ఉన్నది ఉపాధ్యాయ వృత్తిలోనే. అలాంటి ఉపాధ్యాయ వృత్తిలో స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఎ), సెకండ్ గ్రేడ్ టీచర్ (ఎస్‌జిటి), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టిజిటి), పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పిజిటి)లతోపాటు వ్యాయామామోపాధ్యాయ పోస్టుల్లోకి త్వరలో కొత్త అభ్యర్థులు రాబోతున్నారు. ఈనెల 19న నియామక ఆర్డర్లు అందుకోబోతున్న వీరంతా దసరా సెలవుల తర్వాత అక్టోబర్‌లో విధుల్లో కూడా చేరబోతున్నారు. ఈ నేపథ్యంలో వారిలో కొందరి మనోగతాన్ని తెలుసుకుందాం.





రాష్ట్రప్రభుత్వం ద్వారా పాఠశాల విద్యాశాఖ మెగా డీఎస్సీ-2025 అభ్యర్థుల తుది ఎంపిక జాబితాను సోమవారం విడుదల చేయటంతో ఎంపికైన అభ్యర్థుల్లో సంతోషం వెల్లివిరిసింది. వీరంతా రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖల పరిధిలోని ఉపాధ్యాయ ఖాళీలతో పాటు గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ, మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, మోడల్, రెసిడెన్షియల్, విభిన్నప్రతిభావంతులు, జువెనైల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలోని మొత్తం 16,347 పోస్టులకుగాను 15,941 పోస్టుల్లో వీరంతా ఉపాధ్యాయులుగా చేరబోతున్నారు. వీరిలో 7955 మంది మహిళలు, 7986 మంది పురుషులు ఉన్నారు. ఈనెల 19న సిఎం నారా చంద్రబాబునాయుడు నుంచి కొందరు నియామక పత్రాలను పొందనున్నారు. అక్టోబర్ నెల నుంచి విధులకు హాజరుఅయ్యే అవకాశం ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని కొత్త ఉపాధ్యాయులు సంతోషాన్ని వ్యక్తంచేస్తున్నారు.

అభ్యర్థుల్లో ఆనందం

ఎంపికైన అభ్యర్థుల్లో వివాహితులు.. అవివాహితులు కూడా ఉన్నారు. వీరంతా గత మూడు నెలలుగా ఉన్న ఉత్కంఠతకు సోమవారం తుది జాబితాతో ఆనందం వెల్లివిరిసింది. కొందరు నాలుగు పోస్టులకు పరీక్షగా అన్నింటిలోనూ ఉత్తీర్ణత సాధించటంతోపాటుగా అర్హత సాధించిన వారు ఉన్నారు. మరికొందరు రెండు, మూడు పోస్టులకు ఎంపికయ్యారు. కొందరు స్కూల్ అసిస్టెంట్‌కు మొగ్గుచూపగా మరికొందరు టిజిటి, పిజిటి పోస్టులను ఎంపిక చేసుకున్నారు. తుది జాబితాల్లో తమ పేర్లు ఉన్నాయన్న సంతోషంతో సంబరాలు చేసుకున్న వారు మరికొందరు ఉన్నారు. కన్నబిడ్డలను ఇంట్లో తల్లిదండ్రులు, అత్తమామల వద్ద ఉంచి కోచింగ్ తీసుకున్న తల్లుల సంతోషం పట్టరాని విధంగా ఉంది.

పెళ్లి చేసుకోవాల్సిన వారు, పెళ్లయిన వారు ఇలా ఉద్యోగం పొందిన ఆనందంలో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. తిండి ఉన్నా లేకున్నా.. ఉద్యోగం సాధించటమే లక్ష్యంగా ఎన్నో కష్టనష్టాలకు ఓర్చినవారు కూడా ఉన్నారు. కర్నూలు, విజయవాడ, అవనిగడ్డ, విశాఖపట్టణం ఇలా పలు ముఖ్యపట్టణాల్లో వివిధ ప్రాంతాలకు చెందిన వారు వెళ్లి శిక్షణ పొందారు. ఉద్యోగం పొందిన సంతోషంలో వారున్నారు.

మా నాన్న కల నెరవేర్చాం...

మాది రేపల్లె మండలంలోని మోళ్లగుంట గ్రామం. నాన్న కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, కృష్ణకుమారిలు మమ్మల్ని ఎంతో కష్టపడి చదివించారు. మేము గత కొన్ని సంవత్సరాలుగా డిఎస్సీలో ఉపాధ్యాయ పోస్టు సాధించాలని కృషిచేస్తున్నాం. నిరంతర శ్రమ, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ డిఎస్సీలో 82.47, 83.21 మార్కులతో మంచి ర్యాంక్ సాధించాం. తుది జాబితాలో మా పేర్లు చూసుకుని ఎంతో సంతోషించాం. మా నాన్న శ్రీనివాసరావు బీమా కంపెనీలో ఏజెంటు. మమ్మల్ని ఉపాధ్యాయులుగా చూడాలన్నిది ఆయన కల. దానిని నెరవేర్చటానికి మేము బాగా శ్రమించి విజయం సాధించాం. తల్లిదండ్రులు ఎంతో సంతోషిస్తున్నారు.

-కొక్కిలిగడ్డ సుధారాణి, పావని, సెకండ్‌గ్రేడ్ టీచర్స్

నిరంతరం శ్రమించాం

మాది చిత్తూరు జిల్లా పుంగనూరు సమీపంలోని వేపమాకులపల్లె. అమ్మ గౌరమ్మ. నాన్న మునివెంకటప్ప. నాన్న చిన్నప్పుడే చనిపోయారు. మేము నలుగురు అక్కచెల్లెల్లం. మాకోసం అమ్మ ఎంతో కష్టపడ్డారు. ఆర్థిక



ఇబ్బందులు ఎన్నో చవిచూశాం. మా అమ్మ కష్టం వృథా కాకుండా ఉండాలంటే అందరం పోటీపడి చదవాలని నిర్ణయించుకున్నాం. అక్క వీణా కుమారి, వనజాక్షి పోలీస్ కానిస్టేబుళ్లుగా ఉద్యోగాలు సాధించారు. నేను, చెల్లి సెకండ్‌గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) ఉద్యోగాల్లో సత్తా చాటాం. చావో రేవో అన్నట్లుగా డిఎస్సీకి ప్రిపేర్ అయ్యాం.తిన్నామో లేదో కూడా తెలియదు. అయినా కష్టాలను ఎదుర్కొన్నాం. ఇప్పుడు మేము నలుగురం ఉద్యోగస్తులమే. ఇక మా అమ్మకు ఎలాంటి కష్టం రాకుండా చూసుకుంటాం. మంచి జీవనాన్ని ప్రస్తాదిస్తాం.

-వాణి, శిరీష, సెకండ్‌గ్రేడ్ టీచర్స్

కల నెరవేరింది



మాది ఏలూరు జిల్లా నూజివీడుమండలం బత్తులవారిగూడెం. గత కొన్ని సంవత్సరాలుగా ప్రిపేర్ అవుతున్నా. ప్రతిసారీ ఒకటి, అర, రెండు మార్కులు తగ్గి ఆగిపోతోంది. ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనైనా ఉపాధ్యాయ కొలువు పొందాలనుకున్నా. ఎంతో కష్టపడి చదివా. ఈ ఏడాది పరీక్షల్లో మోడల్ స్కూల్స్, స్కూల్ అసిస్టెంట్ పరీక్షల్లో విజయం సాధించా. మోడల్ స్కూల్ పరీక్షలో (టిజిటి) జోన్ టాపర్‌గా నిలిచా. ఎస్ఎలోనూ ఉత్తీర్ణత సాధించా. స్కూల్ అసిస్టెంట్‌గా పోస్టింగ్ ఎంచుకున్నా. ఇన్నేళ్లకు నా నెలవేరినందుకు సంతోషంగా ఉంది.

- యడవల్లి రమేష్, సోషల్ స్టడీస్, సూల్ అసిస్టెంట్

రాష్ట్రస్థాయి ర్యాంక్‌తో సంతోషం



మాది ప్రకాశం జిల్లా హనుమంతునిపాడు మండలం మోరవారిపల్లి గ్రామం. గణితంలో 90.11 మార్కులతో డిఎస్సీలో రాష్ట్రస్థాయిలో మూడు, జిల్లాలో రెండో ర్యాంకు సాధించా. గత కొన్ని సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నా. ఉపాధ్యాయ పోస్టు కోసం సచివాలయ సెక్రటరీ ఉద్యోగాన్ని కూడా వదులుకున్నా. బాగా ప్రిపేర్ అయ్యా. ఈ డిఎస్సీ ద్వారా నా కల నెరవేరింది.

-భూమిరెడ్డి కృష్ణయ్య, గణితం, సూల్ అసిస్టెంట్

ఎమ్మీ అవార్డ్స్- 2025లో 'సెవెరెన్స్' సత్తా



సినీరంగంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఎమ్మీ అవార్డ్స్-2025 వేడుక లాస్ ఏంజిల్స్ (యూఎస్)లోని పికాక్ థియేటర్‌లో జరిగింది. తాజాగా జరిగిన 76వ ఎమ్మీ అవార్డుల వేడుకలో రెండు రికార్డ్స్ నమోదయ్యాయి. హాలీవుడ్‌కు చెందిన ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొన్నారు. 27 నామినేషన్లతో అత్యధిక అవార్డులకు ఎంపికైన డ్రామా సిరీస్ 'సెవెరెన్స్' ఎనిమిది అవార్డులను గెలుచుకుంది. ఈ మూవీలో నటించిన టిల్‌మాన్ అత్యుత్తమ సహాయ నటుడిగా అవార్డును గెలుచుకున్నారు. ఈ అవార్డ్ అందుకున్న తొలి నల్లజాతి సంతతికి చెందిన వ్యక్తిగా ఆయన రికార్డ్ సృష్టించారు. ఉత్తమ డ్రామా సిరీస్‌గా 'ది పిట్' ఎంపికైంది. ఇందులో ప్రధాన పాత్రలో నటించిన నోహ్ వైల్ 26 సంవత్సరాల తర్వాత మరోసారి ఎమ్మీని గెలుచుకున్నారు. నెట్‌ఫ్లిక్స్ హిట్ సిరీస్‌గా గుర్తింపు పొందిన 'అడోలెసెన్స్'లో నటించిన ఓవెన్ కూపర్‌కు ఉత్తమ సహాయనటుడిగా అవార్డు దక్కింది. ఎమ్మీ అవార్డ్ అందుకున్న అత్యంత పిన్న వయసు ఉన్న వ్యక్తిగా ఓవెన్ కూపర్ (15) గుర్తింపుపొందారు.

ఉత్తమ డ్రామా సిరీస్- ది పిట్ (హెచ్‌బిఒ మాక్స్)
ఉత్తమ నటుడు- నోహ్ వైల్ (ది పిట్)
ఉత్తమ నటి - బ్రిట్నీ లీ లోయర్ (సెవెరెన్స్)
ఉత్తమ సహాయనటుడు - ట్రామెల్ టిల్మాన్ (సెవెరెన్స్)
ఉత్తమ కామెడీ సిరీస్-ది స్టూడియో
ఉత్తమ లిమిటెడ్ సిరీస్- అడోలెసెన్స్ (నెట్‌ఫ్లిక్స్)
ఉత్తమ సహాయనటుడు లిమిటెడ్ సిరీస్- ఓవెన్ కూపర్ (అడోలెసెన్స్)
ఉత్తమ డాక్యుమెంటరీ సిరీస్- 100 ఫుట్‌వేవ్
ఉత్తమ యానిమేషన్- ఆర్కేన్‌లీగ్ ఆర్ లెజెండ్స్ (నెట్‌ఫ్లిక్స్)



నవంబరు 7న 'జటాధర'

సుధీర్ బాబు హీరోగా ప్రేరణ అరోరాతో కలిసి జీ స్టూడియోస్ నిర్మిస్తున్న చిత్రం 'జటాధర'. ఈ చిత్రాన్ని వెంకట్ కళ్యాణ్‌తో పాటు అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహిస్తున్నారు. అనంత పద్మనాభ స్వామి ఆలయం అక్కడి సంపద, దాని చుట్టూ అల్లుకున్న వివాదాలు, నేపథ్యం, చరిత్ర ఇలా అనేక అంశాలను ఈ చిత్రంలో చూపించనున్నారు. ఈ సినిమాతో సోనాక్షి సిన్హా టాలీవుడ్‌లో అడుగుపెట్టబోతున్నారు. తాజాగా ఈ సినిమాని నవంబరు 7న విడుదల చేస్తున్నట్టు చిత్రబృందం వెల్లడించింది. అందుకు సంబంధించి పోస్టర్‌ని మేకర్స్ రిలీజ్ చేసారు. తెలుగు, హిందీ భాషల్లో ఈ సినిమాని రిలీజ్ చేయనున్నారు.

'స్పిరిట్'ను ఆదరించాలి : బాబూమోహన్



'గ్రామీణ ప్రాంతంలో ఎక్కడో మారుమూల గ్రామంలో జన్మించిన చెన్నైబోయిన నర్సమ్మ ఎంతో ధైర్య సాహసాలతో సినిమా తీయటం గొప్ప విషయం. ముందుగా ఆమె ధైర్యాన్ని మెచ్చుకుంటున్నా. సామాజిక సమస్యగా ఉన్న మాతంగుల జీవితాలను ప్రతిబింబించేలా నిర్మించిన ఈ 'స్పిరిట్' (ఈజ్ నాట్ వన్) సినిమాను ఖచ్చితంగా ప్రేక్షకులు చూసి ఆదరించాలని కోరుతున్నా. కథ మొత్తంగా విన్నాక మంచి సందేశాత్మక చిత్రంగా ఉంటుందనే నమ్మకం మరింతగా బలపడింది. అందుకే ఇలాంటి సినిమాలను ఆదరించాలని కోరుతున్నా. నా వంతుగా నేను కూడా ఈ సినిమా ప్రచారం కోసం కృషిచేస్తా' అని సీనియర్ సినిమా నటుడు బాబూమోహన్ అన్నారు. 8త్ వండర్ సినిమా బ్యానర్‌పై 'స్పిరిట్ (ఈజ్ నాట్ వన్)' సినిమాను సిహెచ్ వెంకట రవీంద్రనాథ్ ఎంఎస్ దర్శకత్వంలో తెరకెక్కించారు. చెన్నైబోయిన చిన వెంకటస్వామి సమర్పణలో చెన్నైబోయిన నరసమ్మ నిర్మాత. సంగీతం సంతోష్ కావాలి, డిఒపి పి.భరత్‌రాజ్ కమల్, ఎడిటర్ కెవివై పాపారావు. రవిబాబు, సత్యప్రకాష్, చిత్రం శ్రీను, రాజశేఖర్, సైదులు, నాగ్‌తేజ్, చిట్టిబాబు, రమ్య, రజనీ, డాలీ నటించారు. హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నిర్మాత చెన్నైబోయిన నరసమ్మ దంపతులను ఘనంగా సత్కరించి అభినందించారు. సినిమా ప్రేక్షకుల ఆదరణతో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

బ్యాక్‌గ్రౌండ్ ఉంటేనే అవకాశాలు..



'ఇండస్ట్రీలో రాణించాలి అంటే అవకాశాలు రావాలి.. అవకాశాలు రావాలి అంటే బ్యాగ్రౌండ్ ఉండాలి' అంటున్నారు బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా. తన సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించడానికి ఉన్న కారణాన్ని ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ అంశాన్ని ప్రస్తావించారు. 'మిస్ వరల్డ్ గెలిచిన తర్వాత నాకు హిందీ, తమిళ సినిమాల్లో ఆఫర్లు వచ్చాయి. కానీ రెండేళ్లకే బాలీవుడ్ పరిస్థితులు అర్థమైంది. సినీ బ్యాగ్రౌండ్ లేని వారిని ఎంత తక్కువగా చూస్తారో తెలిసింది. ఇండస్ట్రీలో తరతరాలుగా ఉన్నవారే ఎక్కువ అవకాశాలు పొందుతారు. అలాంటప్పుడు బయట నుంచి వచ్చిన వాళ్ల నిలదొక్కుకోవడం చాలా కష్టం. అయినప్పటికీ నేను కష్టపడి ఆఫర్లు దక్కించుకున్నాను. పట్టుదలతో పని చేయడం నా అలవాటు. కానీ నేను ఎదుర్కొన్న కష్టాలు ఇతరులు ఎదుర్కోకూడదని అనిపించింది. అందుకే 2015లో 'పర్పుల్ పెబుల్ పిక్చర్స్'ను ప్రారంభించాను. కొత్తగా వచ్చిన వారికి ప్రోత్సాహం చేయడమే నా లక్ష్యం' అని అన్నారు. ఆమె నిర్మాణ సంస్థలో 2016లో భోజ్‌పురి సినిమాతో తొలి ప్రాజెక్ట్ ప్రారంభమైంది. ఆ తర్వాత పలు భాషల్లో విజయవంతమైన చిత్రాలను ప్రియాంక చోప్రా నిర్మించారు.

ఫిడే మహిళల గ్రాండ్ స్విస్ టైటిల్ విజేత వైశాలి

2026 క్యాండిడేట్ టోర్నీకి అర్హత



హాంగ్జౌ(చైనా): చదరంగం బోర్డుపై భారత గ్రాండ్‌మాస్టర్లు అదరగొడుతున్నారు. ముఖ్యంగా మహిళా గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్‌తో పాటు తాజాగా ఆర్. వైశాలి స్విస్ టైటిల్‌ను కైవసం చేసుకొని రికార్డుపుటల్లోకెక్కింది. ఫిడే మహిళల వరల్డ్ కప్ టైటిల్‌తో దివ్య దేశ్‌ముఖ్ ఇటీవల చేజిక్కించుకొని కొత్త అధ్యాయం లిఖించగా.. తాజాగా ఆర్. వైశాలి ప్రతిష్టాత్మక గ్రాండ్ స్విస్ టైటిల్ కైవసం చేసుకుంది. ఈ టైటిల్‌ను వైశాలి చేజిక్కించుకోవడం ఇది వరుసగా రెండోసారి. దీంతో వైశాలి ఈ టైటిల్‌ను రెండుసార్లు చేజిక్కించుకొన్న తొలి మహిళా గ్రాండ్‌మాస్టర్‌గా రికార్డుపుటల్లోకెక్కింది. సోమవారం జరిగిన చివరి, 11వ రౌండ్ గేమ్‌లో వైశాలి.. మహిళల ప్రపంచ ఛాంపియన్, చైనాకు చెందిన టాంగ్ జోంగ్యీతో మ్యాచ్‌ను డ్రా గా ముగించింది. దీంతో అత్యధిక పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి టైటిల్ కైవసం చేసుకుంది. ఈ టైటిల్‌ను చేజిక్కించుకోవడం ద్వారా వైశాలి.. 2026 మహిళల క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించింది. సోదరుడు ప్రజ్ఞానంద తరహాలోనే వ్యూహాత్మక ఎత్తులు వేస్తూ ప్రత్యర్థులను మట్టికరిపించే వైశాలి.. తొలిరౌండ్‌నుంచి ప్రత్యర్థులకు చెక్ పెడుతూ.. పాయింట్లను కొల్లగొడుతూ వచ్చింది. వచ్చే ఏడాది క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించిన మూడో భారతీయురాలిగా వైశాలి నిలిచింది. అంతకుముందు కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్ ఈ టోర్నీకి ఇప్పటికే బెర్తులు దక్కించుకున్నారు.

సిరాజ్‌కు ఐసిసి అవార్డు

ఆగస్టు నెలకు 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' కైవసం



దుబాయ్: హైదరాబాద్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు ఐసిసి అవార్డు దక్కింది. అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో చివరిదైన ఓవల్ టెస్టులో సంచలన బౌలింగ్‌తో మెరిసిన సిరాజ్‌కు ఆగస్టు నెలకుగానూ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డు లభించింది. ఈ అవార్డు కోసం మ్యాట్ హెన్రీ(న్యూజిలాండ్), జైడెన్ సీల్స్ (వెస్టిండీస్) పోటీపడగా.. అత్యధిక ఓట్లతో భారత పేసర్ విజేతగా నిలిచాడు. ఇంగ్లండ్ పర్యటనలో ఐదు టెస్టులు ఆడిన సిరాజ్.. ఏకంగా 185.3 ఓవర్లు బౌలింగ్ చేసి 23 వికెట్లు పడగొట్టాడు. అలాగే 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు. చేశాడు. నిర్ణయాత్మక ఐదో టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లో 9వికెట్లు పడగొట్టా సిరీస్ 2-2తో సమం చేశాడు.

మెరిసిన వసీం, షరాఫు

సూపర్-4 రేసులో యుఎఇ
వరుసగా రెండో ఓటమితో ఒమన్ ఔట్..

అబుదాబి: ఆసియా కప్ క్రికెట్ టోర్నీలో ఆతిథ్య యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జట్టు బోణీకొట్టింది. గ్రూప్-ఎ తొలి లీగ్‌లో భారత్ చేతిలో ఓడిన యుఎఇ.. రెండో లీగ్ మ్యాచ్‌లో ఒమన్‌ను చిత్తుచేసి సూపర్-4 రేసులో నిలిచింది. సోమవారం ఒమన్‌తో జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో యుఎఇ జట్టు 42 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. సొంతగడ్డపై తమదైన ఆటతో ఒమన్ బౌలర్లపై విరుచుకుపడి నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 172 పరుగుల భారీ స్కోర్ చేసింది. కెప్టెన్ ముహమ్మద్ వసీం(69), ఓపెనర్ అలీషాన్ షరాఫు(51) అర్ధసెంచరీలతో రాణించారు. వీరికి తోడు హర్షిత్ కౌశిక్(19), జొహైబ్(21) మెరుపు ఇన్నింగ్స్‌తో అలరించాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఒమన్‌కు అదిరే ఆరంభం లభించింది. యుఎఇ ఓపెనర్లు ఆలీషాన్ షరాఫు, మహ్మద్ వాసీం కలిసి తొలి వికెట్‌కు 88పరుగులు జతచేశారు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు బ్యాటర్లు రాణించారు. ఆసిఫ్ ఖాన్(2), రాహుల్ చోప్రా(0) మాత్రమే నిరాశపరిచారు. ఒమన్ బౌలర్లలో జితిన్‌కు రెండు, హసన్, సమయ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. భారీ ఛేదనలో ఒమన్ జట్టు 18.4ఓవర్లలో 130 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ జితేందర్(20), బిస్ట్(24), వినాయక్(20) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. యుఎఇ బౌలర్లు సిద్దిఖ్‌కు నాలుగు, హైదర్ అలీ, మహ్మద్‌కు రెండేసి, రోహిత్ ఖాన్‌కు ఒక వికెట్ దక్కాయి. వరుసగా రెండో ఓటమితో గ్రూప్-లో ఒమన్ జట్టు సూపర్-4 నుంచి నిష్క్రమించగా.. పాకిస్తాన్-యుఎఇ జట్ల మధ్య జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో గెలిచిన జట్టుకు సూపర్-4 బెర్త్ దక్కనుంది.

గ్రూప్-బిలో శ్రీలంక నాలుగు వికెట్ల తేడాతో హాంకాంగ్‌పై విజయం సాధించి సూపర్-4కు చేరింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన హాంకాంగ్ నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 149పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని శ్రీలంక 18.5ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి ఛేదించింది. నేడు బంగ్లాదేశ్-ఆఫ్ఘనిస్తాన్‌తో తలపడనుంది.

చివరి రైడ్‌లో గెలిచిన ముంబ

చేజేతులా ఓడిన టైటాన్స్
ప్రొ కబడ్డీ సీజన్-12



జైపూర్: ప్రొ కబడ్డీ సీజన్-12 పోటీలు నువ్వా-నేనా అన్నట్లు సాగుతున్నాయి. విశాఖపట్నం వేదికపై వరుసగా మూడు విజయాలతో సత్తా చాటిన తెలుగు టైటాన్స్.. జైపూర్ వేదికపై విరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓటమిపాలైంది. బెంగళూరు బుల్స్‌తో చివరి రైడ్‌కు ముందు 32-31పాయింట్ల ఆధిక్యతలో నిలిచిన టైటాన్స్.. బుల్స్ రైడర్‌ను నిలువరించడంలో విఫలమై ఇద్దరు ఔటయ్యారు. దీంతో బుల్స్ 33-32పాయింట్ల తేడాతో విజయం సాధించింది. బుల్స్‌పై మ్యాచ్ ప్రారంభం నుంచి స్వల్ప పాయింట్లతో చివరి వరకు ఆధిక్యతను కనబర్చిన టైటాన్స్ చేజేతులా ఓటమిపాలైంది. టైటాన్ కెప్టెన్ విజయ్ మాలిక్(9), భరత్(13) రైడ్స్‌లో రాణించగా.. ట్యాకిల్స్‌లో విఫలమయ్యారు. ఇక బుల్స్ జట్టులో అల్‌రెజా(11), కెప్టెన్ యోగేశ్(3) ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచారు. ఈ ఓటమితో 7మ్యాచ్‌లు ముగిసేసరికి టైటాన్స్ 5వ స్థానానికి పడిపోగా.. బెంగళూరు బుల్స్ 4వ స్థానానికి ఎగబాకింది. అంతకుముందు జరిగిన తొలిమ్యాచ్‌లో హర్యానా స్టీలర్స్ 40-37పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తుచేసింది. నేడు యుపి యోధాస్-బెంగాల్ వారియర్స్, తమిళ్ తలైవాస్-బెంగళూరు బుల్స్ జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68